
# కథామంజరి

## పది కథల సమాహారం



జూన్ 2026

# కథామంజరి

## పది కథల సమాహారం

**జూన్ 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 6



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు

# కథామంజరి శ్రావ్యసంచిక



**ఈ నెల శ్రావ్యసంచికకి**
**సహకారం అందించిన గళాకారులు**

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కాజూన్స్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... ... ... | ii |
| కథా పరిచయం | ... ... ... ... ... ... | iv |
| కథాపుస్తక విశ్లేషణ | ... ... ... ... ... ... | vii |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ... ... ... ... ... ... | ix |


## కథలు


| | | | |
|---|---|---|---|
| వైద్యో నారాయణో... | ... | జయంతి ప్రకాశ శర్మ ... ... | 1 |
| పురుగులు | ... | అవసరాల వెంకటరావు ... ... | 8 |
| అంకెల మధ్య చిక్కుకున్న చిన్నమనసు | ... | మోచర్ల అనంత పద్మనాభరావు ... | 13 |
| గురుడా... మజాకా!!! | ... | కృపాకర్ పోతుల ... ... ... | 21 |
| శౌచాలయం | ... | నండూరి సుందరీ నాగమణి ... | 26 |
| కుమ్ములాట | ... | కోయిలాడ రామమోహనరావు ... | 32 |
| ఆ రచయితను నేనే | ... | వెంపటి కామేశ్వర రావు ... ... | 38 |
| కనువిప్పు | ... | ఎస్. ఆర్. ఎస్. ఎస్. చలపతి రావు ... | 43 |
| వరం – వంకాయల ప్రహసనం | ... | శ్రీమతి సరస్వతి ... ... ... | 48 |
| 'పట్టుచీరలు' పని చేస్తాయా? | ... | డా. శాంతినారాయణ ... ... | 52 |


Cover Page Credit : Fabrizio Avila, Mexico



# కథాకీయం

ఏ రచయిత అయినా.. తన రచనలను ముద్రణలో చూసుకోవాలనే తపన ఉంటుంది. ఇప్పటికీ ఉంది కూడా! ముద్రణలో పత్రికా వ్యవస్థ బాగా పడిపోయిన తర్వాత.. సాంఘికమాధ్యమాలు రచనలకు ఆలంబనాలుగా నిలిచిపోయాయి. రాసిన ప్రతీ అక్షరాన్ని, ఎవరి అంగీకారం అక్కర్లేకుండా పాఠకులకు అందించవచ్చు. . అయితే నాలుగు లైకులు, మరో నాలుగు కామెంట్స్ చూసుకుని మురిసిపోవడమే కాకుండా, పెద్ద రచయితలుగా చలామణి అయిపోతున్నారని.. నేటి కథ, కథకుల గురించి, ఈ మధ్య ఓ పెద్దాయన వాపోయారు. అయితే.. ఇంకా పది కంటే తక్కువ సంఖ్యలో ముద్రణలో వస్తున్న పత్రికలు, అంతర్జాలంలో వచ్చే పత్రికలు.. కొంతమేర సాహిత్య విలువలను కాపాడ్డానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో.. ముఖ్యంగా అంతర్జాల పత్రికలని వ్యాపారాపేక్ష లేకుండా నడిపించడం శ్లాఘనీయం!

ఈ నేపథ్యంలో.. తమ కథలను, సాంఘికమాధ్యమాలలో కాకుండా, ఈ పత్రికలలో చూసుకోవాలనే తపన ఇప్పటి రచయితలలో ఉండటం సహజమే!


ఇప్పుడు వెలువడుతున్న తెలుగు పత్రికల్ని నడిపిస్తున్నవారు, సంపాదకులు కూడా మంచి కథలు వ్రాసినవారే, సాహితీవేత్తలే! ఆయా పత్రికల్లో పనిచేసేవారు, సేవలు అందించేవారు కూడా కథకులు, కథాభిమానులే! ఆ కోవలోనే “కథామంజరి” కి సేవలందిస్తున్న వారిలో ఎక్కువ మంది మంచి కథకులే! “ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరైనట్టు”.. ఈ కథకులతో పాటు సేవలు అందిస్తున్న గళకళాకారులు, చిత్రకారులు కూడా కథలు వ్రాస్తున్నారు. అయితే కొన్ని నైతిక విలువలను పాటిస్తూ, క్రమశిక్షణతో.. కథామంజరిలో తమ కథలను చూసుకోవాలనే కోరికల్ని పక్కన పెట్టేసారు! పూర్తిగా స్వచ్ఛంద సేవలందిస్తూ, దగ్గరుండి నడిపిస్తున్న మా బృందం రచనలతో ఓ సంచిక తీసుకురావాలని నిర్ణయించుకుని, గతంలో ఒకట్రెండు సంచికలు తీసుకొచ్చాం! ఇప్పుడు ఆరు సంవత్సరాలు నింపుకుంటున్న ఈ సంచికను కూడా “కథామంజరి బృందం” కథలతో విడుదల చేస్తున్నాం! మా బృందం అందిస్తున్న సేవలకు ఇంతకంటే ఏం ఇవ్వగలం!!

కథలు చదివి, నిక్కచ్చిగా మీరు అభిప్రాయాలను తెలియచేస్తే.. మా తాహతు మాకు తెలుస్తుంది!!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి

**డా. శాంతినారాయణ**



మా ముందున్న తరంలో ఉన్న సాహితీవేత్తలను పరిచయం చేయాలంటే.. 'సూర్యుడు ముందు దివిటీ' చూపిస్తున్నామా అనే సందేహం కలుగుతూ ఉంటుంది. వారి గురించి ఎంత చదివినా, ఎంత వ్రాసినా.. తక్కువే అనిపిస్తుంది. అయితే నేటితరం వారికి.. ఆ సాహితీవేత్తల గురించి తెలియచేయాలనే బాధ్యత కొంత ధైర్యాన్ని ఇస్తుంది. ఎన్నో ప్రకాశవంతమైన రచనలతో ఆరు దశాబ్దాలుగా సాహితీ సేవలు అందిస్తూ, రాయలసీమ మాండలికాన్ని బాగా ఇష్టపడి, ప్రాచుర్యంలోకి తీసుకొచ్చిన నిన్నటి తరం రచయితలలో ముందు వరసలో చెప్పుకోదగ్గ రచయిత డా. శాంతినారాయణ గారు! "కథ ఇష్టంగా చదివించగలగాలి, కథావస్తువు పాఠకుడ్ని ప్రేరేపించగలగాలి. కథా పరంగా ఆయా మాండలికాలను పాత్రల చేత పలికించాలి. అలాంటి కథలు, కథకులు అంటే నాకు ఇష్టం. ఆ కథలే నన్ను ప్రభావితం చేసాయి!" అని అంటారు ఆయన.

డా. శాంతినారాయణ గారు ఓరియంటల్ కాలేజీలో చదవడం.. ఆ వాతావరణం ఆయన్ని అష్టావధానాల మార్గంలోకి నడిపించింది. దరిమిలా కథా సాహిత్యం వైపు కూడా దృష్టి పెట్టడంతో, 1972లోనే 'రక్తపుముద్ద పిలిచింది' కథా సంపుటి వెలువడింది. 1976లో మరో సంపుటి 'రస్తా'. ఆ రోజుల్లో సినారె గారి ప్రభావంతో గేయరచన వైపు కూడా అడుగులు వేయడం.. ఆలోచనలో మార్పులు రావడం.. వీటి ప్రభావం వలననెమో, సాంప్రదాయ సాహిత్యాన్ని వదిలి, అభ్యుదయం వైపు అలోచనలు దారితీసాయి! ముఖ్యంగా రాయలసీమ మాండలికంలో అక్కడి ప్రజలు, సమాజంలో కనబడే సమస్యలు.. ముఖ్యంగా రైతుల గురించి చాలా ఎక్కువ రచనలు చేసారు.

డా. శాంతినారాయణ కథల్లో భాషకి, మాండలిక మాటలకి, పట్టుపదాలకి పెద్ద పీట వేసినట్టు కనబడుతుంది. కథ చూడగానే చదవాలనిపించే ఎత్తుగడ, చక్కటి శైలి కనబడతాయి. డా.శాంతినారాయణ గారి కథల్లో కథ వస్తువు కూడా మన చుట్టూ ఉన్న సమస్యలు, విషయాల మీదే ఉన్నా సరే.. 'ఇంకా సామాజిక జీవన స్థితిగతుల్లో ఇంకా కథకులు పట్టించుకోని పార్శ్వాలు చాలానే ఉన్నాయి' అంటారు! 'సాహిత్యంలో ప్రతీ ప్రక్రియా ఇష్టమే.. కాని సమస్యనో, సంఘటననో ప్రజల మధ్యకి తీసుకు వెళ్ళాలంటే.. కథ ద్వారానే సులభమవుతుంది' అంటారు. నేటి రచనలు, రచయితల గురించి, డా. శాంతినారాయణ గారు, ఓ ఇంటర్వ్యూలో మాటాడుతూ.. "సాంఘిక మాధ్యమాలలో కుప్పలు తెప్పలుగా వస్తున్న రచనలలో, ఆశించినంతగా సాహిత్యపు విలువలు కనబడటం లేదు. కొన్ని మంచివీ కనబడుతున్నాయి. అయితే ఒకప్పుడు ఏ సాహిత్య ప్రక్రియైనా సరే.. అచ్చులో చూసుకోవాలనే అభిలాష రచయితకి ఉన్నా, అది పదిమందికి చేరాలన్నా.. పత్రికలే శరణ్యం అయ్యేవి! ఇప్పుడు ఎవరు ఏది రాసిన ఈ మాధ్యమాలు ఆశ్రమం ఇస్తున్నాయి. విచ్చలవిడితనం, పెదధోరణులు ఎక్కువై పోయాయి! సాహిత్య సంరక్షణకూ, పోషణకూ ఈ మాధ్యమాలే దిక్కైతే, అముదం చెట్లే మహా వృక్షాలుగా చెలామణి అయ్యే ప్రమాదం పొంచి ఉంది! రచయితలు నాలుగైదు రచనలు చేస్తే.. వాటిని మెచ్చుకునే రాతలు చూసి పొంగిపోకూడదు. సాహిత్య సంస్కారం తెలుసుకుని ఒదిగి ఉండాలి. సాహిత్యాన్నీ, సమాజాన్నీ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా అధ్యయనం

చేసి, సమాజం పట్ల రచయితగా మన బాధ్యత ఏమిటో నిర్ణయించుకోండి!" అన్నారు. ఈ మాటలు రచనలు చేసే వారందరికీ శిరోధార్యం కావాలి!

జూలై 1, 1946 తేదిన అనంతపురం జిల్లాలో సి. బండమీద పల్లెలో జన్మించిన డా. యస్. నారాయణ గారు, విద్వాన్, ఎం.ఎ. పి.హెచ్.డి. చేసి, రాయదుర్గంలో జూనియర్ కళాశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగంలో చేరి, డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా 2004లో పదవీ విరమణ చేసారు. పలు అష్టావధానాలు, భువనవిజయ సభలు నిర్వహించిన డా. శాంతినారాయణ గారి 90కి పైగా కథలు, నవలలు, గేయాలు, పద్యాలు, వ్యాసాలు.. తో ఇరవైకి పైగా పుస్తక ప్రచురణలు చేసారు. ఎన్నో సత్కారాలు అందుకున్న వీరు.. "విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సాంఘిక సేవా సమితి" స్థాపించి, ప్రతీ ఏటా వచ్చే తెలుగు కథా, కవితా సంపుటాలలో ఎంపికైన వాటికి నగదు బహుమతులు అందజేస్తున్నారు. వీరి రచనలపై వివిధ విశ్వవిద్యాలయాలో పరిశోధనలు జరిపి, పలుమంది ఎం.ఫిల్, పి.హెచ్.డి. పొందారు. వీరి రచనలలో కొన్నింటిని, వివిధ విశ్వవిద్యాలయాలలో పాఠ్యాంశాలుగా కూడా తీసుకున్నారు. ఇలా మహోన్నతమైన సాహితీ సంపదను స్వశక్తితో సంపాదించి, ఎంతో ఎత్తు ఎదిగినా సరే ఒదిగి, ఎప్పుడూ సౌమ్యంగా పలకరించే డా. శాంతినారాయణ గారిని, కథామంజరి అడిగిన వెంటనే వివరాలు పంపి, ఎన్నో విషయాలను మాట్లాడి, ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఆయురారోగ్యాలతో మరిన్ని రచనలను తెలుగు ప్రజలకు అందించగలరని ఆశిస్తున్నాం.

**కథామంజరి బృందం**



# కథా పరిచయం

## కీ. శే. శశికళ ఓలేటి గారి కథ "నేలతో నీడయన్నది.."

శశికళ గారు ఇంక లేరు అంటే బాధ కలిగింది. ఆవిడ గురించి తెలియడం.. చిట్టెన్ రాజు గారి ద్వారా, సత్యం మందపాటి గారి ద్వారానే అంటే పరోక్షంగానే అయినా, ఆమెను గురించి తెలుసుకున్న తరువాత, ఆమె కథలు.. కథామంజరిలో. ముఖపుస్తకంలో అడపా దడపా చూస్తూ, చదువుతూన్నప్పుడు ఒక రచయిత్రిగా ఆమెపై గౌరవం పెరిగింది. ఇప్పుడామె వెళ్ళిపోయిన తరవాత ముఖపుస్తకంలో ఎందరో అర్పిస్తున్న నివాళులు చూస్తుంటే ఆమె వ్యక్తిత్వం, రచయిత్రిగా ఆమె సంపాదించుకున్న స్థానం ప్రస్ఫుటంగా కనబడతాయి.

ఆమె ఈ మధ్యనే ముఖపుస్తకంలో పంచుకున్న కథ 'నేలతో నీడయన్నది'. ఆమెకు నివాళిగా ఈ కథను పరిచయం చేద్దామనుకున్నాను. ఈ కథ 'మన కథలు – మన భావాలు' 7 వ వార్షికోత్సవ కథల పోటీలో అత్యుత్తమ రచనగా ప్రకటించబడింది.

చంద్రశేఖర్ పుట్టింది ఒక అందమైన ఊరు. చుట్టూ సముద్రం. మిలిటరీలో సేవ చేసిన తాత చెప్పే కబుర్లతో పెరిగినవాడు. చచ్చిన గొడ్ల తోళ్ళు శుభ్రం చేసే వాళ్ళమ్మ గురించి, వాళ్ళయ్య కుట్టిన అందమైన జోళ్ళు వేసుకుని జులుం చేసే బుగత గురించి, ఇలా ఎంతమంది గురించో ఎన్నో కబుర్లు చెప్పాడు! తాతకి రిజర్వేషన్లు తీసుకుని పైకి రావడం ఇష్టంలేని పని. అందుకే తనకిచ్చిన ఆ అయిదు ఎకరాల భూమిని తన రిజర్వేషన్ వలన కాకుండా, దేశం కోసం పోరాడిన సైనికుడిగా స్వీకరించానని గర్వంగా చెప్పుకునేవాడాయన. అలాంటి తాతకు మనవడు చందూ! అంతే కాదు, అతని కులం కేవలం ప్రభుత్వ చిట్టాలో నమోదయిన ఒక వర్గం పేరు మాత్రమేనని, నిజమైన అస్తిత్వం అతని తెలివి, విద్యాబుద్ధులు, సాధించిన విజయాల్లోనే ఉంటుందని చిన్న వయసులోనే తెలిసొచ్చింది. అందమయిన రూపం, శరీర దారుఢ్యముతో చందూ స్ఫురద్రూపిగా ఎదిగాడు.

ఐఏఎస్ సెలెక్షన్ తరవాత ఇచ్చే ట్రెయినింగ్ కోసం వచ్చాడు ఉత్తరాఖండ్ లోని ముస్సూరీకి! ఒకరోజు కల్చరల్ ప్రోగ్రామ్ లో సమీరా కుమార్ చేసిన భామాకలాపం చూసి మంత్ర ముగ్ధుడయ్యారు ప్రేక్షకులూ, చందూ కూడా! మంచి ఎత్తు, పొందికయిన అవయవ సౌష్టవంతో ఎంతో అందంగా ఉంది సమీర నాట్యం చేస్తూ! ఆమె కూడా ఐఏఎస్ లో ఎంపికైన అభ్యర్థి. తల్లి కూడా కూచిపూడి నర్తకి.

ఇన్స్టిట్యూట్ లో రోజూ చూస్తున్నా, సమీరాతో పరిచయం మళ్ళీ ఇంకో సందర్భంలో కలిసింది. చందూ ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ కి తను వచ్చి చేరింది. ఇద్దరూ తెలుగువారేనని తెలుసుకున్నారు. కలిసి చేసిన కారు ప్రయాణం, మూడు రోజుల

ట్రెక్కింగ్, ఇద్దరినీ దగ్గర చేశాయి. ఆమె ఎంత చనువిచ్చినా.. చందూలో ఏదో అంతరం అతన్ని ముందుకు పోనీయలేదు. చిన్నప్పటి నుంచి ఇద్దరు స్త్రీలు అతనికి దగ్గరైనవారు. తన తల్లి ఒకరైతే, మరొకరు తన ప్రాణ స్నేహితురాలు నీహారిక! సమీర ఆ ఇద్దరికీ దగ్గరగా రాదనిపించింది చందూకి!

సమీర తండ్రి తరుణ్ కుమార్ రాజకీయ పలుకుబడికి పేరొందిన ఢిల్లీలో, కేబినెట్ సెక్రెటరీ రాంకు ఉన్న అధికారి. ఆయన్ని ఈ రోజు కలుస్తున్నాడు చందూ. అతనికి ముభావంగా స్వాగతం చెబుతాడు. ఒకప్పుడు జపాన్ లో రాయబారిగా పనిచేసిన సమీరా పెదనాన్న, రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జిగా చేసిన మేనమామ, సివిల్ సర్వెంట్ ల దర్పమంతా కలబోసినట్లు గచ్చకాయరంగు సూట్ లో తరుణ్ కుమార్.. ఈ ముగ్గురూ కలసి.. ఒక ఇంటర్వ్యూ లాగా చందూతో సంభాషణ మొదలెట్టారు.

మొదటి ప్రశ్నలోనే, తను ఆల్ ఇండియా టాపర్ గా అయింది రిజర్వేషన్ కేటగిరీ లోనే కదా అని! 'కాదు, తాను వచ్చింది ఓపెన్ కేటగిరీలో' అని చెప్పాడు మర్యాదగా. ఆ మాటలు పట్టించుకోకుండానే, చందూ తండ్రి డాక్టర్ సోమయ్య గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అని, తల్లి యూనివర్సిటీ ప్రొఫెసర్ అని ఏదో రెస్యూమ్ లోంచి చదివినట్లు చదివాడు పెద్దాయన. అక్కడితో ఆగలేదు. దేశంలో మేధావుల అవకాశాలన్నీ కొల్లగొట్టి బాగానే పైకొచ్చారని ఒక వ్యంగ్యమైన విసురు! తరుణ్ కుమార్ ఇంకా ముందుకెళ్ళి "అవకాశాలు సరే, వాట్ ఎబౌట్ క్వాలిటీ బావగారు? దేశంలో ప్రభుత్వ రంగాలన్నీ నాణ్యత లేని పనితనంతో తిరోగమనంలో ఉన్నాయి" అన్నాడు నిరసనగా. అంతలో తల్లి, సమీరా ప్రవేశించారు. తల్లి మృణాళిని తమ గొప్పలు, సమీరా గొప్పలు చెప్పుకుపోయింది.

చందూ అందరినీ ఉద్దేశిస్తూ "మీ అమూల్యమైన సమయానికి ధన్యవాదాలు సర్! నా కుటుంబాన్నీ, నా పుట్టుకను, దిగజార్చి చూసేవారితో నేను ఏ విధమైన సంబంధం పెట్టుకోలేను. మా కులాలు బాగుపడ్డాయి, కానీ, మాకు మా తాతగారు ఆదర్శం, మా కష్టంతో మేము పైకి వచ్చిన కుటుంబం మాది.. అని గర్వంగా చెప్పుకోగలను. ఇంతటితో మీకు, మీ అమ్మాయితో నా స్నేహానికీ ముగింపు చెప్పడం.. నా మనశ్శాంతికీ, ఆత్మ గౌరవానికి చాలా ముఖ్యం!" అంటూ సమీరాకేసి ఒక చిన్న నవ్వు విసిరి బయటకు వచ్చేశాడు.

తనను అశోకా హోటల్ లో ఉంచి, అక్కడ నుంచి కారులో తీసుకెళ్ళిన మనుషులు తను తిరిగి వెళ్ళేటప్పుడు ఎవరూ లేరు. ఎందుకుంటారింక? జరిగినది ఫోన్లో తల్లితో చెప్పుకున్నప్పుడు, తన తండ్రి కూడా ఎప్పుడు ఓ మెట్టెక్కినా, అది తన స్వయంకృషి వల్లే అని ఎన్నిసార్లు ఎలుగెత్తి అరచి ఉంటారో అన్నప్పుడు చందూకి దుఃఖం ఆగలేదు.

ఇంటికి వెళ్ళి తల్లితండ్రులతో తన బాధ పంచుకున్న తరవాత కొంచెం ఉపశమనం కలిగింది చందూకి. తన కోసం వేచి ఉన్న నీహారికను కలవడంతో కథ ముగుస్తుంది.

రచయిత్రి ఎంపిక చేసుకున్న నేపథ్యం, కులాల ప్రాతిపదికగా సంఘంలో పేరుకుపోయి ఉన్న prejudices. రిజర్వేషన్లు ఉపయోగించుకోకపోయినా, చదువు, టేలెంటు, సంస్కారం ఉన్నా సరే, రిజర్వేషన్లు వారికి ఉండవచ్చు అన్న ఆలోచన చాలు అవతలివారిని కించపరచడానికి! సమాజంలో ఉన్న సంస్కారం ఇదేనా అని రచయిత్రి తన కథ ద్వారా ప్రశ్నిస్తోంది.

## కథా పరిచయం

కొన్ని వందల ఏళ్ల చరిత్రలో కొన్ని వర్గాలవారు ఎంత తక్కువగా చూడబడ్డారో, ఎన్ని కష్టాలకు గురి అయ్యారో అన్నది, వారికి ఏ కారణం వల్ల రిజర్వేషన్లు ఏర్పరచారో మనం మర్చిపోయాం. మెరిట్ లో వచ్చిన వారిని కూడా అదే అద్దాలతో తక్కువ చేసి చూడడం జరుగుతోంది. ఈ కథ మనుషుల్ని మార్చకపోవచ్చు. కాని, ఒక రచయిత్రిగా శశికళ గారు సమాజంలోని ఒక సమస్యని పాఠకుల ముందుంచారు. అది అభినందించదగ్గ విషయం.

ఈ కథ ఆమె ముఖపుస్తకం గోడపై ఇంకా ఉంది. ఎవరైనా చదవ తలుచుకుంటే. ఈ కథే కాదు, ఆమె రాసిన ఎన్నో రచనలను అక్కడ చదవవచ్చు.


***పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్***



# కథాపుస్తక విశ్లేషణ

## ఎప్పటికీ సరిపోయే కథలు

ఈ మధ్య కాలంలో చదువుతున్న చాలా కథా సంకలనాలు చదవడం పూర్తయిన తర్వాత 'సమయం వృధా అయ్యింది' అన్న భావన కలిగిస్తున్నాయి. అందుకు విరుద్ధంగా అనిపించిన కథాసంకలనమే "కూల్డబ్బులు…" పట్నాల ఈశ్వరరావు గారు రాసిన 18 కథలు, మూడు సాహితీ వ్యాసాలతో వచ్చిన పుస్తకం.




నెలిమర్ల ఏట్లోంచి అలుగోలు మీదుగా వెళుతున్నది ఒక బస్సు. దారి మధ్యలో ఓ ఆడమనిషి, ఓ మగమనిషి బస్సెక్కుతారు. బస్సు ఎక్కాక, అలుగోలుకు చార్జీ ఎంతని అడుగుతాడు మగమనిషి.

"రూపాయిన్నర" కండక్టర్ జవాబు.

"మరి మా ఆడమడిసికి?"

బస్సు బస్సంతా గొల్లుమని నవ్వుతుంది.

"ఆడైనా, మగైనా ఎవరైనా చార్జీ ఒకటే" కండక్టర్ వెటకారంగా బదులిస్తాడు.

"రోజంతా ఇద్దరమూ ఒకే విధంగా పనిచేసినా మగ మనిషికి ఇచ్చే కూల్డబ్బులు ఆడవాళ్లకు ఇవ్వరని అందుకే అలా అడిగాను" అంటాడు ఆ మగమనిషి.

ఈ కథ పేరు "కూల్డబ్బులు". ఈ కథ సంకలనం పేరు కూడా ఇదే! నోట్లో నుండి నాలిక బయటకు పెట్టి సమాన వేతనాల చట్టాన్ని వెక్కిరించడానికి, ఇంతకంటే చిన్న కథ బహుశా ఎవరూ రాయలేరు. ఇదొక్కటే కాదు, ఈ పుస్తకాల్లో ఉన్న 18 కథలు కూడా ఒక్కొక్కటి ఒక్కొక్క అంశాన్ని సూటిగా స్పష్టంగా తనదైన శైలిలో రాసినటువంటి కథలు. పాతికేళ్ల క్రితం రాసిన కథలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ సరిపోయేటటువంటి కథలు ఇవి.

## కథాపుస్తక విశ్లేషణ

ఒక బడిపంతులు కొడుకు, సన్నకారు రైతు కొడుకు, ఇద్దరూ ఉపాధి కోసం వారి ఊరు విడిచి వలస వెళ్లిపోతారు. ఆ వలస కథ అప్పటికి ఇప్పటికీ మారకుండా అదే వరస. ట్రంపరితనం ఎందరి జీవితాలపై ఉక్కు పాదం మోపిందో! మోపుతుందో! ఏది సరైనదో, ఏది కాదో అర్థం కాని తీరులో, బతుకు వెళ్లదీస్తున్నది ఈ తరం! బతుకు తిప్పల తీరును విశ్లేషించిన కథ ఈ “బతుకు తిప్పలు”.

ఒక ప్రభుత్వ పాఠశాల, ఒక ప్రభుత్వ గెస్ట్ హౌస్ బంగాళా.. రెండింటిలో రాజకీయాల సవారీ చేస్తున్న ప్రభుత్వం దేనికి ప్రాధాన్యత ఇస్తుంది? అనేది ‘స్వ’పరిపాలన కథ.

సరిపోయేటంత వ్యంగ్యం, చురుక్కుమనే హాస్యం, సామాజిక అంశాలను కలిపి సరైన పరిమాణంలో ఎక్కువ కాకుండా తక్కువ కాకుండా... రాయబడిన కథలు. పాతికేళ్ల క్రితం రాయబడిన కథలు ఎక్కువగా ఉన్నప్పటికీ, సమాజం అనే కళ్లద్దాల్లోంచి చూస్తే కనబడుతున్న సమాజం యొక్క రూపం ఒకటే.. ఖచ్చితంగా చదివి తీరాల్సిన కథలు. అయ్యా! ఈశ్వరరావు గారూ! మీ నుండి మరిన్ని కథలు రావాలి!

***“రాంబో”***



# వినదగునెవ్వరు చెప్పిన..

అంతర్జాతీయంగా మే మూడవ తేదీని చిరుతపులి దినంగా జరుపుకుంటారు. బహుశా ఆ నేపథ్యం వల్లేమో మే 2026 నెల కథామంజరి కవర్ పేజీ పైకి హుందాగా వచ్చి కూర్చుంది ఓ చిరుతపులి. మొత్తం ఎనిమిది కథలు.. రెండు బాలల కథలు, మరో రెండు విశిష్ట అతిథి, కథా మార్గదర్శిల కథలతో మే నెల కథామంజరి వెలువడింది.

ఈనెల కథాకీయంలో వరల్డ్ స్టోరీ టెల్లింగ్ డే గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. అలాగే కథా సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన, చేస్తున్న ఉషా గాయత్రి, యజ్ఞన్న శాస్త్రి గార్ల గురించి తెలియజేయడం బాగుంది.

ఈ మధ్యనే భార్యను కోల్పోయిన జగన్నాథం ఎదురింటి గేటు వైపు చూస్తూ కూర్చున్నాడు. ఆ ఇంట్లో నుండి తనలాగే భర్తను కోల్పోయిన ఒకావిడ ఓ చేతిలో ఫ్లాస్కు, మరో చేతిలో పాలిథిన్ కవర్తో ప్రతిరోజు క్రమం తప్పకుండా బయలుదేరుతుంది. ఆమె ఎక్కడికి వెళుతుంది? ఏం చేస్తుంది?... కుతూహలంతో వెంబడించిన అతనికి తన భావి జీవితానికి ఓ మార్గదర్శనం లభించినట్లయింది. అక్కడ అసలు ఏం జరిగింది? అనేది జాస్తి రమాదేవి గారి 'జీవన తరంగాలు' లో తెలుసుకోవాల్సిందే!

వేగంగా పరిగెత్తుతున్న కాలం అందరి జీవితాల్లో విభిన్నమైన మార్పులు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఒక కొత్త ఆలోచనను మన ముందు పెట్టిన కథ తోట సుబ్రహ్మణ్యం గారి 'కొత్త ఆలోచన'.

ఒక చిన్నపాటి థ్రిల్లర్ షార్ట్ ఫిల్మును చూపించిన మజ్జి భారతిగారి కథ ఆకట్టుకుంది.

తండ్రి చనిపోయిన తర్వాత గాని ఆయన ఔన్నత్యం గురించి తెలియలేదు అతనికి. చివరికి అతను తన తండ్రి ఉద్యోగంలో తండ్రిలాగే ఇమిడిపోయి మారిపోవడమే వైచిత్రి. ఇదే 'నాన్న నీ మనసే వెన్న'.

లక్ష్మీ రాఘవ గారి కథ.. విదేశాల్లో ఉంటున్నప్పుడు అక్కడి వారి సంస్కృతికి మన సంస్కృతికి ఉండే తేడాల గురించి తెలియజేస్తే, మనిషిలో ఉండే అసూయ గురించి.. కోనేగారి 'శాలువా' కథ తెలియజేస్తుంది. వీటితో పాటు ఈ నెల కథామంజరిలో ఉన్న మరో రెండు బాలల కథలు వేటికవే బాగున్నాయి.

'నన్ను క్షమించవద్దు' ఉషా గాయత్రిగారి కథ అదనం. ఒక తప్పు చేయడం సులభం. దానితో జీవితం గడపడం కూడా. జీవితం చివరలో వచ్చే పశ్చాత్తాపం, ఆ తప్పు వల్ల క్షోభ పడ్డ వాళ్ల మనసుకు ఎలా ఓదార్పు అవుతుంది. సినిమాలో చూపినట్లు "జానకీ! నన్ను క్షమించు జానకీ!" అనగానే తప్పులు క్షమించేసి తిరిగి ఎప్పటిలాగా ఉండడం ప్రాక్టికల్ గా సాధ్యమేనా? చర్చనీయాంశం!

జాగ్రత్తగా చదవాల్సిన మరో కథ, సోమంచి యజ్ఞన్న శాస్త్రి గారి కథ. మొత్తం మీద ఈ నెల కథామంజరి లో అన్ని కథలు అలరించాయి.

***"రాంబో"***

# వైద్యో నారాయణో....

జయంతి ప్రకాశ శర్మ
✆ 9848629151

*"మన మీద నూరుశాతం నమ్మకంతోనే వస్తారు. మనల్ని భగవంతుడితో సమానమని కూడా భావిస్తారు! ఇలాంటి సేవలందించే అవకాశం అందరికీ రాదు. మనిషి జననం మన చేతులమీదనే జరుగుతుంది. మరణాలు కూడా ఎప్పుడైనా జరగవచ్చు కూడా! అంతమాత్రాన్న ఉత్తరకుమారుడిలా పారిపోకూడదు. ధీరుడుగానే విజయాలవైపు అడుగులు వెయ్యాలి! హిప్పోక్రటిస్ ప్రమాణం మనం చేసాం... గుర్తుందా?*

'ఏకధాటిగా పన్నెండు గంటలు పనిచేయడం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కానీ ఇప్పుడు పిపిఈ డ్రస్ వేసుకుని పన్నెండు గంటలు ఉండటమే చాలా కష్టంగా ఉంది. కరోనాకాలం ముగిసి నాలుగేళ్ళు గడిచినా, కొన్నిభయాలు అలా ఉండిపోయాయి! ఇప్పుడుకూడా మనిషిని ముట్టుకుంటే భయం, దగ్గినా, తుమ్మినా భయమే. ఇలాంటి పరిస్థితుల గురించి ఎప్పుడూ వినలేదు, ఊహించనూ లేదు! ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్ అంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనిచేస్తున్నారు!' ఆలోచిస్తూ కారు నడుపుతున్న హరిప్రసాద్, ఎదురుగా ఆపమని చెయ్యి ఊపుతున్న పోలీసుని చూసి, రోడ్డుపక్కకి తీసి కారాపాడు. అద్దం కిందకు దించి, అతని వైపు చూసాడు.

"ఏమిటి సార్... ఇప్పుడు షికారా?" పోలీసు హరివైపు వెటకారంగా చూస్తూ అడిగాడు.

హరిప్రసాద్ ఆసుపత్రినుండి ఇంటికి వెళ్లాలంటే బీచ్‌రోడ్డు వైపునుంచే వెళ్ళాలి.

"ఆసుపత్రినుంచి ఇంటికి వెళ్తున్నాను సార్!" వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ అన్నాడు హరిప్రసాద్.

"అందరూ అలానే చెబుతారు సార్!" పక్కనే స్కూటర్ మీద వెళ్తున్న ముగ్గుర్ని ఆపి, వాళ్ళతో మాట్లాడుతున్న మరో పోలీసుని క్రీగంట చూస్తూ అన్నాడు ఆ పోలీసు.

"నేను డాక్టర్ని..."

"ప్రతివాడూ ఇలానే అంటాడు. డాక్టరో, యాక్టరో ఎలా తెలుస్తుంది? తలమీద రాసుంటుందా!" ఆ పోలీసు దృష్టి అంతా ఆ పక్కన జరుగుతున్న వ్యవహారం మీదే ఉంది. అటుచూస్తూనే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు. చేతిలో ఉన్న ఆల్కహాల్ చెక్ చేసే గన్‌ని తీసి, హరి నోటిదగ్గర పెడుతూ మళ్ళీ అన్నాడు, "ప్రపంచంలో కరోనా ఉన్నా, కర్ఫ్యూ ఉన్నా, ఈ పని మాత్రం ఆపటం లేదు!"

“అబద్ధం చెప్పవలసిన అవసరం ఏముంది? ఆసుపత్రినుంచే వస్తున్నాను. ఇదిగో ఐడెంటిటీ కార్డ్!” జేబులోంచి కార్డు తీసి చూపెడుతూ, కోపంగా అన్నాడు హరిప్రసాద్.

కార్డు తీసుకుని ముందు, వెనక చూసి, తిరిగి తలనీ, దృష్టినీ పక్కనే ఆ పోలీసు నడుపుతున్న వ్యవహారం వైపు మళ్ళించి, నిర్లక్ష్యంగా చేతిలో ఉన్న లాఠీతో, ‘వెళ్లొచ్చు…’ అంటూ సిగ్నల్ చేసాడు.

“మీరు మీ డ్యూటీని చేయడంలో తప్పులేదు. కాని అమర్యాదగా వ్యవహరించటం మంచిది కాదు…” అంటూ పోలీసువైపు తీక్షణంగా చూస్తూ, హరిప్రసాద్ కారుని ముందుకు పోనిచ్చాడు. అంతకంటే ఆ సమయంలో పోలీసుతో దెబ్బలాడే ఓపిక, మూడ్ కూడా హరికి లేవు.



రాత్రి పదిగంటలైంది. ఇంటికి చేరిన హరి, నేరుగా తనగదిలోకి వెళ్తుంటే, పక్కగదిలో అత్తగారి మాటలు వినబడ్డాయి. ఊర్లోనే ఉంటున్న అత్తగారు అప్పుడప్పుడు వచ్చి, ఓ నాలుగురోజులుండి, వెళ్తుంటుంది. హరిప్రసాద్ మావగారు కూడా ఆ ఊర్లోనే డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూ ఉండేవారు. ఓ రెండేళ్ళ క్రితమే ఆయన కాలం చేసారు. హరిప్రసాద్ బామ్మర్ది ఊర్లోనే స్టీల్ ప్లాంట్లో ఇంజనీరుగా పనిచేస్తూ అక్కడ క్వార్టర్స్‌లో ఉంటాడు. అత్తగారు అతనితోనే ఉంటుంది.

“ఏమే అమ్మాయ్! మీ ఆయన ఇల్లు, వాకిలి కూడా పట్టించుకోకుండా అలా అసుపత్రికే అంకితం అయిపోవాలా? ఉదయం ఆరుగంటలకి వెళ్ళేడన్నావు. ఇప్పుడు రాత్రి పదైంది. ఇంకా వచ్చినట్టులేదు! మీ నాన్న కూడా డాక్టరే కదా... మరీ ఇంతలా లేదే తల్లీ!”

ఆ మాటలు వినబడేసరికి హరిప్రసాద్‌కి కోపం ముంచుకు వచ్చింది. కాని నిస్సహాయత అడ్డొచ్చింది. తాను వచ్చినట్టు ఇంట్లో ఎవరు గమనించినట్టు లేదు. అవకాశం కూడా ఉండదు.

ఆసుపత్రినుంచి రాగానే, వేసుకున్న బట్టల్ని వాషింగ్ మెషీన్‌లో వేసి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళడం అతని దినచర్యలో ఓ భాగమైపోయింది. అందులో కరోనా తర్వాత జీవితమే మారిపోయింది.

హాల్లోనుంచి తల్లీ, కూతురు మాటలు వినబడుతున్నాయి.

“తప్పదమ్మా... రోజులలా ఉన్నాయి, ఏం చేస్తాం చెప్పు!”

“రోజులలా ఉంటే మనం మారకూడదా! సంపాదించింది అనుభవించాలి కదా! ఇలా ప్రాణాలమీదకు తెచ్చి పెట్టుకునే ఉద్యోగాలు చేసి ఏం మిగుల్చుకోవాలి? కలోగంజో, ఉన్నదాంట్లో సర్దుకోవచ్చు! అయినా అంత లేనివాళ్లం కాదు కదా, ఈ ఆస్తిపాస్తుల్ని ఏం చేసుకోవాలి!” అత్తగారి మాటల్ని అర్థంచేసుకోడానికి హరిప్రసాద్‌కి అట్టే సమయం పట్టలేదు.

“నిజమే... కాని ఆయనకి చెప్పేవాళ్ళు ఎవరున్నారు చెప్పు!” భార్య తూచితూచి మాట్లాడుతున్నాది.

ఒక్కసారిగా బయటకు వెళ్ళి, వాళ్ళకి గట్టిగా సమాధానం చెపుదామన్నంత కోపం వచ్చింది హరిప్రసాద్‌కి! తమాయించుకుని, గబగబ స్నానం చేసి, బట్టలు వేసుకుని వచ్చి, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. మౌనంగా వడ్డిస్తూన్న భార్యతో ఏం మాట్లాడాలో తోచలేదు హరిప్రసాద్‌కి. భోజనం చేస్తుంటే ఉదయం ఆసుపత్రిలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

★★★

ఎవరో పేషెంట్ చనిపోతే, వాళ్ళ బంధువులు ఆసుపత్రి ఆవరణలోనే గొడవ చేస్తున్నారు. ఆసుపత్రి వాళ్ళ నిర్లక్ష్యం వలననే అతను చనిపోయాడని వాళ్ళు ఆరోపిస్తూ, పెద్దగా కేకలు వేస్తూ అక్కడే ధర్నాకి దిగిపోయారు.

హరిప్రసాద్ వేరే వార్డుకి వెళ్ళాలి. వారిని దాటుకుంటూ వెళ్ళడానికి ప్రయత్నం చేసాడు. కాని ఆ జనం అవకాశం ఇవ్వకుండా అతని చుట్టుముట్టిసారు. ఆ జనం మధ్యలో ఇద్దరు ముగ్గురు హౌస్ సర్జన్లు అప్పటికే ఉన్నారు.

ఈ మధ్య కాలంలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. డాక్టర్లు శాయశక్తులా ప్రయత్నాలు చేస్తున్నా సరే, ప్రాణాలు పోతున్నాయి. వేలల్లో ఒకటో రెండో కేసుల విషయంలో మానవతప్పిదాలు లేవని చెప్పలేం కాని, అవి చేజేతులా చేసినవి

కావు. చనిపోయిన పేషెంట్ మధ్యవయసు వాడే, కాని బాగా తాగుడు అలవాటుతో... ఆయన లివర్ పూర్తిగా చెడిపోయింది. వ్యాధి ముదిరిపోయిన తర్వాతే ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికీ డాక్టర్లు వాళ్ళ ప్రయత్నాలు వాళ్లు చేసారు... కాని ఫలితం కనబడలేదు.

ఆ విషయాలు వాళ్ళకి అర్థమయే భాషలో చెప్పడానికి హరిప్రసాద్ ప్రయత్నం చేసాడు. "చూడండి... ఇన్ని వేలమంది పేషెంట్లు వస్తున్నారు, కోలుకుని వెళ్తున్నారు. అందరికి మా శాయశక్తులా వైద్యం చేస్తున్నాం. ఈయనకీ అలాగే వైద్యం చేసాం. ఆయనకి ఆయుష్షు తేలేకపోయాం!" అంటూ హరిప్రసాద్ వారిని శాంతింపచేయడానికి ప్రయత్నం చేసాడు.

"ఆయుష్షు అంటారేమిటండి. ఆయన వయసు ఇంకా నలభై ఏళ్ళే! ఏం చదువులు చదువుతారండి? మా ప్రాణాలతో కొన్నాళ్ళు ఆటలాడుకుని, డబ్బులు చేసుకుని, తర్వాత తీసేస్తున్నారు!" ఆ పేషెంట్ తాలూకా వాళ్ళు ఎవరికి తోచింది వాళ్ళు అనేస్తున్నారు.

అటువంటి పరిస్థితులలో వాళ్లల్లో ఆవేశం రావడం సహజమే... డాక్టర్లుకూడా ఆవేశపడితే గొడవ పెద్దదవుతుంది తప్ప ప్రయోజనం ఉండదు. మౌనంగా ఉండటం మంచిదనే హరిప్రసాద్ మాట్లాడకుండా నిలబడిపోయాడు.

"చూడండి, మమ్మల్ని ఇలా కదలకుండా నిలబెట్టడం వలన మరో పేషెంట్ ప్రమాదంలో పడతాడు!" అంటూ ఓ హౌస్ సర్జన్ సీరియస్‌గా అన్నాడు.

అక్కడ జనానికి మరింత ఆవేశం వచ్చిసింది.

"ఛీఛీ... శవాల మీద డబ్బులేరుకునే మీరు, నీతులు చెప్తారా!"

"మీక్కూడా ఇలాంటి కష్టాలు వస్తే గాని, అర్థంకాదు!"

ఆ జనంలోంచి ఎవరికి తోచినట్టు వాళ్ళు మాట్లాడుతున్నారు. పరిస్థితి రానురాను ఉద్రిక్తతకు దారితీసింది. అటూఇటూ వెళ్తున్నవారు కూడా అక్కడ చేరి, ఆజ్యం పోస్తున్నారు. తానేం మాట్లాడినా వారు సమాధానపడే పరిస్థితిలో లేరు. 'మాట్లాడవద్ద'ని సంజ్ఞ చేస్తూ హరిప్రసాద్ మౌనంగా వారిమధ్యే నిలబడిపోయాడు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, ఆసుపత్రి ఆవరణలోనే పోలీసులను కూడా పెట్టారు. అక్కడికి కబురు వెళ్ళడంతో ఓ అరడజను మంది పోలీసులు హుటాహుటిన అక్కడకి వచ్చారు. గొడవ చేస్తున్నవాళ్ళతో ఎలా మాట్లాడాలో అలా మాట్లాడి, వాళ్లల్లో నలుగురిని ఆసుపత్రి ఛీఫ్ దగ్గరకి తీసుకెళ్లడంతో పరిస్థితి కొంత చక్కబడింది.

ఆలోచనల్లోంచి తేరుకున్న హరిప్రసాద్... భోజనం చేసి కాస్త రిలాక్స్ అవుదామని, ఫోన్ తీసుకుని మెసేజులు చూడసాగాడు. అక్కడా అదే గోల. సంచలనం కలిగించే విషయాలే! ఫోను ఆఫ్ చేసి, పక్కమీద వాలాడు. నిద్ర స్థానంలో ఆలోచనలు ముంచుకొస్తున్నాయి. ఆలోచనలకి అంతు ఉండటం లేదు, నిద్రకి త్రోవ రావడం లేదు. అలా మగతలోనే తెల్లారిపోయింది. ఫోన్ రింగు వినబడగానే, లేచి ఫోను చూసాడు. ఆసుపత్రినుంచి! రెండ్రోజుల క్రితం చేరిన పేషెంటుకి సీరియస్‌గా ఉందంటూ డ్యూటీలో ఉన్న హౌస్ సర్జన్ చెప్పాడు. అర్జంటుగా ఏం చెయ్యాలో చెప్పి, గబగబా తెమిలి ఆసుపత్రికి బయలుదేరాడు.

ఆసుపత్రికి వెళ్ళేదే గాని, మనసంతా కకావికలంగా ఉంది. ఇంట్లోమాటలు మస్తిష్కంలో సుడులు తిరుగుతున్నాయి.

“అదేమిటే... ఎంత పెద్దడాక్టరైతే మాత్రం, ఇలా ఇల్లువాకిలి పట్టకుండా, అదే లోకమనుకుని ఉండిపోవడం ఏమైనా బావుందా! అయినా పిల్లలు, వాళ్ళ ఆలనాపాలన కూడా పట్టించుకోకపోతే రేప్పొద్దున్న, వాళ్ళతో బంధాలు పోతాయి. ఇప్పటికే చుట్టాలు, పక్కాలు, ఫ్రెండ్స్ రాకపోకలు లేకుండాపోయాయి! ఎంత డబ్బు సంపాదించినా బంధాలు లేకపోతే, సంపాదనతో వాటిని కొనలేము!” నిన్నరాత్రి ఇంట్లో విన్న అత్తగారి మాటలే జ్ఞాపకం వస్తున్నాయి.

అన్యమనస్కంగా బట్టలు మార్చుకుని, హరిప్రసాద్ వార్డులోకి అడుగుపెట్టాడు. అక్కడ రోగులు, వాళ్ళ బంధువులు, వాళ్ళ ఆందోళనలు చూసేసరికి ఒక్కసారిగా ఇంట్లో జరిగిన సంభాషణలు మస్తిష్కంలోనుంచి మాయమైపోయాయి. గబగబా తన రూములోకి వెళ్లి పిపిఇ బట్టలు వేసుకుని, ఎమర్జెన్సీ వార్డులోకి పరిగెత్తాడు. అక్కడ సీరియస్‌గా ఉన్న పేషెంట్ దగ్గర డ్యూటీ డాక్టరు, హరిప్రసాద్‌ని చూడగానే పక్కకు జరిగాడు. విషయాలు కనుక్కొని, కేస్ షీట్ మీద ఏం చెయ్యాలో రాసి, ఊపిరి పీల్చుకున్నాడు. అక్కడ కేసులన్నిటినీ చూసేసరికి మధ్యాహ్నం పన్నెండు అయిపోయింది. ఆ టైములో అర్జంటు కేసులు లేకపోతే, తన రూముకు వెళ్ళి కాఫీ త్రాగి రావడం అలవాటే. వార్డ్‌లో మొదటి పేషెంటు దగ్గరకి వెళ్ళి, మానిటర్స్‌ని చూసి, తృప్తిగా బయటకు వచ్చాడు. తన రూములోకి వచ్చి ఫ్లాస్కులోని కాఫీ, కప్పులో పోసుకుని తాగుతుంటే, డాక్టరు రామకృష్ణ రూములోకి వచ్చాడు. హరిప్రసాద్, రామకృష్ణ కాలేజీ చదువుల్నుంచి మంచిమిత్రులు. ఆ టైములో కాస్త రిలాక్స్ అవడానికి ఖాళీగా ఉన్న డాక్టర్లు అక్కడ చేరుతారు. కాంటీన్ వాళ్ళు ఆ టైముకి కాఫీ రెడీ చేసి, ఫ్లాస్కులో పోసి అక్కడికి పంపుతారు. కాఫీ త్రాగుతూ, ఓ పదినిమిషాలు కబుర్లు చెప్పుకుని మళ్ళీ వార్డుల్లోకి వెళ్లటం వాళ్లకి అలవాటు.

“ఏమిటి, ఉదయాన్నే కంగారుగా ఐసిలోకి పరిగెత్తావు?” కూర్చుంటూ అడిగాడు.

“ఏముంది... అక్కడో పేషెంట్ పరిస్థితి బాగాలేదు! ఉదయాన్నే డ్యూటీ డాక్టరు కంగారుపడి ఫోన్ చేసాడు. అసలే నిన్న గొడవ విన్నావుగా... దాంతో అతను మరీ భయపడిపోయాడు. అందుకే త్వరగా వచ్చి, వార్డులోకి పరిగెత్తాను. ఉదయం కొంచెం సీరియస్ గానే ఉంది. ప్రస్తుతం బాగా ఇంప్రూవయిందిలే!”

ఆ సంభాషణ రెండునిమిషాలు సాగిన తర్వాత రామకృష్ణ, “నిన్న మన చంద్రం ఇంటికి వెళ్తుంటే, ఐసిలో ఉండే నర్స్ సుందరి లిఫ్టు అడిగిందిట. ఎక్కించుకొని వాళ్ళ ఇంటిదగ్గర దిగబెట్టి వెళ్ళాడుట! అది చంద్రం భార్య చూసిందిట... అంతే, మనవాడికి ఇంటిదగ్గర చెడుగుడు అయిపోయింది! ఉదయాన్నే చెప్పి గొల్లుమన్నాడు!” నవ్వుతూ అన్నాడు రామకృష్ణ.

“మనం తప్పు చేయనప్పుడు గిల్టీగా ఫీలవకూడదు! చంద్రం అలాంటివాడు కాదుగా!” హరి కాఫీ త్రాగడం ముగించి అన్నాడు.

“వాళ్ళావిడ కూడా ఉద్యోగం చేస్తున్నాది కదా... ఇలాంటివి విన్నా, చూసినా భర్త మీద అనుమానం రావడం సహజమే!” రామకృష్ణ ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసుకుంటూ అన్నాడు.

“టై కట్టుకుని, సూటు బూటు వేసుకుని ఆపరేషన్ చేసిన డాక్టర్ని చూసావా?” అంటూ రూములోకి వచ్చాడు ఇంకో డాక్టరు.

“అవునా... ఎవరు?” ఆశ్చర్యంగా అడిగాడు హరి.

"రాత్రి పదిగంటలకు టివిలో సీరియల్ వస్తుంది, అందులో కనబడతాడు!" నవ్వుతూ అన్నాడా డాక్టరు.

ఆ సంభాషణలు అలా మొదలై, దేశరాజకీయాల వరకు వెళ్ళి... టైము చూసుకుని, 'అమ్మో... పావుగంట అయిపోయిందా...' అనుకుంటూ ఎవరికివారు అక్కడ్నుంచి నిష్క్రమించారు.

"ఒక్క నిమిషం కృష్ణా!" అంటూ వెళ్ళిపోతున్న రామకృష్ణని ఆపాడు హరిప్రసాద్.

"ఈమధ్య ఎందుకో మనసు చాలా చికాకుగా ఉంది. ఇన్ని అవస్థలు పడుతూ, మాటలు పడుతూ, టెన్షన్లతో ఉద్యోగం చేయడం అవసరమా అని అనిపిస్తున్నాది!" హరిప్రసాద్ మాటలు వింటూనే రామకృష్ణ ఆశ్చర్యపోయాడు.

"ఏం జరిగింది!" తిరిగి కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"ఈమధ్యకాలంలో ఇంట్లోవాళ్ళకి అంటరానివాళ్ళమయ్యాం. ఆసుపత్రిలో ఎంత కష్టపడుతున్నా, మాటలు తింటున్నాం. ప్రతి అడ్డమైనవాడూ, మనకే వైద్యపాఠాలు చెపుతున్నాడు. చాలా టెన్షన్‌తో పనిచేస్తున్నా, జీతాల గురించి పనిచేస్తున్నట్టు మాట్లాడుతున్నారు! ఇటు పేషంట్స్‌ని తృప్తి పరచలేకపోతున్నాం, అటు అందరికీ దూరమైపోతున్నాం! జీతాలకైతే... ఆ అవసరం కూడా నాకు లేదు! అందుకే సీరియస్‌గా ఆలోచిస్తున్నాను!" సీరియస్‌గా అన్నాడు హరిప్రసాద్ .

"ఏం ఆలోచిస్తున్నావు?" ఆ ఆలోచన ఊహించినా, కావాలనే రామకృష్ణ అడిగాడు.

"ముందు నాలో ఆ ఆలోచన స్థిరపడితే, తర్వాత నీకు చెప్తాను."

"సరే... పద, మనకోసం ఎదురుచూస్తుంటారు!" నవ్వుతూ అంటూ "ఒక్క విషయం గుర్తుంచుకో! గెలుపోటములు జీవితంలో ఓ భాగం! ఏది ఎక్కువ అనే ఆలోచించుకోవాలి. అలాగే ప్రతీ మనిషిలోనూ కోపతాపాలు వుంటాయి... వీటికి మనం కూడా అతీతులం కాలేం! కాని ఎక్కువ సంయమనం మనకు అవసరం! అందుకే మనది ఉన్నతమైన వృత్తి అంటారు!" అంటూ రామకృష్ణ ఇంకా చెప్పుకుపోయాడు.

"సరే... తర్వాత మాట్లాడుకుందాం." అంటూ రూములోంచి బయటపడ్డాడు హరిప్రసాద్.

★★★

సాయంత్రం ఇంటికి వెళ్ళిన హరిప్రసాద్‌కి, అక్కడ వాతావరణంలో మార్పు కనబడలేదు. అత్తగారి మాటల్లో మార్పు లేదు సరికదా, కొంచెం బాధ కలిగించే భాషే ఆవిడ వాడింది.

"ఇలాంటివాళ్ళు పెళ్ళిచేసుకోకుండా ఉంటే మంచిది. ఏ వయసులో ఆ ముచ్చట్లు ఉండాలి గాని, తర్వాత విచారిస్తే లాభం ఉండదు! అయినా వీళ్ళు బయట ఏం వెలగబెడుతున్నారో మనకేం తెలుసు!" అల్లుడు వినాలనే గట్టిగా మాట్లాడుతున్న ఆవిడ మాటలు హరిప్రసాద్‌కి ఎక్కడో గుచ్చుకుంటున్నాయి. అయినా తను తప్పు చేయడం లేదు. తన వృత్తి అలాంటిది. గబగబా భోజనం చేసి పడుకున్నాడే గాని నిద్ర పట్టలేదు.

మిశ్రమ ఆలోచనలతో కళ్ళు మూతపడలేదు. అర్ధరాత్రి వరకూ పక్కగదిలోనుంచి అత్తగారి సణుగుడు వినబడుతూనే ఉంది. ఒక్కసారిగా పక్కమీదనుంచి లేచి, కాగితంమీద రాజీనామా లేఖ వ్రాసి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. తర్వాతే హాయిగా నిద్ర పట్టింది హరిప్రసాద్‌కి.

హరిప్రసాద్ ఉదయన్నే ఎప్పటిలాగే తెమిలి, ఆసుపత్రికి వచ్చిసాడు. తన రూముకి వచ్చి, జేబులో పెట్టుకున్న రాజీనామాని ఓసారి చూసుకున్నాడు. ఐసి, వార్డులను ఓసారి తిరిగొచ్చి, ఆసుపత్రి చీఫ్‌ని కలిసి ఉత్తరం ఇద్దామనుకున్నాడు.

వార్డులోకి అడుగుపెట్టిన హరికి అనుకోని ఘటన ఎదురైంది. ఆకస్మికంగా ఎటునుంచి వచ్చిందో తెలియదు గాని, ఓ పెద్దావిడ కాళ్ళమీద పడిపోయింది. ఆమెతోపాటు పదిమంది జనం కూడా ఉన్నారు.

"డాక్టరుబాబూ! మా అబ్బాయికి ప్రాణంపోసావు! ఎక్కడికి వెళ్ళినా కష్టం అన్నారు. అయినవాళ్ళకు కబురు పెట్టుకోమన్నారు. అలాంటిది నువ్వు దేవుడిలా వాడి ప్రాణాలు నిలబెట్టావు. నీ ఋణం తీర్చుకోవడానికి, ఏఁవిచ్చినా సరిపోదు బాబు! నా ఆయుష్షు కూడా తీసుకుని, పదికాలాల పాటు హాయిగా జీవించాలి. నాలాంటి వాళ్ళకి కన్నీళ్ళు రాకుండా చూడాలి!" ఉద్వేగంగా అంటూ కన్నీరు పెట్టుకుంది ఆమె.

ఏం జవాబు చెప్పాలో తెలియక హరి నోటంట మాట రాలేదు.

"మనుషుల్లో భగవంతుడు ఉంటాడంటారు బాబూ! నిజంగా మీవంటి డాక్టర్లే మాకు భగవంతులు బాబూ!" అంటూ ఉద్వేగంగా మాట్లాడుతున్న ఆమెతో పాటు వచ్చిన వాళ్ళ మనుషులను చూసేసరికి హరిప్రసాద్ కళ్ళు చెమ్మగిల్లాయి.

ముందురోజు రామకృష్ణ చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

"మనమీద నూరుశాతం నమ్మకంతోనే వస్తారు. మనల్ని భగవంతుడితో సమానమని కూడా భావిస్తారు! ఇలాంటి సేవలందించే అవకాశం అందరికీ రాదు. మనిషి జననం మనచేతుల మీదనే జరుగుతుంది. మరణాలు కూడా ఎప్పుడైనా జరగవచ్చు కూడా! అంతమాత్రాన్న ఉత్తరకుమారుడిలా పారిపోకూడదు. ధీరుడిగానే విజయాలవైపు అడుగులు వెయ్యాలి! హిప్పోక్రటిస్ ప్రమాణం మనం చేసాం... గుర్తుందా? అదే విషయం భగవద్గీతలో కూడా ఉంది... తెలుసు కదా! నీ విధి నువ్వు చిత్తశుద్ధితో చేసుకుపో... ఫలితాల గురించి ఆలోచించకు!"

వైద్యశాస్త్రంలో పితామహుడుగా గుర్తింపపడ్డ హిప్పోక్రటిస్ పేరుమీద వృత్తిధర్మాల మీద... చదువుకునే రోజుల్లో తీసుకునే ఈ ప్రమాణం వైద్యులందరికీ శిరోధార్యం!!

మనసు కుదుటపడ్డానికి హరిపసాద్‌కి అట్టే సమయం పట్టలేదు! జేబులో ఉన్న రాజీనామా కాగితాన్ని చింపి, అక్కడే ఉన్న డస్ట్ బిన్‌లో పడేసి, భుజం మీద స్టెతస్కోపు సర్దుకుంటూ వార్డు వైపు ఆనందంగా దారితీసాడు!

# పురుగులు

**అవసరాల వెంకటరావు**
✆ 99899766887

*"నా ఇంట్లో పురుగులు చేరాయి!"*

*కాఫీ కలుపుతున్న అభి ఒకసారి ఆశ్చర్యంగా ఆవిడకేసి చూశాడు.*

*"అవును. పురుగులు పోగొట్టలేని పరిస్థితిలో నీ దగ్గరకి వచ్చాను!"*

*"ఇప్పుడున్న ఈ పరిస్థితిలో నువ్వు ఇక్కడకి రావడం ఎంత ప్రమాదమో నీకు తెలియదా?"*

*"తెలుసు. నా గురించిన జాగ్రత్తలు నేను చూసుకుంటాను. నువ్వు పురుగుల గురించి ఆలోచించు."*

కాశ్మీరం! కశ్యప మహర్షి ఇక్కడి నీటినుండి గ్రహించిన నేల! అణువణువునా సౌందర్యాన్ని నింపుకున్న ప్రకృతిహేల. భూతలస్వర్గం. ఆ హిమాలయ పర్వత సానువుల్లో దాదాపు నాలుగు వందల చదరపు మైళ్ళ విస్తీర్ణం ఉన్న 'లిద్దర్' లోయ. ఆ లోయకి బంగరు జలతారు... 'లిద్దర్' నది. ఇది జీలం నదికి ఉపనది. దీనికి ఇంకోపేరు 'లంబోదరి'. ఆ నదీ పరివాహకంగా అపురూపంగా, పొందికగా అమరి ఉంది... 'పహల్ గాం'.

పహల్ గాం ఇంకో పేరు బెయిల్ గాం. పరమశివుడు అమరనాథ్ ప్రవేశించడానికి ముందు నందిని ఇక్కడ ఉండమని చెప్పాడని హిందువుల నమ్మిక. అమరనాథ్ యాత్రలో ఇది ఆఖరు మజిలీ. తదనంతరం అనేక నమ్మికలు, జాతులు, మతాలు ఇక్కడ వాటివాటి ప్రభావాన్ని చూపించాయి. జహంగీర్ మొదలు ఎంతోమంది రాజులు, చక్రవర్తులు ఇక్కడ వేసవిని గడపడానికి వచ్చేవారు.

లంబోదరి నది ఈ ప్రాంతానికి ప్రత్యేక హుందాతనాన్ని, అందాన్ని చేకూరుస్తోంది. మంచుపరదాలను తప్పించుకుని వచ్చిన సాయంత్రపు నీరెండ... లంబోదరి జలాలపై పడి, పరిసరాలకి వింత శోభని అందిస్తోంది.

ఎప్పుడూ యాత్రికులతో సందడిగా ఉండే ఆ పరిసరాలు మందకొడిగా ఉన్నాయి. ఎక్కడ చూసినా నిరుత్సాహం, అనాసక్తత. ఇక్కడ జరిగిన ఆ అవాంఛనీయ సంఘటన మొత్తం వాతావరణాన్ని పాడుచేసింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా, సామాజికంగా నిలబడుతున్న ప్రజలమీద ఆ సంఘటన చావుదెబ్బ కొట్టింది. అందరి జీవితాల్లో యాంత్రికత చోటు చేసుకుంది!

స్వచ్ఛంగా, మంద్రంగా ప్రవహిస్తున్న నీటి ఒడ్డున, కాళ్ళు నీళ్ళలో ఉంచి కూచుంది ఆఫీఫా బేగం. ఆమెకి పరిసరాలు ఏమీ తెలియడం లేదు. రెండుగంటల నుండి నిర్లిప్తంగా కూచుని ఉంది. ఆలోచనకీ, ఆవేదనకీ అతీతమైన మానసికస్థితి!

సాయంత్రం అవుతోందన్న సంకేతంగా సెక్యూరిటీ వాళ్ళ ఈలలతో ఇహంలోకి వచ్చింది ఆఫీఫా. నెమ్మదిగా లేచి, బురఖా సర్దుకుని నడక ప్రారంభించింది. ఎన్నోరోజులు అవిశ్రాంతంగా చేసిన ఆలోచనల ఫలితాన్ని ఆచరణగా మార్చే ఉద్దేశ్యం, సమయం ఆసన్నమైనట్టు... ఆమె అడుగులు వేగంగా పడుతున్నాయి... లారిపోరా మార్కెట్ సందుల్లోకి! తెలిసిన త్రోవే!

యాత్రికులు లేని మార్కెట్లు వెలవెలబోతున్నాయి. దారులు ఖాళీగా ఉన్నాయి. తననెవరైనా గమనిస్తున్నారేమోనని మధ్యలో ఒకసారి చూసుకుంటూ నడుస్తోంది. ఐదు నిమిషాల నడక తర్వాత తన గమ్యస్థానం చేరింది.

ఎత్తైన కోటలాంటి ప్రదేశం. ముందున్న గేటు ముందు హుందాగా కనిపిస్తోంది 'పంజాబ్ రెజిమెంట్' అన్న బోర్డు. ఆ ఆఫీసు ముందు మౌనంగా రెండునిముషాలు నించుంది ఆఫీఫా. ఒకసారి పరిసరాలు పరిశీలించి, మరొకసారి ముఖం మీద ఉన్న నికాబ్ సర్దుకుని, ఆ ఆఫీసు ఆవరణలోకి ప్రవేశించింది.




ఖాళీప్రదేశం దాటి ఆఫీసులోకి ప్రవేశిస్తుంటే, గుమ్మం దగ్గిర సెంట్రీ పలకరింపుగా, ఆప్యాయంగా నవ్వాడు. ఆఫీఫా తల పంకించి, ఆఫీసులోకి ప్రవేశించి, హాలు చివర ఉన్న మెట్ల వైపు నడిచింది.

"ఠహరో!" పెద్ద గర్జన వినిపించింది.

ఆశ్చర్యంగా అటు చూసింది ఆఫీఫా.

"ఎవరు నువ్వు? ఇక్కడ ఎవరికీ చెప్పకుండా, పర్మిషన్ తీసుకోకుండా ఎక్కడికి వెళ్లిపోతున్నావ్?"

"సలాం. నా పేరు ఆఫీఫా బేగం. మేజర్ గారిని కలవడానికి వెళ్తున్నాను!"

"అపాయింట్మెంట్ ఉందా? ఇలారా! నీ ఆధార్ అవీ చూపించు!" కరుకుగా అడిగాడు అక్కడ డ్యూటీలో ఉన్న నాయక్ సుబేదార్ ఖాలిద్.

ఆ సంభాషణను లోపలనుంచే విన్న, మరో నాయక్ పరుగు పరుగున వచ్చి, "సార్ ఈమె..." అని ఏదో చెప్పబోయాడు.

"ఎవరైనా సరే! నాకు నమ్మకం కుదిరితే గానీ సార్ దగ్గిరకి వెళ్ళడానికి వీల్లేదు!" కరాఖండీగా చెప్పాడు ఖాలీద్.

ఈలోగా ఆఫీఫా నెమ్మదిగా అతని దగ్గరకు వచ్చి తన ఆధార్‌ను చూపించి, ముఖం మీద ఉన్న నికాబ్ తొలగించింది. గంభీరంగా ఆధార్‌ను ఆమె ముఖాన్నీ మార్చిమార్చి చూసి, "ఊ... ఇంకా ఏమైనా ఉన్నాయా?" అన్నాడు ఖాలీద్.

ఆఫీఫా మౌనంగా తన బ్యాగ్‌లోనుండి ఒక నీలం రంగు గుర్తింపు కార్డు అతనికి అందించింది. వారు చేసిన సామాజిక సేవకి గుర్తింపుగా ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేకహోదా ఆ 'బ్లూ కార్డ్'. అది అందుకుంటూనే ఆమెకేసి ఆశ్చర్యంగా చూసి, పైకి వెళ్ళమని తలాడించాడు. తన కార్డులు బ్యాగ్‌లో పెట్టుకుంటూ, మెట్లవైపు నడిచింది ఆఫీఫా.

మేడమీద చెక్క ఫ్లోరింగ్ ఉన్న పెద్దహాలుకి చివరగా ఉంది ఆ కేబిన్. దాని తలుపు మీద 'మేజర్ అభిషిక్త వర్మ' అన్న ఇత్తడి అక్షరాలు తళతళా మెరుస్తున్నాయి. తలుపు తీసిన సెంట్రీకి ధన్యవాదాలు చెబుతూ లోపలకి ప్రవేశించింది.

ల్యాప్టాప్‌లో చూస్తూ, మొబైలులో ఏదో విషయాన్ని చర్చిస్తున్నాడు అభిషిక్త వర్మ. లోపలకి వచ్చిన ఆఫీఫాని చూడగానే ఆప్యాయంగా నవ్వి, కూచోమని కుర్చీ చూపించాడు. ఆ చర్చ త్వరగా పూర్తి చేసి, ఆఫీఫా కేసి తిరిగి, "ఆపా! ఎలా ఉన్నావు?" అని అడిగాడు.

దానికి ఆఫీఫా మౌనంగా తలపంకించింది.

"చెప్పు ఆపా! ఏదో కొంచెం సీరియస్‌గా ఉన్నావు. ఏమయ్యింది? కొంచెం కాఫీ తాగుదామా?" అంటూ లేచి కిటికీ పక్కగా ఉన్న కాఫీ సెట్ దగ్గిరకి నడిచాడు.

"అవును అభీ! ఓ విషయం నీతో మాట్లాడాలి!"

"చెప్పు ఆపా!"

"నా ఇంట్లో పురుగులు చేరాయి!"

కాఫీ కలుపుతున్న అభి ఒకసారి ఆశ్చర్యంగా ఆవిడకేసి చూశాడు.

"అవును. పురుగులు పోగొట్టలేని పరిస్థితిలో నీ దగ్గిరకి వచ్చాను!"

"ఇప్పుడున్న ఈ పరిస్థితిలో నువ్వు ఇక్కడకి రావడం ఎంత ప్రమాదమో నీకు తెలియదా?"

"తెలుసు. నా గురించిన జాగ్రత్తలు నేను చూసుకుంటాను. నువ్వు పురుగుల గురించి ఆలోచించు."

అభి ఆపా కేసి చూశాడు. స్థిరంగా, ధైర్యంగా ఉంది.

ఆఫీఫా భర్త భారతసైన్యంలో పనిచేస్తూ, అసువులు బాసాడు. కాశ్మీరులో తీవ్రవాద కార్యక్రమాల వల్ల గాయపడిన ఎంతోమందికి ఆఫీఫా సేవలు చేసింది. ఆమె నర్స్ కాదు. ఈ సేవలు చేయడానికి ఆమె నర్సింగ్ నేర్చుకుంది. ఘటనాస్థలం మధ్యలో సేవలందించడానికి కూడా ఆమె ఎప్పుడూ వెరవలేదు. ఆ తెగింపు, దీక్షచూసి అభి ఆమెని గౌరవించాడు. అక్కడ్నించి ఆమె... అభికి పెద్దక్క, చిన్న గురువు.

"ఎప్పుడు చేరాయి?"

"పహల్ గామ్ సిగ్గుపడే సంఘటనకి నెల ముందు."

"అంటే... మూడునెలలనుంచి?"

"అవును! వాటిని తరిమేయడానికి నా ప్రయత్నాలన్నీ చేసాను. కుదరలేదు. నా ప్రవర్తనకి కోపం వచ్చి, నా కొడుకుని వాళ్ళ దగ్గిర ఉంచుకున్నారు!"

"అవునా? వాడ్ని, వాళ్ళ అక్క దగ్గిరకి ఆ దేశం పంపించానన్నావు!"

"అవును. వాళ్ళు నాకూ అదే చెప్పారు. నా కూతురి పెళ్ళికి ముందు, ఆ కుటుంబం గురించి అంతా విచారణ చేశాను. ఆ కుటుంబం చాలా మంచిది. నా అల్లుడు మెడికల్ షాప్ నడుపుతాడు. ఇప్పుడు నా కూతురు ఒక రెడీమేడ్ కంపెనీలో దర్జీగా పనిచేస్తోంది. నా దృష్టి తప్పించుకున్నది... నా అల్లుడి తమ్ముడు!"

"ఆయన ఏం చేస్తాడు?"

"పురుగుల సంస్థలో పని చేస్తాడు. మనదేశం మీద విపరీతమైన ద్వేషం పెంచుకున్న వ్యక్తి. నిరంతరం విషం కక్కుతూనే ఉంటాడు. వాడే మూడునెలల క్రితం నా కొడుకుకి సెలవలనీ, వాడికి అక్కని చూపిస్తాననీ తీసుకువెళ్లాడు. ఆనాటినుండీ వాడు నాకు ఆదేశాలు ఇస్తున్నాడు. నేను వాడు చెప్పినట్టు చేయకపోతే, నా కొడుకు ప్రాణానికి ప్రమాదమని హెచ్చరించాడు."

"అయ్యో! మరి పురుగులు ఎప్పుడు వచ్చాయి?"

"ఇక్కడ ఇంకెంతమందిని ఏమార్చాడో! మా ఇళ్లకు బాగులు చేయిస్తానని చెప్పాడు."

"అవును. నువ్వే చేయించుకున్నావు కదా?"

"నేను కాదు, వాడే చేయించాడు. మెట్లకింద వంటగదిలో బట్టీ వెనకా, డాబామీద పొగగొట్టం వెనకాలా... ఇలా కొన్నిచోట్ల పురుగులు చేరడానికి అవకాశం ఏర్పరుచుకున్నాడు. తర్వాత పురుగులు చేరాయి."

"ఇలా ఎంతమంది ఉన్నారు ఆపా? మనవాళ్ళు ఎవరైనా ఉన్నారా?"

"ఉన్నారు అభీ! అదే నన్ను ఎక్కువగా బాధపెట్టింది. మా పక్కవీధిలో నూర్ కొడుకు... పై చదువులకి వెళ్ళాడు కదా! ఇప్పుడు వాడు పురుగై వచ్చాడు."

"అవును ఆపా! ఆ విషయం తెలిసింది. అన్యాయం కదా? ఆ కుటుంబం అంతా ఎంత క్షోభ అనుభవిస్తున్నారో కదా! సరే, ఈ విషయం నేను చూసుకుంటాను. నువ్వు జాగ్రత్త!"

"నాకు ఫరవాలేదు అభీ! నా జాగ్రత్త నేను చూసుకుంటాను. కానీ పురుగుల ఏరివేత... ఈ రాత్రికే జరిగిపోవాలి. రేపు ఉదయం మళ్ళీ అన్నీ మారిపోతాయి."

"అవునా? ఈ రాత్రికా? చూస్తాను. కానీ బలాబలాలు చూసుకోవాలి కదా ఆపా?"

"అవును. అందుకే... ఇదిగో పురుగు పట్టిన ఇళ్ళూ, ఇళ్ళల్లో అవి ఉన్నచోట్లూ ఇక్కడ రాశాను. ఎక్కడ ఏరివేత మొదలుపెట్టాలో, ఎక్కడితో పూర్తిచేయాలో... నాకు తెలిసినంతవరకూ రాసాను. మిగతా విషయాలు నువ్వు చూసుకో!"

అభి ఆపాకేసి ఆశ్చర్యంగా చూశాడు. ఒక దివంగత సైనికుడి భార్య రచించిన యుద్ధతంత్రం. ఆమె కళ్ళల్లోకి చూశాడు. అవి భావరహితంగా ఉన్నాయి. తన కొడుకు, కూతురు ప్రాణాలతో ముడిపడిన యుద్ధం... దానికి ఆమె సిద్ధం!

ఆమె అభికేసి ఒకసారి చూసి, తల పంకించి బయటకు వచ్చింది. వెనకే అభి మెట్లవరకూ వచ్చాడు. మెట్లవరకూ వచ్చి, ఏదో గమనించినట్టు వెనక్కి తిరిగి, "ఆ భుజంమీద గాయం ఏమిటి అభి? ఏమయ్యింది?" కంగారుగా అడిగింది.

"నిన్న ఒక చిన్న ఆపరేషన్‌లో బుల్లెట్ తగిలింది. గాయం చిన్నదే." అభి నవ్వుతూ అన్నాడు.

"జాగ్రత్త!" చెప్పి కిందకి నడిచింది ఆఫీఫా.

కిందకి దిగి వెనకగుమ్మం వైపు నడిచింది. సెంట్రీ తలుపు తీశాడు. బయటకు వచ్చి, చీకటిగా ఉన్న వైపు వెనక గేట్ దగ్గరకి వచ్చింది. అక్కడ సుబేదార్ ఖాలీద్ గేట్ తీసి అన్నాడు.

"బాజీ! నన్ను అపార్థం చేసుకోకు!"

నికాబ్ సర్దుకుంటూ, సలాం చేస్తూ, ఆ చీకట్లోకి వెళ్ళిపోయింది ఆ వెలుగుకిరణం... పురుగుల ఏరివేత తరవాత, తనవాళ్లను కాపాడుకునే యుద్ధానికి సన్నద్ధమవుతూ!

# అంకెల మధ్య చిక్కుకున్న చిన్నమనసు

మోచర్ల అనంత పద్మనాభరావు
✆ 9848607127

***"నమస్తే ఆఫీసర్! వెంకటాచలం గారు మా బేంక్‌కు వచ్చారు. నేను ఈ బ్యాంక్ మేనేజర్‌ని. మీకు పంపవలసిన ఎనభై లక్షలు వారి ఖాతాలో ఉన్నాయి. కానీ ఆ సొమ్మును మీకు పంపాలంటే కొన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేయాలి. మీ ఐడి కార్డ్, మీ ఆఫీసు లొకేషన్ నాకు వెంటనే మెయిల్ చేయండి. నా మెయిల్ ఐడి నోట్ చేసుకోండి.***

పొద్దున్న పేపర్లో ఆ వార్త చదివిన దగ్గర్నుంచి నా మనసంతా ఏదోలా అయిపోయింది.

బేంకులో పనిచేసుకుంటున్నా... పదేపదే అదే విషయం బుర్రను దొలిచేస్తోంది. ఒక పొరపాటు పెద్ద అపవాదుని అంటగట్టింది. మొత్తం వ్యవస్థకే మాయని మచ్చయ్యింది. దీనికి కారణం ప్రజాసేవలలో ఉన్న వారికి మానవత్వం, సహానుభూతి లోపించడమే! వీటిని పెంపొందించడానికి అనువుగా నాలో అంతర్మథనం ఆరంభమైంది.

నేనొక జాతీయ బ్యాంకులో మేనేజరుని! రూలు ప్రకారం పనిచేస్తానని పేరుంది. ఆ 'రూళ్ళ'కర్ర నా మనసుకు అడ్డుగా నిలుస్తుందేమోనన్న అనుమానం నాకప్పుడప్పుడు కలగకపోలేదు. ఏమైతేనేం ఆ వార్త నాలో ఓ మార్పుకు ఆలంబన అయ్యింది.

మా బ్రాంచ్ నగరానికి ఓ అంచున ఇప్పుడిప్పుడే నాగరికత నీడ విస్తరిస్తున్న ఊరిలో ఉంది. ఆ ఊరు ఇంకా పల్లెవాసన తగ్గని ప్రాంతం! మా ఖాతాదారుల్లో పేరుకు మాత్రం చిన్న, సన్నకారు రైతులు, కాని వాళ్ళెప్పుడో రియల్ ఎస్టేట్ బడాబాబుల మాయమాటల వలలో చిక్కుకున్న చిరుచేపలు! ఆ వలలో చిక్కుకున్న వాళ్ళ భూములు కాస్తా బహుళ అంతస్తుల భవనాల కిందా, గేటెడ్ కమ్యూనిటీల కిందా మార్పు చెందాయి. ఫలితంగా అక్కడ జనసమ్మర్ధం బాగానే పెరిగి, మా కష్టమర్ల సంఖ్య పెరగడానికి దోహద పడింది. వాళ్ళే కాకుండా ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కొంతమంది చిన్నవ్యాపారులు, మరి కొంతమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్థులు, పెన్షనర్లు కూడా మా బేంకు ఖాతాదారులే!

నా కేబిన్ నుంచి బేంకింగ్ హాల్ స్పష్టంగా కనిపించేలా నా సీటు ఏర్పాటు చేసుకున్నాను. నా పని చేసుకుంటూ, బేంక్‌కు వచ్చేపోయే వారిమీద చూపు సారిస్తూ ఉంటాను.

నెల మొదటిరోజులు కనుక బేంకు కొంచెం రద్దీగానే ఉంది. కంప్యూటర్ స్క్రీన్ మీద వేగంగా కదిలే అంకెలకు తగ్గట్టుగా, బేంకుకొచ్చిన వారి వ్యవహారాలలో మాత్రం ఆ వేగం కనిపించడం లేదు. సిబ్బంది కొరతతో కొద్దిమంది కస్టమర్ల పనుల్లో

జరిగే జాప్యానికి, వారు అసహనంగా మా సిబ్బందితో వాదనకు దిగుతున్నారు. మా సిబ్బంది ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవల నందించడానికి ఎల్లవేళలా సిద్ధంగానే ఉంటారు. కాని, అనుకోని సాంకేతిక అవాంతరాల వలన, కనెక్టివిటీ సమస్యల వలన ఒక్కొక్కసారి సేవలలో జాప్యం జరుగుతూ ఉంటుంది. చాలామంది వీటికి అలవాటు పడినా, అప్పుడప్పుడు కొన్ని వాగ్వాదాలు జరుగుతూ ఉంటాయి. సమస్య తొందరలోనే సమసిపోతుంది. సేవాలోపాల్ని భరించి, ఖాతాదారులు తమ లావాదేవీలను సంతృప్తికరంగానే ముగించుకోవడం పరిపాటే.

ఈ రోజు ఉదయంనుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. మా బేంకు చుట్టూ విస్తరించిన పొలాలనుంచి వెలువడుతున్న మట్టివాసనతో పాటు ఒక పెద్దాయన బ్యాంకులోకి అడుగుపెట్టాడు. తెల్లటిచొక్కా, ధోతీ, భుజంపై తువ్వాలు, చేతిలో బేంక్ పాస్‌బుక్! ఓ కౌంటర్ దగ్గర నిలబడి తన వంతుకై ఎదురు చూస్తున్నాడు. ఆ కౌంటర్ ముందు ఎక్కువ కస్టమర్లు లేరు. మా స్టాఫ్ ఆయన్ని గమనించినట్టు లేదు. ఆయన రెండుమూడు సార్లు ఆ కౌంటర్ స్టాఫ్‌తో ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. కాని, మా వాడి దృష్టి ఆయన మీద లేదు. ఆయన చూపుల్లో విసుగు, సంకోచం నన్ను నా కేబిన్ నుంచి బయటకు లాగాయి.



ఆయనను సమీపించి, “నమస్కారం సార్!” ఏమిటీ పని అన్నట్టుగా పలకరించాను.

ఆయన ఒక్కసారిగా ఉలిక్కిపడి, “నా ఖాతా గురించి కొన్నివిషయాలు తెలుసుకుందామని చాలా సేపయ్యింది వచ్చి...” అంటూ కౌంటర్ వేపు చూపిస్తూ మాట ఆపారు.

కౌంటర్లోకి తొంగి చూసాను. మా స్టాఫ్ నన్ను కూడా గమనించకుండా, తన దగ్గరనున్న డబ్బును, ఓచర్లను సరి చూసుకుంటున్నాడు. బహుశా ఏదో తేడా వచ్చుంటుంది. “సారీ అండి. అతను వేరేపనిలో పడి మిమ్మల్ని గమనించలేదు. మీరొచ్చిన పనేమిటో నాకు చెప్తే నే సహాయం చేస్తాను. నా కేబిన్‌కు రండి!” అంటూ, నా కేబిన్లోకి దారి తీశాను. పేపర్ వార్త వలన నాలో కలిగిన మార్పు నాకు స్పష్టమయ్యింది.

సందేహిస్తూనే లోపలికొచ్చి కూర్చున్నాక, ఆయన మెల్లగా మాట్లాడడం మొదలెట్టారు. “నా పేరు సుబ్బారావు. మా ఊరు మరిదిబ్బ. నేను స్కూల్ మాస్టరుగా చేసి రిటైరయ్యాను. నేను సర్వీసులో ఉన్నప్పుడు నా జీతం ఇక్కడే నా అకౌంట్లో పడేది. రిటైర్ అయ్యాక పెన్షన్ కూడా ఇక్కడే వస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే ఈ బ్యాంకుతో నా అనుబంధం నలభై సంవత్సరాలు.” అన్నారు.

“చాలా సంతోషం. నేను ఇక్కడ ఛార్జి తీసుకుని కొద్దికాలమే అయ్యింది. మిమ్మల్ని మొదటిసారిగా చూస్తున్నాను. మీకేదైనా సమస్య ఉందా సార్?” అన్నాను.

ఆయన కాసేపు నిశ్శబ్దంగా ఉండి, “ప్రతినెలా క్రమం తప్పకుండా వస్తున్నాను. ఒకప్పుడు బ్యాంకులోకి అడుగుపెడితే చాలు, ‘మాస్టారూ వచ్చారా! చాలాకాలమైంది మీరొచ్చి, ఎలా ఉన్నారు?’ అంటూ మీ వాళ్ళంతా పలకరించేవాళ్లు. ఇప్పుడు బ్యాంకుకు రావాలంటే భయంగా ఉంది... భయం కాదనుకోండి. ఏదో వెలితి. అందరూ మరమనుషులై పోయారు. మాకు, మీకు మధ్య ఆ కంప్యూటర్లు. ఎంతసేపూ దాంట్లో తల దూర్చి, ఎదురుగా ఎవరున్నారో కూడా గమనించడం లేదు. ఒక మాటా ఉండదు, మంతీ ఉండదూ.” కాస్త విసుగు ధ్వనించింది ఆయన గొంతులో.

అది అసలు సమస్య కాకపోవచ్చు. ఆయన్ని చూస్తుంటే మారుతున్న కాలంతో కలసి నడవలేని పాతతరంలోని వ్యక్తిగా అనిపించారు.

‘మాట’ మనిషికి దేవుడిచ్చిన వరం. మనిషంటేనే మాటలు. అలా మాట్లాడకుండా ఉండేవాడు మనిషి కాలేడనే బాధ ఆయనదనుకుంటా!

సాంకేతికవిప్లవం వేగంగా విస్తరిస్తున్న నేటితరుణంలో మానవజీవితం పూర్తిగా యాంత్రికమైపోయింది. బ్యాంకింగ్ రంగంలో కంప్యూటరీకరణ జరగకముందు... ఖాతాదారులకు, సిబ్బందికి మధ్య ఒక ఆత్మీయమైన అనుబంధం ఉండేది. బ్యాంకుకు రావడం అంటే కేవలం లావాదేవీల కోసమే కాకుండా, ఒక సామాజిక కలయికగా కూడా ఉండేది. కానీ, నేడు అభివృద్ధి పేరుతో మనిషికి, మనిషికి మధ్య ఒక ‘యంత్రం’ వచ్చి కూర్చుంది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ రాకతో మనుషుల మధ్య దూరాలు తగ్గాయేమో కానీ, మనసుల మధ్య అనుబంధాలు మాత్రం దూరమవుతున్నాయి.

“ఈ రోజు పేపర్లో ఓ విచిత్రమైన... ఉహూ... విచారకరమైన వార్త చదివాను” అంటూ, “ఒడిశాలో ఓ గిరిజనుడి సోదరి మరణించిన తర్వాత, ఆమె అకౌంట్లో ఉన్న డబ్బును ఇవ్వడానికి బేంకు అధికారులు నిరాకరించారట. వాళ్ళ బేంకు రూలు

ప్రకారం ఆమె మరణించినట్టు ఆధారాలు, ఇతరత్రా పత్రాలు తెస్తే గాని డబ్బివ్వమని పదేపదే తిప్పించుకుని తప్పించుకున్నారట. అంతేకాని చదువురాని ఆ గిరిజనుడిని మనిషిలా గుర్తించక, సహానుభూతినీ చూపించక, ఆ పత్రాలను పొందడంలో ఎటువంటి సహాయం చేయలేదట! నిస్సహాయుడైన అతను తన సోదరి మరణాన్ని ఎలా నిరూపించుకోవాలో తెలీక, ఆమె సమాధిని తవ్వి, అస్థిపంజరాన్ని తీసుకుని బేంకుకు వెళ్ళాడట. రూల్స్, చట్టాల గురించి కనీస అవగాహన లేని ఆ నిరక్షరాస్యుడికి, చేతనైనంత సహాయం చేయనివారిని, కొంచెమైనా కరుణ, మానవత్వాన్ని చూపించలేని మనుషుల్ని ఏమనాలి?" ఆవేదనతో ఆయన పొద్దున్నే నే చదివిన వార్తనే గుర్తుచేసి వికలమైన నా మనుసును, మరింత బాధపడేలా చేసాడు.

"రేపు నా పిల్లలకి ఇటువంటి పరిస్థితి రాకుండా నా అకౌంట్ క్లోజ్ చేసి డబ్బంతా పిల్లలకు పంచాలని అనుకుంటున్నాను. రాబోయే కాలంలో మీ బేంకు పూర్తిగా యంత్రాలతో నిండిపోతే, మమ్మల్ని పలకరించే వారెవరూ ఉండరన్న ఫీలింగ్ కలుగుతోంది!" నిర్వేదంగా అన్నారు.

ఓ నిస్సహాయత నన్ను చుట్టుముట్టగా తదేకంగా కంప్యూటర్ స్క్రీన్‌ని చూస్తూ ఉండిపోయాను. కాసేపాగి ఆయన ముఖం వైపు చూశాను.

"మీ ఆవేదన అర్థమయ్యింది. కొందరి అసమర్థత మరొకరికి శాపంగా మారవచ్చు. కానీ, అందరూ అలాగే ఉంటారని, మీకు అలాగే జరగవచ్చని మీరనుకోవడం భావ్యం కాదు. తొందరపడి మీరే నిర్ణయం తీసుకోకండి. ప్రతి మనిషికి ప్రవర్తనా నియమావళి ఉన్నట్టు, ప్రతి సంస్థకు కూడా కొన్ని నియమనిబంధనలుంటాయని మీకు నేను చెప్పనక్కర్లేదు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగుంటుంది. ఆ నిర్భాగ్యుడికి జరిగినదానికి బాధ్యులైన వారందరూ నిందితులే! వాళ్ళకు తగినశిక్ష పడవలసిందే. మీరంతా మీ గ్రామంలో ఓ చెట్టు కిందో, రచ్చబండ దగ్గరో కూర్చుని మంచి చెడ్డా పంచుకుంటూ ఎంతసేపైనా మాట్లాడుకుంటారు. అవును కదూ? అప్పుడప్పుడు తప్పొప్పులు జరిగినపుడు క్షమార్పణలు కూడా చెపుతారేమో కదా? అలాగే ఒక బేంకు అధికారిగా అక్కడెక్కడో జరిగినదానికి నేను క్షమార్పణలు చెబుతాను." సౌమ్యంగా అన్నాను. దానికి ఆయన చిన్నగా నవ్వారు. "మా బ్యాంకుకి మీరెప్పుడు వచ్చినా, ఇక్కడ కేవలం అంకెల గారడీ మాత్రమే కాదు, మనుషుల మాటలు కూడా ఉండాలని మీ ఉద్దేశ్యమని నేను గ్రహించాను." నా 'రూళ్ళ' కర్ర మెల్లిగా జారి కిందకు పడిపోయింది. ఆయనకు టీ తెప్పించాను.

టీ తాగుతూ, "మరీ మా రచ్చబండ దగ్గర మాట్లాడినట్టుగా మీ సిబ్బందిని మాట్లాడమని కాదు నా ఉద్దేశం. ఓ చిన్న చిరునవ్వు, ఓ స్నేహపూర్వకమైన పలకరింపు చాలు బాబూ... మనుషుల మధ్య అంతరాలు తగ్గడానికి! ముఖ్యంగా నిత్యం ప్రజలతో మమేకమయ్యే మీలాంటి బేంకు సిబ్బందికి, అవి చాలా ఉపయోగపడతాయని నా నమ్మకం. మీరు మానవవనరులను పట్టించుకున్నంతగా, మానవ సంబంధాలకు ప్రాముఖ్యతను ఇవ్వడం లేదోమోనని నాలాంటి వారికి అనిపిస్తుంది. అంతే."

"మీరన్నవి జరిగితే నిజంగా చాలా బావుంటుంది మాష్టారూ. మీ తరం ఆలోచనలను, అనుభవాలను ఇప్పటితరం అర్థం చేసుకుంటుంది. కాని వారు పురోగమిస్తున్నారు. కనుక గతంలోకి వెళ్ళలేరు. మీలాంటి వారు ఈ రెండుతరాలకి వారధి

కావాలి. అందుకే మీ అకౌంట్ క్లోజ్ చేయొద్దు. మీకు వీలున్నప్పుడల్లా మా బేంకు కొచ్చి టీ తాగి, నాతో కొంచెంసేపు మాట్లాడి వెళ్ళండి. మీ డబ్బు మా దగ్గరుంటుంది, మా మాటలు మీతో ఉంటాయి” అన్నాను.

ఆయన కళ్లలో తడి మెరిసింది.

“ధన్యవాదాలు బాబూ. మా భావాలకు, మా ఆలోచనలకు గౌరవాన్నిచ్చే మనుషులు మీ బ్యాంకులో ఇంకా ఉన్నారనే భావన నాకు చాలా సంతోషాన్నిస్తుంది.” తృప్తిగా అన్నారు.

ఆయన నా మాట విన్నారు. “వచ్చే నెల తప్పకుండా వస్తాను.” అని నమ్మకంగా చెప్పి వెళ్ళారు. వెళ్తూ వెనక్కి తిరిగి, ఓ చిరునవ్వును అక్కడ వదిలి వెళ్లారు.

నేనూ నవ్వాను. అప్పుడే అర్థమైంది... బ్యాంకర్ అంటే కేవలం అంకెల మనిషి కాదని! ఆ క్షణం నుంచి కేవలం వృత్తిపరమైన విధివిధానాలకు పరిమితం కాకుండా, ఒక బాధ్యతాయుతమైన వ్యక్తిగా సామాజికస్పృహను నా కర్తవ్యంలో అంతర్భాగం చేసుకోవాలనుకున్నాను. అంతేకాదు మా సిబ్బందికి కూడా మానవసంబంధాల అవసరాన్ని వివరించాలని నిర్ణయించుకున్నాను.

తిరిగి నేను నా పనిలో మునిగిపోయాను.

వర్షం ఇంకా కురుస్తూనే ఉంది. తడినేల నుంచి వస్తున్నకమ్మటి మట్టివాసనను ఆస్వాదిస్తూ ఉండగా, ఓ వృద్ధజంట బెరుగ్గా, ఆందోళనగా బేంకులోకి రావడం చూశాను. చుట్టూ అనుమానంగా చూస్తూ హాల్ మధ్యలో వారు కొద్దిసేపు నిలబడ్డారు. చేతిలో మొబైల్ని పదేపదే చూస్తూ ఓ కౌంటర్ వద్దకెళ్ళి, అక్కడున్న క్లరికల్ అసిస్టెంట్‌తో మాట్లాడారు. అతను కొంత విస్మయంతో వారికేసి చూసాడు. అదేం పట్టించుకోకుండా కంగారుగా ఆయన అతనితో ఏదో చెప్తున్నారు. అసిస్టెంట్ వారిని ప్రశ్నిస్తున్నట్టు, దాన్ని వారు ఖాతరు చేయకుండా చేతులు కదుపుతూ, తాము చెప్పింది చేయమని అంటున్నట్టుగా నాకు అనిపిచింది. చివరికి అసిస్టెంట్ కొన్ని కాగితాలిచ్చాడు. వాటిని పూర్తి చేసిమ్మని అన్నాడనుకుంటా, విసుగ్గా వాటిని అతని చేతుల్లోంచి లాక్కుని, కౌంటర్ నుంచి దూరంగా జరిగారు. వాళ్ళ ముఖాల్లో కనిపిస్తున్న అసంతృప్తిని గమనించి నేను కేబిన్లోంచి బయటకొచ్చి వారిని చేరుకుని, ”నమస్తే. నా పేరు అనంత్, ఈ బ్రాంచ్‌కి మేనేజర్ని! మీరేదో పని మీద వచ్చారనుకుంటా, మీక్కావాల్సిన పని పూర్తయ్యేలా నే చూస్తాను. నా కేబిన్లో కూర్చుందాం రండి.” అని అన్నానో లేదో, నాకేసి విచిత్రంగా చూసి వెళ్లబోయారు. “చూడండి సార్! మీరేదో కంగారులో ఉన్నారనిపిస్తోంది. కాస్త నా మాట వినండి. మీ పని తొందరగా చేసి పంపుతాను రండి.”

నా మీద, నా మాటల మీద నమ్మకం కల్గింది కామోసు, మౌనంగా కేబిన్లోకొచ్చి కూర్చున్నారు.

“ఇప్పుడు చెప్పండి ఏ పని కోసం బేంకుకొచ్చారు?” అన్నాను.

“నా పేరు వెంకటాచలం, ఈమె నా భార్య పద్మావతి. నేను స్టేట్ గవర్నమెంట్లో పని చేసి రిటైరయ్యాను. మా ఇద్దరి పేరుమీద మీ బేంకులో సుమారు ఎనభై లక్షల వరకు డిపాజిట్లున్నాయి. వెంటనే మా డిపాజిట్లు కేన్సిల్ చేసి మా అకౌంట్లో వేస్తే, ఆ డబ్బును మేమొకరికి పంపాలి. ఇవిగో ఆ డబ్బు పంపవలసిన అకౌంట్ వివరాలు. మీరు వెంటనే మేము చెప్పినట్టుగా

చెయ్యండి. ఎందుకు? దేనికి? అంటూ ప్రశ్నలేసి మా టైము వేస్ట్ చేయకండి. ఇది చాలా అర్జెంట్." అంటూ ఓ పేపర్ ఇచ్చారు.

అది తీసుకోకుండా ఒక్క క్షణం వారిద్దరికేసి చూసాను. ఆయన చేతులు వణుకుతున్నాయి. పేపర్ తీసుకుని చూసాను. అందులో వివరాలు కుదురుగా వ్రాసినట్టు లేదు. డబ్బు పంపవలసిన వివరాలను నా కంప్యూటర్లో కొట్టి చూసాను. ఆ పేరు, ఊరు బీహారు రాష్ట్రం లోనివి. వాళ్ళని నిశితంగా గమనిస్తున్నాను. నిస్సహాయత, అభద్రతాభావం, భయం, ఇంకా ఆందోళన వాళ్ళల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆయన నుదుటిని నొక్కుకుంటూ, గొణుక్కుంటూ, బెదురుగా తన చేతిలో మొబైల్ని పదేపదే చూస్తున్నారు.

నేను వారిద్దరితో మృదువుగా సంభాషిస్తూ, వారికి కావలసిన పని జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేసాను. మా అటెండర్ రెండు కప్పుల టీ తీసుకొచ్చి వారి ముందుంచాడు.

బ్యాంకింగ్ రంగంలో నాకున్న అనుభవం, ఇంతకు మునుపే నా 'రూళ్ళ' కర్రని జారవిడిచి, పెంచుకున్న సహానుభూతి ఈ వృద్ధదంపతులు ఏదో పెద్ద ప్రమాదంలో ఉన్నారని తెలియపరచింది. ఆయనిచ్చిన వివరాలు బీహార్‌కు చెందినవి కావడం, అంత పెద్ద మొత్తాన్ని హడావుడిగా బదిలీ చేయమనడం చూస్తుంటే ఇది ఖచ్చితంగా 'డిజిటల్ అరెస్ట్' లేదా 'సైబర్ ఫ్రాడ్' అని నాకు అర్థమైపోయింది.

నేను నెమ్మదిగా కుర్చీలో వెనక్కి ఆనుకుని, "వెంకటాచలం గారూ, మీరు అడిగింది తప్పకుండా చేస్తాను. కానీ ఇంత పెద్దమొత్తం పంపేటప్పుడు కొన్ని టెక్నికల్ ఫార్మాలిటీస్ ఉంటాయి. అవి మీకు వివరించి చెప్తాను. మా సిస్టమ్ కూడా కొంచెం స్లోగా ఉంది. ఈలోపల మీరు ఆ టీ తాగి ప్రశాంతంగా ఉండండి!" అన్నాను.

ఆయన టీ తాగుతూ పదేపదే తన చేతిలోనున్న మొబైల్‌ని చూస్తున్నారు. అది గమనించి, "సార్! మీ ఫోన్ ఆన్‌లో ఉందా? మీరు ఎవరితోనైనా కాల్లో ఉన్నారా?" అని అడిగాను.

వెంటనే పద్మావతిగారు నా వైపు చూస్తూ, "అవునండీ, వాళ్లు లైన్‌లోనే ఉండమన్నారు. కట్ చేస్తే అరెస్ట్ చేస్తామన్నారు. మా అబ్బాయి అమెరికాలో ఉంటాడు, వాడు ఏదో డ్రగ్స్ కేసులో దొరికాడని, ఇప్పుడు ఈ డబ్బుకడితే వాడిని వదిలేస్తామని, సిబిఐ వాళ్ళు చెప్పారు. ఇది ఎవరికీ చెప్పొద్దన్నారు, చెబితే మా అబ్బాయి ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు." అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.

ఇది విన్న వెంటనే నా అనుమానం నిజమని తేలిపోయింది. ఇది ఈ మధ్య వృద్ధులను, పెన్షనర్లను టార్గెట్‌గా చేసుకుని భయపెడ్తూ, వారి కష్టార్జితాన్ని దోచుకునే 'డిజిటల్ అరెస్ట్' స్కామ్. దీన్ని వెంటనే అడ్డుకుని వీరిని ఆ నేరగాళ్ళ బారిన పడకుండా కాపాడాలని నిశ్చయించుకుని, "సార్! ఒక్క నిమిషం నాకు ఆ ఫోన్ ఇవ్వండి నేను వారితో మాట్లాడతాను." అన్నాను.

ఆయన భయపడుతూ, "వద్దు బాబూ! వాళ్ళకి తెలిస్తే నాకొడుక్కి ప్రమాదం జరుగుతుంది. వారడిగిన డబ్బు పంపిస్తే మా అబ్బాయిని విడిచిపెడతారు. విచారణ పూర్తయ్యాక మా డబ్బుని తిరిగి మాకిచ్చేస్తారని కూడా చెప్పారు. దయచేసి ఆ ఏర్పాట్లేవో తొందరగా చేసిపెట్టండి." ప్రాధేయపడుతూ అన్నారు.

నేను నవ్వుతూ, "సార్! నేను బ్యాంక్ మేనేజర్‌ని. ఇటువంటి మోసాలు జరుగుతున్నాయని మీరు పేపర్లలో చదివే ఉంటారు. మీరేం భయపడకండి. మీలాంటి అమాయకులను బెదిరించి మీ డబ్బును దోచుకుంటున్నారు. మిమ్మల్ని వారి ఉచ్చులో పడకుండా చూడడమే కాకుండా, మీ డబ్బును కూడా కాపాడటం నా బాధ్యత. ఒక్కసారి నన్ను నమ్మండి." అని చెప్పి ఆయన చేతిలోనున్న ఫోన్‌ను తీసుకున్నాను. వీడియో కాల్లో ఒకతను పోలీస్ యూనిఫాంలో ఉన్నాడు. చాలా గంభీరంగా ఉన్నాడు.

"నమస్తే ఆఫీసర్! వెంకటాచలంగారు మా బేంక్‌కు వచ్చారు. నేను ఈ బ్యాంక్ మేనేజర్‌ని. మీకు పంపవలసిన ఎనభై లక్షలు వారి ఖాతాలో ఉన్నాయి. కానీ ఆ సొమ్మును మీకు పంపాలంటే కొన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేయాలి. మీ ఐడి కార్డ్, మీ ఆఫీసు లొకేషన్ నాకు వెంటనే మెయిల్ చేయండి. నా మెయిల్ ఐడి నోట్ చేసుకోండి. ఆర్బీఐ గైడ్‌లైన్స్ ప్రకారం ఆ వివరాలు మాకు అందిన వెంటనే నేను ఆ అమౌంట్‌ను మీరు చెప్పిన అకౌంట్ కి పంపడానికి వీలవుతుంది. వాటిని తొందరగా పంపండి." అని అథారిటీగా అన్నాను.

ఆ మాట వినగానే అవతలి వ్యక్తి ముఖంలో రంగులు మారాయి. "అవన్నీ మీకెందుకు? వాళ్ళేం చెప్పారో అది చేయడం మీ పని. అనవసరంగా మీరు కల్పించుకుంటే మిమ్మల్ని కూడా కేసులో ఇరికిస్తాం." అని గద్దించాడు.

"ఆహా అలాగా! వన్ మినిట్." నా ఫోన్లోంచి సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ మిత్రుడికి ఫోన్ చేసి స్పీకర్ ఆన్ చేశాను. "ఇన్ స్పెక్టర్! ఇక్కడ ఒక లైవ్ ఫ్రాడ్ జరుగుతోంది, ఈ నెంబర్ ట్రేస్ చేయండి." అని చెప్పగానే, అవతలి వైపు ఉన్న నేరగాడు భయంతో వెంటనే కాల్ కట్ చేసి, స్విచ్ ఆఫ్ చేసాడు.

కాసేపు ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. వెంకటాచలం గారు, పద్మావతి గారు అయోమయంగా నా వైపు చూస్తున్నారు.

"సార్! మీ అబ్బాయికి ఏమీ కాలేదు. ఈపాటికి మీకీ మోసం అర్థమయ్యిందనుకుంటాను. వాళ్ళు మిమ్మల్ని భయపెట్టి మీ జీవితకాల కష్టాన్ని దోచుకోవాలని చూశారు. వెంటనే మీ అబ్బాయికి ఫోన్ చేయండి, అతను క్షేమమేనని మీకు తెలుస్తుంది." అన్నాను.

ఆయన వణుకుతున్న చేతులతో అమెరికాలో ఉన్న కొడుక్కి కాల్ చేశారు. కొడుకు ఫోన్ ఎత్తి ప్రశాంతంగా పలకరించేసరికి, ఆ వృద్ధ దంపతులు ఒక్కసారిగా కుప్పకూలిపోయి ఏడ్చేశారు.

వెంకటాచలంగారు నా చేతులు పట్టుకుని, "బాబూ! నువ్వు ఈరోజు మమ్మల్ని కాపాడావు. లేదంటే ఈ వయసులో రోడ్డున పడేవాళ్లం."

ఆ వృద్ధజంట కళ్ళలో నేను మొదట చూసిన భయం మాయమై, ఒక కొత్త ఆశ కనిపించిన ఆ క్షణంలో నేను పొందిన ఆనందం, నా బ్యాంకింగ్ కెరీర్‌లో నాకు లభించిన అవార్డులన్నిటికన్నా గొప్పదనిపించింది. ప్రజల ఆర్థికావసరాలకు మాత్రమే కాకుండా వారి సామాజికావసరాలకు కూడా ఉపయోగపడే ఒక బేంకర్‌గా మిగిలిపోవాలనే సంకల్పం నాలో బాగా బలపడింది.

"మీ అబ్బాయి, మీ డబ్బు, మీరు సురక్షితంగా ఉన్నారు. ఇకనుంచి తెలియని నంబరు నుంచి ఇటువంటి ఫోన్లు వచ్చినప్పుడు ఏ మాత్రం బెదిరిపోకుండా, భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారమివ్వండి. దానికోసం ఒక ప్రత్యేకవిభాగంతో బాటుగా ఒక నంబర్ కూడా ఉంది. మీరు అప్రమత్తంగా ఉంటే ఎవ్వరూ మిమ్మల్ని మోసం చేయలేరు. ఈ సమాచారాన్ని మీ స్నేహితులతోటి, సన్నిహితులతోటి పంచుకోండి. వెళ్ళిరండి. జాగ్రత్తగా ఉండండి. మీకే అవసరం కలిగినా సంకోచించకుండా నన్ను కలవండి." అని భరోసా ఇచ్చి పంపాను. వారు వెళ్తుంటే నా మనసుకు ఏదో తెలియని తృప్తి.

మానవత్వం అనే దివ్యమైన అనుభూతిని నింపుకుని వికలమైన నా మనసు కొత్తస్థితికి చేరుకోవడం చాలా ఆనందాన్ని కలిగించింది

బ్యాంకర్ అంటే కేవలం అంకెల యంత్రం ముందుండే మరమనిషి కాదని, ఎన్నో అంకెల మధ్య చిక్కుకున్న చిన్న మనసున్న మనిషని అందరికీ తెలిసేలా అరిచి చెప్పాలని ఆ క్షణంలో నాకనిపించింది.

# గురుడా... మజాకా!!!

## కృపాకర్ పోతుల

*"ఇప్పుడే కదా ఇలా వచ్చి కూర్చున్నాం. కనీసం గోలీసోడా అయినా తాగలేదు కదా ఇంకా. 'ఇంకో థమ్సప్' తాగమని వాగుతావేంటి? మతిగాని పోయిందా నీకు?" అని ఆడపులిలా గర్జించబోయింది. కానీ... గర్జించడానికి ఓపికలేక పోవడంతో కీచుమని మూలిగింది... చుంచెలకలా!*

"ఏంటీ, ఇప్పుడీ ఏడుకొండలూ నడిచి ఎక్కాలా! టేక్సీలో కాదు సరికదా, కనీసం బస్సులోనైనా వెళ్ళట్లేదా!! నావల్ల కాదు, నేన్నడవలేను, నడవను." మొరాయించింది పావని.

"దేవుడి దర్శనానికని వచ్చి, ఇలా మాట్లాడొచ్చా పాఁవూ. వెధవ శరీరం... దీన్నెంత ఎక్కువ శ్రమపెట్టి దైవాన్ని దర్శించుకుంటే, అంతెక్కువ పుణ్యం లభిస్తుందట తెలుసా! ముకేష్ అంబానీ... పేరు విన్నావు కదా, బిలియనీరు, ఆసియా ఖండంలోనే రిచ్చెస్టు ఫెలో! అప్పుడెప్పుడో కొడుక్కి పెళ్ళి చేసినప్పుడు ఎంత ఖర్చు పెట్టేడో తెలుసా పాఁవూ? ఐదువేలు... అక్షరాలా ఐదువేల కోట్లు ఖర్చుపెట్టి చేసేడు కొడుకు పెళ్లి, ధూమ్... ధామ్ అని! అంత రిచ్చి! అలాంటోడే మా...మూ...లు ఆర్డినరీ మనిషిలా నడుచుకుంటూ ఏడుకొండలూ ఎక్కేసేడా మజ్జెప్పుడోగాని! అల్పజీవులం... మనవఁనగా ఎంత, మన బతుకెంత!" అని ప్రవచనాలు వల్లించే గురూగారిలా గంభీరంగా సెలవిచ్చేడు గురుమూర్తి.

'ఎదవ టీటీలు నాదగ్గర ఆడకు' అన్నట్టు కోపంగా చూసింది పావని. "చూడూ మా నాన్న కమ్యూనిస్టు పార్టీ కార్డు హోల్డరనీ, దేవుళ్ళన్నా దెయ్యాలన్నా ఇసుమంతైనా నమ్మకం గాని, భయం గాని ఆయనకు ఉండేవి కాదనీ, నన్ను కూడా అలాగే పెంచేడనీ... నీకు తెలుసు. నీ నస భరించలేక వచ్చేను గాని, మామూలుగా అయితే చచ్చి గీపెట్టినా, గుళ్లూ గోపురాలూ తిరిగే మనిషిని కాదు నేను. ఎల్టీసీ పెట్టేను, ఫ్లైట్లో వెళ్తున్నావఁని చెప్పి, రైల్లో... అది కూడా ఆర్డినరీ స్లీపర్ క్లాసులో తీసుకొచ్చేవు. ఉండేది ఏసీ హొటేల్లోనని చెప్పేవు... చెప్పేవా లేదా? తీరా ఇక్కడికొచ్చేక ఏంచేసేవ్? తీసుకెళ్లి మీ బేంకు గెస్ట్ హౌస్‌లో తగలేసేవు. ఇప్పుడేమో, ఈ ఎండలో ఏడుకొండలూ నడిచెక్కాలంటున్నావు. నీ పీనాసితనం కాదు గాని... చస్తున్నాన్నీతో!" ఆడతాచులా బుసలు కొడుతున్న పావని వేపు భావరహితంగా చూసి, సోక్రటీసులా ఫిలాసాఫికల్‌గా నవ్వేడు గురుమూర్తి.

"భగవంతుని సన్నిధిలో అలా మాట్లాడొచ్చా పాఁవూ, అపచారం కాదూ! నడిచి వెళ్తే పుణ్యవొఁస్తుందనే గాని, నిన్ను ఇబ్బంది పెట్టాలని నాకు మాత్రం ఉంటుందా చెప్పు! ఎలాగోలా కష్టపడి కొండ ఎక్కేస్తే, దిగేటప్పుడు తప్పకుండా టేక్సీలోనే దిగుదాం. కాదనకు. సరేనా!" అని కాళ్ళు పట్టుకున్నంత పనిచేసిన భర్తను భస్మం చేసేలా చూస్తూ...

'ఈ పీనాసి మొగుడితో వాదించుట వలన ఒనగూరు ఫలితము శూన్యము' అన్న నిప్పులాంటి నిజం రెండున్నర దశాబ్దాల క్రితమే గ్రహించియున్నది గనుక, 'లాంగ్ మార్చ్ టు ద టాప్ ఆఫ్ సెవెన్ హోలీ హిల్స్' మొదలుబెట్టింది పావని!

'నా దగ్గరా నీ కుప్పిగంతులు' అన్నట్టు పావని వేపు దొంగచూపొకటి, ఆమె చూడకుండా పారేసి, ఆమెను

అనుసరించేదు గురుమూర్తి నక్క వినయాలు ఒలకబోస్తూ!

★★★

గురుమూర్తి అల్లాటప్పా మనిషి కాదు. అతిపెద్ద కమర్షియల్ బేంకులో, ఒక మీడియం సైజ్ బ్రాంచికి బ్రాంచి మేనేజరుగా ఉద్యోగం వెలగబెడుతున్నవాడు. అవడానికి ఆఫీసరే గాని, 'ఓ.ఎల్.క్యూస్' అనగా 'ఆఫీసర్ లైక్ క్వాలిటీస్' ఒక్కటంటే ఒక్కటి, మచ్చుకైనా లేనివాడు! పరమపీనాసి!! ఎంగిలి చేత్తో కాకిని కొట్టడం, పిల్లికి బిచ్చం పెట్టడం వంటి పనులు 'బుద్ధి బొత్తిగా లేనివారూ, ఉత్త దుబారా మనుషులూ' చేసే పనులు... గురుమూర్తిగారి దృష్టిలో! అందుకే అటువంటి పనికిమాలిన పనులు, ప్రాణం పోయినా సరే చెయ్యరు వారు!



పోనీ... కనీసం గెడ్డమైనా రోజూ గీసుకుంటారా అంటే... అబ్బే, అది కూడా చెయ్యరు. ఎందుకంటే, రోజూ గెడ్డం గీసుకుంటే, రేజర్లకీ, షేవింగ్ క్రీముకీ తడిసిమోపెడు అవుతుంది కదా, అందుకు! ఇక సర్వకాల సర్వావస్థలయందూ, చివరికి మండు వేసవికాలంలో కూడా, వారానికి ఒకసారి మాత్రమే... సోమవారం ఉదయం బేంకుకి వెళ్ళేటప్పుడు మాత్రమే... ఇస్త్రీ గుడ్డలు వేసుకుంటారు. వాటిని మార్చేది మళ్ళీ నెక్స్ట్ మండే మోర్నింగే. మధ్యలో పొరపాటున కూడా బట్టలు మార్చరు. ఆయన ధరించే గుడ్డలు కూడా ఎలా ఉంటాయంటే, రంగులు వెలిసిపోయీ, బొత్తాలు ఊడిపోయీ, షర్టులు... కాలర్ల దగ్గరా, పేంట్లు... చీలమండల దగ్గరా చినిగిపోయి, దారాలు వేలాడుతూ... ఎలా ఉంటాయంటే...

ఎవరినైనా 'తీసుకోవా ప్లీజ్!' అని బతిమాలితే... 'వాట్ ద హెల్ డు యూ థింక్ ఆఫ్మీ ఐ సే? ఎలా కనబడుతున్నానీకు? అసలేవనుకుంటున్నావ్ నాగురించి? అలాంటి ఫిల్టీ రేగ్స్‌ని నా లిటిల్ ఫింగర్ తోనైనా, టచ్చేసేవోడీలా కనబడతన్నానా నేన్నీకు?!' అని ముషైత్తుకునేవాడు కూడా సగం ఇంగ్లీషులోనూ, సగం తెలుగులోనూ చీదరించుకునేటంత ఛండాలంగా ఉంటాయి.

ఇక గురుమూర్తి ధరించే చెప్పుల సౌందర్యం వివరించడానికి ఏ భాషా చాలదు. ఉంగటాలు ఊడిపోయి, అడుగులు అరిగిపోయి, నిండా అతుకులతో, ఆ అతుకుల నిండా కుట్లతో... 'మొహంజదారో' 'హరప్పా' తవ్వకాల్లో బయటపడ్డ 'బహుకాలపు పురాతన వస్తువులని' తలపింపజేస్తాయి.

గురుమూర్తి ఆ బ్రాంచికి మేనేజరుగా వచ్చి సంవత్సరం కాకుండానే, దానికి ఎదురుగా కూర్చొని చెప్పులు బాగుచేసుకునేవాడు, వాడి డొక్కు సైకిలు అమ్మిపారేసి, బ్రేండ్ న్యూ మోపెడ్, ఏ బేంకులోనూ రూపాయి లోను తీసుకోకుండా కొనుక్కున్నాడని, జోకులు వేసుకుంటారు గురుమూర్తి కింద పని చేసే 'మెసెంజర్లు'.

అంతటి ఘనకీర్తి మూటకట్టుకున్నవాడు... ఇంటికి జస్ట్ నాలుగడుగుల దూరంలో మాత్రమే ఉన్న నూకాలమ్మ గుడిలోకి అడుగుపెడితే, అర్థరూపాయి దక్షిణ వెయ్యాల్సొస్తుందని చెప్పి, ఏనాడూ అడుగు కూడా పెట్టని భక్తశిఖామణి... సతీసమేతంగా తిరపతికి విచ్చేసేడంటే, అందుకు గల ఏకైక కారణం... పదేళ్లనుండీ రాని ప్రమోషన్ వచ్చి ఒళ్ళో పడడమే!

తన దగ్గర గుమస్తాలుగా పనిచేసిన కుర్రవెధవలు... బుర్రతక్కువ వెధవలు మేనేజరుగారి దృష్టిలో... బోలెడంతమంది, తారాజువ్వల్లా ఝుమ్మంటూ పైపైకి దూసుకుపోతుంటే, తను మాత్రం ఉన్న దగ్గరే చతికిలబడిపోవడంతో చాలా 'ఇన్సల్టు' ఫీలవసాగేడు గురుమూర్తి.

ఎంతమంది పై అధికారుల కాళ్ళూచేతులూ ఎన్నివిధాలుగా పట్టుకొని సవరదీసినా, ప్రమోషన్ మాత్రం దక్కకపోవడంతో... 'అదేగాని వస్తే, సతీసమేతంగా నీ దర్శనానికి వస్తాననీ, నడిచి కొండెక్కుతాననీ, గుండు కొట్టించుకుంటాననీ, ఒక కొబ్బరికాయ కూడా కొట్టి, హుండీలో పాతిక రూపాయలు వేస్తాననీ' ధైర్యంగా మొక్కేసుకున్నాడు. 'ఇంతకాలం రాని ప్రమోషను, ఇప్పుడు మొక్కుకుంటే మాత్రం వచ్చి చస్తుందా! వస్తే, మంచిదే. అప్పుడే చూసుకోచ్చు' అని మనసులో తలంచినవాడై.

అయితే, మొక్కుకొని ఆరునెలలైనా తిరగక ముందే, అన్నాళ్లూ అందని ద్రాక్షలా ఊరించిన ప్రమోషను ఎగిరొచ్చి మరీ ఒళ్ళో వాలిపోయింది. దాంతో 'మెక్కుకుంటే మాత్రం వెళ్ళే తీరాలా?' అన్న మీమాంసలో పడిపోయాడు.

అప్పటికీ ‘ఊర్లోనే, ఇంటికి అరమైలు దూరంలో ఉన్న గుడి, వెంకటేశ్వరస్వామిదే! అక్కడికెళ్ళి, దర్శనం చేసుకొని, కొబ్బరికాయ కొట్టేసి, తలనీలాలు సమర్పించేసి, హుండీలో పాతిక రూపాయలు వేసేస్తే, మొక్కుకి మొక్కూ తీరిపోతుంది, ఖర్చుకి ఖర్చూ కలిసొస్తుంది’ అన్న బ్రిలియంట్ ఐడియా రావడమైతే వచ్చింది గాని, దానితో పాటు ‘స్వామివారికి ఒకవేళ కోపం గాని వచ్చి నెక్స్ట్ ప్రమోషన్‌కి గండి కొట్టేస్తేనో’ అన్న భయం కూడా, చాలా ఎక్కువ మోతాదులో వేసింది.

దాంతో, వేరుమార్గము లేక, తప్పనిసరి పరిస్థితుల్లో, సతీసమేతంగా, దేవదేవుని దర్శనానికి తరలి రాక తప్పలేదు గురుమూర్తికి!

పతిదేవుని పరాక్రమము... పెళ్ళైన మరసటిరోజు నుంచే సంపూర్తిగా తెలిసియున్నది కావడంతో, ‘నన్నడిగి మొక్కుకున్నావా... నన్ను కూడా తీసుకొస్తానని? నేను రాను పొమ్మం’ది పావని. అయితే, కాలు కందకుండా, కట్టుకున్న చీర నలగకుండా ఫ్లైట్లో తీసుకెళ్ళి, ఫ్లైట్లోనే తీసుకొస్తానని, తనమీదే... అంటే పావని మీదే... ఒట్టేసి మరీ చెప్పడంతో, ఒక బలహీనక్షణంలో నిజమని నమ్మి బయల్దేరింది పాపం!

★★★

నడకదారిలో నడుస్తున్నంతసేపూ భర్త మీద విసుక్కుంటూనే ఉంది. ఆపసోపాలు పడుతూ, వాచిపోతున్న మోకాళ్ళనీ, పాదాల్నీ సవరదీసుకుంటూ, ప్రతీ పదడుగులకీ పది నిమిషాలపాటు రెస్ట్ తీసుకుంటూ, ముక్కుతూ, మూలుగుతూ క్యూ కాంప్లెక్సు దగ్గరకు చేరుకునేసరికి అయిదుగంటల సమయం పట్టింది. అక్కడికి వెళ్ళేక గాని తెలియలేదు... కనీసం మూడువందల రూపాయల ‘స్పెషల్ దర్శనం’ టికెట్టైనా కొనలేదు పీనాసిమొగుడని!

అప్పటికే బాగా డీలా పడిపోయిందేమో, మళ్ళీ తిట్టడానికి అరఔన్సు ఓపికైనా మిగల్లేదామెలో! దాంతో ‘ఇంటికెళ్లనియ్ అప్పుడు చెప్తాన్నీ సంగతి’ అన్నట్టు చూపుల్లోనే నిప్పురవ్వలు విరజిమ్మి, ధర్మదర్శనం క్యూలో మరో ఆరు గంటలపాటు నిలబడి, ఎట్టకేలకు దర్శనం పూర్తయిందనిపించింది. ‘బతుకు జీవుడా’ అని బయటపడింది.

‘కొం...చెం’ టైం పట్టినా, రూపాయి ఎక్స్ట్రా ఖర్చు లేకుండా దర్శనం జరిగిపోయినందుకు పరమానందభరితుడయ్యేడు గురుమూర్తి. ఆ బలహీనక్షణంలో సహధర్మచారిణి మీద అపరిమితమైన అనురాగం, అనురక్తి, ఆపేక్షా, అభిమానం ఇవన్నీ కలగలిసిన కొత్త ‘కాక్టెయిల్’ ఒకటి ఉద్భవించి, బుస్సున ఎగదన్నింది గురుమూర్తి గుండెలోతుల్లో!

ఆ శుభసందర్భాన్ని గ్రాండ్‌గా సెలిబ్రేట్ చేసుకోవాలన్న కోరిక కలిగింది. అలా చేస్తే, అలసట తీరాక మళ్ళీ బద్దలవబోయే అగ్నిపర్వతాన్ని, టెంపరరీగా శాంతింపజేయవచ్చన్న, ఇంటికెళ్ళేక మిగతా విషయాలు చూసుకోవచ్చ ‘బ్రిలియెంట్ బ్రెయిన్ వేవ్’ అంకురించింది.

అంతే... ఏమాత్రం ఆలస్యం చెయ్యలేదు గురుమూర్తి. నీరసంతో తోటకూరకాడలా వేలాడిపోతున్న పావని భుజం చుట్టూ ప్రేమగా చెయ్యివేసి, పక్కనే ఉన్న కూల్డ్రింక్ షాప్ లోకి నడిపించుకు వెళ్ళేడు నెమ్మదిగా. ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చోబెట్టేడు ప్రేమగా. ఎదురుగా తను కూడా ఆసీనుడయ్యేడు అణకువగా.

"బాగా అలసిపోయావు గాని, ఓ పావుగంట రెస్ట్ తీసుకో పాఁవూ! కాళ్ళపీకులు కాస్త తగ్గాక, హాయిగా 'బస్సెక్కి' దిగువకి వెళ్లిపోదాం. రూముకి వెళ్ళేక కాళ్ళకీ, పిక్కలకీ కొబ్బరినూనె మర్దనా చేస్తాను. చేత్తో తీసి పడేసినట్టు మాయమైపోతాయి నొప్పులన్నీ! బాగా అలసిపోయి ఉన్నావు, 'ఇంకో థమ్సప్' తాగు! అలసట తగ్గుతుంది" అని సెలవిచ్చేడు మార్దవంగా... చూపుల్లోనూ, మాటల్లోనూ లీటర్లకొద్దీ ప్రేమ గుమ్మరిస్తూ!

పతిదేవుని మాటలు కొంచెం కూడా బోధపడని పావని... అయోమయంగా చూసింది భర్తవేపు. "ఇప్పుడే కదా ఇలా వచ్చి కూర్చున్నాం. కనీసం గోలీసోడా అయినా తాగలేదు కదా ఇంకా. 'ఇంకో థమ్సప్' తాగమని వాగుతావేంటి? మతిగాని పోయిందా నీకు?" అని ఆడపులిలా గర్జించబోయింది. కానీ... గర్జించడానికి ఓపికలేక పోవడంతో కీచుమని మూలిగింది... చుంచెలకలా!

పావని మాటలు విన్న గురుమూర్తి మొహం ఆవేదనతో నల్లగా మాడిపోయింది. హృదయం వేదనతో బాధగా మూలిగింది. నాలుగుసార్లు గట్టిగా ఊపిరితీసుకొని, నెమ్మదిగా వదిలిపెట్టి, "పెళ్ళానికెప్పుడూ కూల్డ్రింకే ఇప్పించని పరమ పీనాసివెధవతో మాట్లాడినట్టు అలా మాట్లాడతావేంటి పాఁవూ, నువ్వలా మాట్లాడుతుంటే నాకెంత బాధగా ఉంటుందో తెలుసా నీకు? పాతికేళ్ళ క్రితం... పెళ్ళైన కొత్తలో... మనిద్దరం మొట్టమొదటిసారి తిరపతొచ్చినప్పుడు... ఇక్కడే, ఈ షాపులోనే కదా చల్లటి 'థమ్సప్' ఇప్పించేన్నీకు. అప్పుడే ఎలా మర్చిపోయావ్ పాఁవూ!!" ప్రశ్నించేడు తెలుగు సినిమా ట్రాజెడీ హీరోలా!

అంతే... ఏడుకొండలూ నడిచి మరీ ఎక్కి, అలసిపోయి, సొలసిపోయి దుర్బలంగా జీవచ్ఛవంలా తయారయిందేమో, గురుడు కొట్టిన దెబ్బకి కళ్ళు బైర్లుకమ్మి "ఢా"మ్మని కింద పడిపోయింది భార్యామణి!!

# శౌచాలయం

నందూరి సుందరీ నాగమణి
✆ 984998920

***"ఎంత బిజీగా ఉన్నా, దీనికి ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వండి. డీజీయమ్ గారి దృష్టికి వెళ్ళిందంటే చాలా ప్రమాదం. వీలైనంత త్వరగా వాళ్ళకి కావలసినట్టుగా చేయించండి. మీకు తెలుసా, బాత్‌రూమ్ లోపలి భాగం అంతా ఫోటోలు తీసి, మరీ అటాచ్ చేసింది సమీర. ఎంత ఘోరంగా ఉందో చెప్పలేను. మనం మన ప్రత్యేకమైన సౌకర్యాలను వినియోగించుకుంటున్నాము. మనవైతే వాష్‌రూమ్స్ ఆఫీసులో ఇలా ఉండవు కదా!***

"సమీరగారూ! మీరు వచ్చి రెండురోజులే అయినా, మీతో ఎప్పటినుంచో కలిసి పనిచేస్తున్నట్టు ఉంది!" భోజనాల సమయంలో నవ్వుతూ అన్నది లక్ష్మి.

"నాకు కూడా అంతేనండి లక్ష్మిగారూ... మీరు, ప్రభ, లత, సుధాకర్ అందరూ ఎప్పటినుంచో పరిచయమైనవారిలా అనిపిస్తున్నారు!" మనస్ఫూర్తిగా అన్నది సమీర.

"మరి మన బాసు?" నవ్వింది ప్రభ, టేబుల్ మీదుంచిన సీసాలోంచి, ఆవకాయ వడ్డించుకుంటూ.

"ఇది ప్రత్యేకంగా చెప్పేదేముంది? మీరే చెప్పాలి, ఎప్పటినుంచో ఆయన్ని చూస్తున్నారుగా..." అన్నది సమీర.

"వద్దులెండి... ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది!" అంది లత.

ప్రశ్నార్థకంగా చూసింది సమీర.

"ఆయనకి విపరీతమైన కోపమండీ. స్టాఫ్‌తో మంచి రిలేషన్స్ మెయిన్‌టెయిన్ చేయడసలు! హిట్లర్ పరిపాలన! పెద్దాయన కదా, ముఖంలో కాఠిన్యం తప్ప, ప్రశాంతత ఉండదసలు. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడరు. ఇలాంటివారి దగ్గర పనిచేస్తే ఏం సంతోషంగా ఉండగలం మేడమ్?"

తలపంకించింది సమీర. ఇటీవలే ట్రాన్స్ఫర్ మీద వచ్చి ఈ బ్రాంచ్‌లో జాయిన్ అయిన సమీరకు, ఇక్కడ చాలా అసౌకర్యంగా ఉంది. స్టాఫ్ తక్కువ, పని ఎక్కువ. అయితే సమస్య పని గురించి కాదు.. బ్రాంచి మేనేజర్ అయిన సింహం గురించి. ఆయన పేరు 'నరసింహం' కానీ అందరూ సింహం గారు అని అంటారు. పెద్ద కస్టమర్స్ తో తప్ప ఆయనెప్పుడూ ఎవరితోనూ నవ్వుతూ మాట్లాడగా చూడలేదెవరూ. సమీర ఏం చేసినా ఆయనకు నచ్చదు. ఎప్పుడూ ఆమె వర్క్ లో తప్పులు పడుతూనే

ఉంటాడు. 'కొత్తగా వచ్చింది, ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడాలి కదా' అనే ఆలోచన ఆయనలో లేదు. 'మీరెలా అయినా చావండి, నాకు పనులవ్వాలి' అనే టైపు ఆయన.

"మీరు రిటైర్మెంట్‌కి దగ్గరలో ఉన్నారు కదా సమీరా మామ్, ఈ ఊరి చివరి బ్రాంచ్‌కి వచ్చారేం?" ఆసక్తిగా అడిగింది, లక్ష్మి.

"కొన్ని ఆరోగ్యసమస్యలు వచ్చాయని రిటెన్షన్ అడిగాను, బయటి జోన్‌కి వెళ్ళకుండా. ఊరిలోనే అని, ఈవిధంగా ఊరి చివరి బ్రాంచ్‌కి వేసారు. దీని కన్నా, బయటి జోన్‌కి వెళ్ళిపోయి ఉంటేనే బాగుండేదేమో!" నవ్వింది సమీర.

"అవునా! మేమంతా ఇక్కడికి దగ్గరలోనే ఇళ్ళు కట్టుకుని ఉన్నవాళ్ళం. అందుకే అడిగి మరీ ఈ బ్రాంచ్‌కి వచ్చాం. కానీ మీరు సిటీలో స్వంత ఇల్లు పెట్టుకుని, ఇక్కడికి రావలసి వచ్చింది. రోజూ ఇంటికి వెళ్ళి రావటం కూడా కష్టమే కదా మేడమ్!"



"అవును లక్ష్మీ! అందుకే ఇక్కడే అద్దె ఇంటి కోసం ప్రయత్నిస్తున్నాను. ఒక సంవత్సరమైనా ఇక్కడ పని చేయాలి కదా మరి... అవునూ, అన్నట్టు..." ఏదో అడగబోయి ఆగిపోయింది, సమీర.

"ఏంటి మేడమ్?"

"అదే... ఆ లేడీస్ బాత్‌రూమ్... ఎలా తట్టుకుంటున్నారు? నాకైతే మేనేజ్ చేయటం చాలా కష్టంగా ఉందమ్మా లతా!" అంది సమీర.

"ఏం చేయం మేడమ్! తప్పనిసరిగా భరిస్తున్నాము." అన్నది ప్రభ.

"అంటే? మన సమస్యలను సింహం గారికి చెప్పాలి కదా!"

"ఏం చెప్తాం మేడమ్... బాగుండదు కదాని..." నసిగింది లక్ష్మి.

ఒకసారి ఆ బాత్‌రూమ్ స్వరూపం సమీర కళ్ళ ముందు నిలిచింది. లోపలికి అడుగుపెట్టగానే కిందంతా జారిపోయే జిడ్డునేల. చెప్పులకాళ్ళను జాగ్రత్తగా నేలమీద ఆనించాలి. చాలాచోట్ల గచ్చంతా పాడైపోయింది. అవుట్‌లెట్ వైపు స్లోప్ లేక, నీళ్ళు నిలిచిపోయి ఉంటాయి. విరిగిపోయిన కుళాయి. పక్కన డ్రమ్ములో నీరు. రన్నింగ్ వాటర్ లేదు. స్వీపర్ రెండురోజులకోసారి డ్రమ్‌ని నింపుతుందట. మరోప్రక్కన పెద్ద విండో. విండో గ్లాసు విరిగిపోయినట్లుంది, ఎవరూ పట్టించుకోలేదు. బాత్‌రూమ్ అవతల ఉన్న ఓపెన్ గ్రౌండ్‌లో ఎవరో ఒకరు ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు. ఎవరైనా లోపలికి తొంగిచూసే ప్రమాదం ఉంది.

ఇక ఆ కమోడ్.. దాన్ని తలచుకోగానే సమీరాకు కడుపులో తిప్పినట్టయింది. మెట్లులేని రెండడుగుల ఎత్తైన అరుగు. దానిమీద ఇండియన్ కమోడ్. అదికూడా రంగు మారిపోయి, ఎంతో మురికిగా, వాసన కొడుతూ... భయంకరంగా ఉంటుంది. అవసరం తీర్చుకోవటానికి దానిమీద ఎలావంగి కూర్చోగలరు? లత తప్ప, అందరూ పెద్దవాళ్ళే. ఫ్లష్ సౌకర్యం లేదు. చిన్న బకెట్‌లో నీరు నింపుకుని మరీ అరుగు ఎక్కాలి. ఈమధ్య మోకాళ్ళనొప్పులు ఎక్కువైపోయాక, ఇలాంటి అరుగులు ఎక్కలేకపోతోంది సమీర! రోజులో కనీసం ఒక్కసారైనా వాష్‌రూమ్‌కి వెళ్ళాల్సిన అవసరం అందరికీ ఉంటుంది. అసలు డాక్టర్లు అయితే, గంటగంటకీ నీరు త్రాగాలని, చెబుతారు కదా... ఆఫీసులలో వాష్‌రూమ్‌లిలా ఉంటే, ఆరోగ్యసూత్రాల్ని ఎవరైనా ఎలా పాటించగలరు?

"లక్ష్మిగారూ, ప్రభా! ఇంచుమించుగా మన ముగ్గురిదీ ఒకటే వయసు. లత ఇంకాస్త చిన్నది. ఈ బ్రాంచ్‌లో ఉండే మనందరికీ ఆ వాష్‌రూమ్ చాలా ముఖ్యమైన అవసరం. అది అలా ఉంటే ఎలా?"

"ఏం చేయగలం సమీరా! నేను లంచ్‌కి ముందు ఓసారి, సాయంత్రం ఐదుకు ఓసారి మా ఇంటికి వెళ్ళివస్తూ ఉంటాను. వెనుకవీధిలోనే మా ఇల్లు. మీరుకూడా రావచ్చు. లత, ప్రభ కూడా అప్పుడప్పుడు వస్తూ ఉంటారు."

"ఇది పరిష్కారమా లక్ష్మీ?" సమీర ఆశ్చర్యంగా చూసింది.

"ఆయనతో చెప్పే ధైర్యం మాకు లేదు మేడమ్. అయితే భరించాలి, లేదా ఆల్టర్నేటివ్ చూసుకోవాలి. అంతకన్నా ఏమిచేయగలం?"

దీర్ఘంగా నిట్టూర్చి, సమయం అయిపోవటంతో చేయి కడుక్కోవటానికి లేచింది సమీర.

★★★

ఆ సాయంత్రం ఆఫీసు అవర్స్ అయిపోయాక, తన కేబిన్‌కి వచ్చిన సమీరను చూసి, ముఖం చిట్లించాడు, సింహం.

"ఏంటి?"

"మీతో కొంచెం మాట్లాడాలి సర్."

"చెప్పండి!"

"ఇంట్లో ఏదైనా సమస్య ఉంటే ఇంటి యజమానికి చెప్పుకుంటాము. పిల్లలకు సమస్య ఉంటే తండ్రికి చెప్పుకుంటాము. ఈ బ్రాంచికి మీరు పెద్ద కనుక మీ దగ్గరకు వచ్చాను."

"ఉపన్యాసాలు, ఉపోద్ఘాతాలు వద్దు. విషయానికి రండి!"

"మాకు మంచి లేడీస్ బాత్‌రూమ్ కావాలి సర్."

"ఉంది కదా!"

"ఎప్పుడైనా దాని అవతారం మీరు చూసారా?" మెత్తగానే అయినా సూటిగా అడిగింది సమీర.

"లేదు. నాకేం అవసరం మేడమ్? అయినా ఇన్నాళ్ళుగా పనిచేస్తున్నవారెప్పుడూ ఏ కంప్లైంటూ చేయలేదు. ఇప్పుడు మీరువచ్చి, బాత్‌రూమ్ కావాలి, అందులో షవరు కావాలి అని అడిగితే ఎట్లా?" వ్యంగ్యంగా, వెటకారంగా నవ్వాడు, సింహం.

తానూ ఏమీ తగ్గదలచుకోలేదు సమీర.

"షవర్లూ, బాత్‌టబ్‌లూ వద్దులెండి సర్. వాటిని ఎంజాయ్ చేసేంత సమయం ఇక్కడ మాకుండదు. కనీససౌకర్యాలు కావాలి. ఫ్లోరింగ్ అసలు బాగాలేదు. కమోడ్ మార్పించి, వెస్ట్రన్ కమోడ్ వేయించాలి. అంత ఎత్తులో కాకుండా, అది నేలబారుగా ఉండాలి. రన్నింగ్ వాటర్ చాలా అవసరం. ప్రతీరోజూ మనిషి వచ్చి క్లీన్ చేయాలి. బ్యాడ్ స్మెల్ రాకుండా ఎయిర్ ఫ్రెష్‌నర్ వంటివి పెట్టాలి. చేతులు కడుక్కోవటానికి సోప్, హ్యాండ్ వాష్ లిక్విడ్ వంటివి ఉంచాలి. ఒక వాష్ బేసిన్ కూడా కావాలి. ముఖ్యంగా ఆ విండో క్లోజ్ చేయించాలి. దాని వలన చాలా ప్రమాదం ఉంది."

"మీ డిమాండ్స్ వినేంత సమయం నాకు లేదు. ఇప్పుడు కుదరదు. తరువాత చూద్దాం. యు కెన్ గో నౌ..." చేతిలోని ఫైల్ లోకి తలదూర్చాడు, సింహం.

ఆయన ఎదురుగా ఉండే కుర్చీల్లో ఒకటి వెనక్కి లాగి, అందులో కూర్చుంది, సమీర.

"సర్, బాత్‌రూమ్ అనేది మినిమం సౌకర్యం. మేము... మా ఇళ్ళల్లో కన్నా రోజులో ఎక్కువ సమయం గడిపేది ఇక్కడే కదా! ప్లీజ్, ఒక్కసారి మా బాత్‌రూమ్‌ని చూడండి. చాలా దుర్భరంగా ఉంది. మీకు చెప్పే ధైర్యం లేక, మన స్టాఫ్ మెంబర్స్ ఎవరూ ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకురాలేదు. నేను నా వయసురీత్యా చాలా కష్టపడుతూ ఉన్నానండీ. మేమంతా మీ సిస్టర్స్మనుకొని కొద్దిగా హెల్ప్ చేయండి. ప్లీజ్, బాత్‌రూమ్‌ని రెనోవేట్ చేయించండి."

చిరాగ్గా చూసాడు సింహం.

"సెంటిమెంట్ ప్లే చేయకండి, నాకు నచ్చదు. చెప్పారుగా మీ సమస్య! ఆలోచిస్తాను. మీరు వెళ్ళండి." కసురుతున్నట్టే చెప్పాడు.

ఆయనవైపు ఓసారి చూసి, బయటకు నడిచింది, సమీర.

★★★

రెండురోజుల తరువాత, సింహం కేబిన్‌కి వెళ్ళి, మళ్ళీ తమ గోడు చెప్పుకుంది, సమీర. ఈసారి ఆమెతో కలిసి, మిగిలిన ముగ్గురూ వెళ్లారు.

“చూడండి, ఇది నేను టేకప్ చేసేది కాదు. జోనల్ ఆఫీస్ పర్మిషన్ కావాలి. ముందుగా వారికి చెప్పాలి, తరువాత కొటేషన్ తీసుకోవాలి, పంపించాలి, వారు శాంక్షన్ చేయాలి అప్పుడు వర్క్ మొదలు పెట్టించాలి. సమయం పడుతుంది.” ఏమనుకున్నాడో ఏమో శాంతంగానే చెప్పాడు. ఇలా రెండుమూడు సార్లు జరిగిన తరువాత, ఒకరోజున...

ఇంటికి వెళ్ళబోతూ ఉంటే, సింహానికి జోనల్ ఆఫీస్ నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది.

“ఏమండీ సింహంగారూ, మీ బ్రాంచ్‌లో లేడీస్ బాత్‌రూమ్ పరిస్థితి బాగాలేదట కదా. మీ లేడీ స్టాఫ్ మాకు రిక్వెస్ట్ పంపించారు...” అటునుంచి పార్వతి మాట్లాడుతున్నది. ఆవిడ అసిస్టెంట్ జనరల్ మేనేజర్.

“ఎ... ఎప్పుడు మేడమ్?”

“ఇందాకే మెయిల్ వచ్చింది. సమీరగారు తన పర్సనల్ మెయిల్ నుంచి చేసారు. ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకువచ్చారా?”

“చెప్పారు మేడమ్!”

“మరి మీరసలు లోపలికి వెళ్ళి, దాని స్టేటస్ ఏమిటో చూసారా?”

“ఇంకా లేదండీ. చాలా బిజీగా ఉన్నాను.”

“ఎంత బిజీగా ఉన్నా, దీనికి ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వండి. డీజీయమ్ గారి దృష్టికి వెళ్ళిందంటే చాలా ప్రమాదం. వీలైనంత త్వరగా వాళ్ళకి కావలసినట్టుగా చేయించండి. మీకు తెలుసా, బాత్‌రూమ్ లోపలి భాగమంతా ఫోటోలు తీసి, మరీ అటాచ్ చేసింది సమీర. ఎంత ఘోరంగా ఉందో చెప్పలేను. మనం మన ప్రత్యేకమైన సౌకర్యాలను వినియోగించుకుంటున్నాము. మనవైతే వాష్‌రూమ్స్ ఆఫీసులో ఇలా ఉండవు కదా! ఇంకా నయం, ఆవిడ యూనియన్ వాళ్ళకి కంప్లైంట్ చేయలేదు! వెంటనే వర్క్ మొదలుపెట్టించండి. రేపు ఫార్మల్‌గా ఒక లెటర్ వ్రాయండి, నేను పర్మిషన్ ఇస్తూ లెటర్ పంపిస్తాను. ఒక స్త్రీగా, ఆమె వయసే ఉన్న నేను తన సమస్యను అర్థం చేసుకోగలిగాను. మీరు సాధ్యమైనంత త్వరలో వర్క్ మొదలు పెట్టించండి!” ఫోన్ డిస్కనెక్ట్ చేసింది, పార్వతి.

సింహం ఆలోచనలో పడ్డాడు. ఇక ఉదాసీనంగా ఊరుకుంటే, లాభంలేదని ఆయనకు అర్థమైంది.

★★★

ఆ రెండోరోజే వాష్‌రూమ్ వర్క్ మొదలైంది. ముందుగా లోపలి నేలంతా కొట్టేసి, యాంటీ స్కిడ్ టైల్స్‌తో ఫ్లోరింగ్ వేయించి, వెస్ట్రన్ కమోడ్ పెట్టించారు. పైప్ లైన్స్ బాగు చేయించి, మూడు కుళాయిలలో నిత్యం నీరు వచ్చే ఏర్పాటు చేసారు. ఒక వాష్ బేసిన్, సమీర అడిగిన అన్ని వస్తువులు అమర్చారు. కొత్త బకెట్స్, కొత్త మగ్స్ వచ్చాయి. బాత్‌రూమ్ ముందు అందమైన మ్యాట్ కూడా కొలువైంది. కిటికీ క్లోజ్ చేసేసారు. ప్రకాశవంతమైన లైట్స్, ఎగ్జాస్ట్ ఫ్యాన్ అమర్చారు. పని మొదలయ్యాక, పూర్తి కావటానికి ఇంచుమించుగా ఇరవై రోజులు పట్టింది.

సింహం నలుగురు లేడీస్‌ని లోపలికి పిలిచి, వ్యక్తిగతంగా 'సారీ' చెప్పి, వాష్‌రూమ్‌ని వాళ్ళకి అప్పగించాడు. ఒక చక్కనిపని జరగటానికి నడుం కట్టిన సమీరను అందరూ ఎంతగానో అభినందించారు. ఏజీయమ్ పార్వతి పర్సనల్‌గా ఫోన్ చేసి మరీ ఆమెను అభినందించింది. ఇక లక్ష్మి, లతల కృతజ్ఞతలకు అంతేలేదు. పనిలో పనిగా మగవారి శౌచాలయానికి కూడా మరమ్మత్తులు చేయించాడు సింహం!

ఇది జరిగి వారం రోజులైందో లేదో, సమీరకు జోనల్ ఆఫీస్‌కి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. ఒక స్పెషల్ వర్క్ అటెండ్ అవటానికి టీమ్ లీడర్‌గా సమీరను నియమిస్తూ, పార్వతి కోరి కావాలని సమీరను తన ఆఫీసుకు బదిలీ చేయించుకున్నది.

సమీర రిలీవ్ అయి, బ్రాంచి విడచి వెళుతూ ఉంటే, కఠినాత్ముడని పేరు పొందిన సింహం కూడా చాలా బాధపడ్డాడు. ఇక లక్ష్మి, లత, ప్రభల బాధకు అంతులేదు.

"ఇంత కష్టపడి బాత్‌రూమ్ కట్టించుకున్నామా? ఆ సౌకర్యాన్ని నేను కొన్నిరోజులు కూడా పొందటం లేదు... అక్కడ ఎలా ఉందో ఏమో లేడీస్ బాత్‌రూమ్!" వాళ్ళని నవ్విస్తూ అన్నది, సమీర.

"మీరు వెళతారుగా, చక్కగా ఉంటుంది. లేకపోతే, వాళ్ళు చేసిస్తారు." నిండుగా నవ్వింది, లక్ష్మి.

"మీరు కూడా ఏ సమస్య వచ్చినా, 'ఏమి చెబుతాములే...' అని ఉదాసీనంగా ఊరుకోకండి. అవసరమైనప్పుడు మనం ప్రశ్నించాలి. లేకపోతే అసౌకర్యాలతో అడ్జస్ట్ అవుతూ బ్రతకాలి. ఇకనైనా గొంతు తెరవాలి. సరేనా?" నవ్వుతూనే హితబోధ చేసింది, సమీర.

సమీర వెళ్లిపోయాక స్టాఫ్ అందరూ అనుకునేవాళ్ళు. "సమీరగారు బ్రాంచ్‌లో మూడునెలలు మాత్రమే వర్క్ చేసి వెళ్ళిపోయారు. అసలు ఆవిడ ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు, ఎందుకు వెళ్ళినట్టు?"

"ఎందుకేమిటి? మనకి మంచి వాష్‌రూమ్ సౌకర్యం కలిగించటానికే..." అంటూ అందరూ హాయిగా నవ్వుకుంటారు.

ఇప్పటికీ ఆ స్టాఫ్ మెంబర్స్ అందరూ, సమీరకు ఫోన్ చేసి మాట్లాడుతూనే ఉంటారు. మనలోమాట! సింహం కూడా...

# కుమ్ములాట

కోయిలాడ రామమోహనరావు
✆ 9849345060

*ఇప్పుడైనా మేల్కోండి. సులువుగా పరిష్కరించుకునే సమస్యలను ఇలా పెద్దవి చేసుకుంటే నష్టపోయేది ఎవరు? మీరే. సరే... ఈ పెద్దవాడు చెప్పే మాటల గురించి ఆలోచించి సరైన నిర్ణయానికి తీసుకుంటారో లేదా మూర్ఖంగా అదే ధోరణిలో కొనసాగుతారో మీ ఇష్టం" అంటూ అక్కడి నుంచి బయటకు వచ్చేసాను.*

నిద్రలోకి జారుకున్న నేను... టాక్సీ సడన్‌గా ఆగడంతో ఉలిక్కిపడి లేచాను. 'ఏం జరిగింది?' అని డ్రైవర్ని అడిగే లోపల, నాకే పరిస్థితి అర్థం అయిపోయింది... ఎదురుగా కనిపిస్తున్న దృశ్యం చూస్తుంటే! మా ముందు చాలా వాహనాలు ఆగిపోయి ఉన్నాయి. వాటి మధ్యలోనుంచి చూస్తే, రోడ్డుమీద వందలాదిమంది కొట్టుకుంటున్నట్టు కనిపిస్తుంది.

"సార్... మనం ఇప్పట్లో ముందుకెళ్ళే పరిస్థితి కనిపించడం లేదు. గొడవ ఏమిటో కనుక్కొని వస్తాను" అంటూ కిందకు దిగాడు డ్రైవర్ సూరి.

గొడవ చాలా భయంకరంగా ఉంది. షాపులు, బస్సులు తగలబెట్టేయడం మొదలైంది. ఏం జరిగిందో తెలియక కొట్టుమిట్టాడుతున్నాను. తిరిగి వచ్చిన డ్రైవర్ వైపు చూశాను ఆతృతగా!

"పెద్ద గొడవే సార్! కులాలమధ్య కుమ్ములాట!" అంటూ రెండుకులాల పేర్లు చెప్పాడు. అతను చెప్పినదాన్ని బట్టి, ఈ ప్రాంతపు మంత్రి కులం వాళ్లకు, ప్రతిపక్ష పార్టీకి దన్ను ఇచ్చే మరో కులానికి మధ్య రగులుతున్న అగ్నిగుండమది. ఏదో చిన్న గొడవ, చిలికి చిలికి గాలివానై, పోలీసులు కూడా కంట్రోల్ చేయలేని స్థాయికి వచ్చింది.

"ముందే చెప్పానుగా, అర్జెంటుగా సిటీకి వెళ్లాలని. ఏదో ఒకటి చెయ్" విసుక్కుంటూ అన్నాను.

"వేరేదారి మీదుగా వెళ్లాలి సార్. కాకపోతే అదనంగా అరగంట గానీ, గంటగానీ పట్టొచ్చు. ఫర్వాలేదు కదా?" అంటూ డ్రైవర్ నా అనుమతి కోసం చూశాడు. అలాగే అన్నట్లు తలూపాను.

"నా ప్రయత్నం నేను చేస్తాను సార్. కానీ దారిలో ఇటువంటి గొడవలు జరగవనే గ్యారంటీ లేదు. మనం వెళ్ళే దారిలో కూడా ఆ రెండు కులాల వాళ్ళ ఇళ్ళున్నాయి!" అని సూరి అనేసరికి, గతుక్కుమన్నాను.

★★★

కారు, మట్టిరోడ్డు మీదుగా పోతుంది. ఆ రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. దారంతా గుంతలే! అందుకే కారు నెమ్మదిగా కదులుతుంది.

"కారు ఆపు" అన్నాను అప్రయత్నంగా.

చప్పున కారు ఆపి ఆశ్చర్యంగా నా వైపు చూసాడు సూరి.

"ఆ పొదల పక్కన ఏదో మూలుగు వినిపిస్తుంది, చూడు..." అన్నాను అటే చూస్తూ.

"అవును సార్. ఏం చేద్దాం?" అన్నాడు సూరి.

"చూద్దాం పద" అంటూ కారు దిగాను.

సెల్‌ఫోన్ లైట్ వెలుగులో పొదల వెనకున్న యువకుడిని చూసి అదిరిపడ్డాను. అతని ఒళ్ళంతా రక్తమే. వెంటనే వాటర్ బాటిల్ తెమ్మని చెప్పేసరికి, సూరి వెంటనే కారు వైపు పరిగెత్తాడు. ఆ యువకుడి చేత మంచినీళ్ళు తాగించి, నీళ్ళతో ముఖం కడిగాను రక్తం పోయేటట్లు!



"ఇతనా? నేను చెప్పాను కదా సార్, మంత్రిగారి కులమని. ఆ కులపు లోకల్ లీడర్ 'అవినాష్' ఇతను! ఎలా ఉంది పరిస్థితి?" అని అడిగాడు సూరి.

"ఏమో! చెప్పలేము. దారిలో ఏదైనా హాస్పిటల్‌కి తీసుకెళ్దాం" అన్నాను, అతన్ని లేవనెత్తే ప్రయత్నం చేస్తూ.

"మీకు ఆలస్యం అయిపోతుందేమో?" అన్నాడు.

"మనిషి ప్రాణం కన్నా, అదేమీ ముఖ్యం కాదు!" అనేసరికి సూరి ముందుకు వచ్చాడు. ఇద్దరం కలిసి ఇన్నోవాలో పడుకోబెట్టాము. కుదుపులకు ఆ యువకుడు బాధగా అరుస్తుంటే తట్టుకోలేకపోతున్నాను.

"మెల్లగా పోనీ" అంటూ సూరిని హెచ్చరించాను.

అర కిలోమీటర్ దూరం వెళ్లామో లేదో... కారు మళ్ళీ ఆపాల్సిన పరిస్థితి వచ్చింది, రోడ్డుకు అడ్డంగా ఒక మనిషి పడి ఉండడంతో!

సూరి, నేను గభాలున అక్కడికి వెళ్లాం. మరో యువకుడు అచేతనంగా పడి ఉన్నాడు. ఒళ్లంతా రక్తమే. అతన్ని కూడా సూరి గుర్తుపట్టాడు.

"ఇతను ప్రతిపక్ష నాయకుడు, సూర్యారావు మేనల్లుడు భార్గవ్" అన్నాడు.

పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయడానికి ప్రయత్నించాను. పల్స్ బాగా వీక్‌గా ఉంది బ్రతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. వెంటనే హాస్పటల్‌కి తీసుకెళ్తే బతుకుతాడనిపించింది. వెంటనే అతన్ని కూడా బండెక్కించాము.

★★★

"మనం చేయాల్సింది చేసాం. ఆపైన, పై వాడి దయ!" అంటూ ఇన్నోవాని ఆనుకుని, సిగరెట్ వెలిగించాను.

"ఇది మంచి హాస్పిటల్. కాకపోతే రాత్రి పదయిపోయింది కదా? పెద్ద డాక్టర్లు ఎవరూ అందుబాటులో లేరు. కానీ డ్యూటీ డాక్టర్ మంచి పనిమంతుడిలాగే ఉన్నాడు. పెద్ద డాక్టర్లకు ఫోన్ చేసి, వాళ్ళ సలహాతో ట్రీట్మెంట్ ప్రారంభించాడు. మంచే జరుగుతుందని ఆశిద్దాం. మనం బయలుదేరుదామా? మీకు లేట్ అవుతుంది కదా?" అన్నాడు సూరి.

"అవ్వాల్సిన లేట్ అయిపోయింది. 'ప్రమాదం గట్టెక్కింది' అన్న మాట విన్న తర్వాత బయలుదేరితే మనసుకు తృప్తిగా ఉంటుంది. లేదంటే మనసు పీకుతూ ఉంటుంది. ఇక్కడ ఎక్కడైనా చాయ్ దొరుకుతుందేమో చూద్దాం. బండి తీయి. అలా తిరిగి వద్దాం" అంటూ డోర్ తెరిచాను.

మూడు కిలోమీటర్ల దూరం తర్వాత చిన్న బడ్డీకొట్టు కనిపిస్తే అక్కడ టీ తాగి హాస్పటల్‌కి బయలుదేరాం.

★★★

గాయపడిన వాళ్ళు కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. మర్నాడు ఉదయం పది గంటలకు మాత్రమే వాళ్ళను కలవడానికి అనుమతి ఇచ్చాడు డాక్టర్.

'హాస్పిటల్‌లో చేర్చింది మేమిద్దరమే' అని తెలియడంతో, వాళ్ళిద్దరూ ఒకేసారి చేతులు జోడించారు.

"సమయానికి దేవుడిలా వచ్చి కాపాడారు. మీరే లేకపోతే నేను ఏమైపోదునో?" అన్నాడు భార్గవ్ కన్నీళ్ళతో.

"మా ప్రాణాలు కాపాడడానికే మీరు ఆ దారిలో వచ్చినట్లు ఉంది. మీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను!" అన్నాడు అవినాష్ ఏడుస్తూ.

"మీ కోసం సార్... ఒక ముఖ్యమైన కార్యక్రమానికి వెళ్లకుండా ఉండిపోయారు. ఆయన ఋణం మీరు తీర్చుకోలేనిది!" అన్నాడు సూరి.

"మేము ఎవరమో మీకు తెలియదు. అయినా మా కోసం మీరిద్దరూ ఇలా పాటు పడడం ఎంతో ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు అవినాష్.

"నిజమే. మీరెవరో మాకు తెలియదు. కానీ మీకు, మాకు ఒక సంబంధం ఉంది. మనమంతా మనుషులం! కేవలం మానవతాదృక్పథంతోనే ఈ సాయం చేయగలిగాం గానీ, మీ కులాన్ని చూసో, అంతస్తు చూసో, హోదా చూసో, చేసింది కాదు!" అనేసరికి వాళ్ళిద్దరూ గాయపడ్డట్టు చూశారు.

"ఈ పరిస్థితుల్లో మీకిలా చెప్పడం సమంజసమో కాదో నాకు తెలియదు. కానీ చెప్పాల్సిన బాధ్యత నాకుంది. రెండు సామాజికవర్గాలకు ప్రతినిధులైన మీకు చెబితే కాస్తయినా ఫలితం ఉంటుందని ఈ ప్రయత్నం చేస్తున్నాను. ఈ కులమత ద్వేషాలు రెచ్చగొట్టడం, రాజకీయ నాయకుల స్వార్థప్రయోజనాల కోసమే అని మీలాంటి యువత తెలుసుకోవాలి. కులవ్యవస్థను కూలగొట్టడానికి, ఆనాడు పెరియార్ రామస్వామి లాంటి పెద్దలు ఎంతో కృషిచేసి, ప్రజల్లో మార్పు తెచ్చారు. కానీ వాళ్ళ కృషి ఇప్పుడు వృథా అయిపోయింది. దానికి రాజకీయ నాయకులతో పాటూ, ప్రభుత్వమూ వత్తాసు పలుకుతుంది. ప్రపంచ కులమహాసభలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. అన్ని కులాలవారికి కార్పొరేషన్లు తెరిచి, కులవ్యవస్థను బలపరుస్తుంది. ప్రాచీనకాలంలో వృత్తి ఆధారంగా కులాలు ఉండేవి. కానీ ఈ రోజుల్లో అందరూ అన్ని వృత్తుల్లోకి ప్రవేశిస్తున్నారు. 'పాటరీ' అనే పేరుతో కొందరు కుండలు, కూజాలు తయారు చేయడం హాబీగా పెట్టుకున్నారు. చెప్పులు కుట్టడం, అమ్మడం మాదిగ కులానికే పరిమితమయ్యేది ఒకప్పుడు. ఇప్పుడు అది అన్ని వర్గాల వారికి వృత్తి అయింది. 'షూ మేకింగ్, షూ డిజైనింగ్' అనేది ఇప్పటి యువత ఇష్టపడే వృత్తి. దానికి కులంతో సంబంధం లేదు." చెప్పడం ఆపి, సూరి వైపు చూసి నవ్వాను.

నేనెందుకలా చూశానో అర్థమైనట్లు తల ఊపాడు సూరి.

"వచ్చేటప్పుడు సార్‌తో అదే విషయం చెప్పాను. మా అబ్బాయి ఇంజినీరింగ్ చదివాడు. సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా సెటిల్ అవుతాడని, డ్రైవింగ్ చేస్తూ నాలా కష్టపడకుండా వాడి జీవితం గడిచిపోతుందని ఆశ పడ్డాను. కానీ వాడూ, వాడి ఫ్రెండ్స్ 'షూ మేకింగ్' మీద ఆసక్తి చూపిస్తున్నట్లు, ఎన్నో కొత్తకొత్త డిజైన్లు రూపొందించినట్లు, ఒక జర్మనీ కంపెనీ వాటిని

ఇష్టపడినట్లు గొప్పగా చెపుతుంటే, నాకు కంపరం పుట్టింది. వాడి భవిష్యత్తు ఏమైపోతుందోనని గాబరా పడ్డాను. కానీ నేను భయపడినట్లు జరగలేదు. వాడి ప్రోజెక్ట్ విజయవంతమయింది. సారీ సార్, మీకు అడ్డుతగిలాను. మీరు చెప్పండి సార్. వినడానికి నాక్కూడా ఆసక్తిగా ఉంది!" అన్నాడు సూరి.

చిన్నగా నవ్వి కొనసాగించాను.

"అంతెందుకు? చిన్నప్పుడు మేము స్కూల్లో చదువుతున్నప్పుడు, మాకు క్రాఫ్ట్ క్లాసులో వడ్రంగం నేర్పేవారు. కులంతో సంబంధం లేకుండా అందరం నేర్చుకున్నవాళ్ళమే. ఇప్పుడు కార్పొరేట్ హాస్పిటళ్లలోనూ, స్టార్ హోటళ్లలోనూ బాత్రూంలు, లెట్రిన్లను అన్ని కులాల వాళ్ళు శుభ్రం చేస్తున్నారు, యంత్రాల సాయంతో. అమెరికాలాంటి విదేశాల్లో సరైన ఉద్యోగం దొరకనివాళ్ళు, అన్నిపనులూ చేస్తున్నారు. అంతేకాదు. అత్యాధునికమైన హెయిర్ కటింగ్ సెలూన్లు పెట్టుకొని, వాటిమీద ఎంతో మంది డబ్బు సంపాదిస్తున్నారు. ఆడవాళ్ళు కూడా బ్యూటీ పార్లర్ల పేరుతో హెయిర్ కటింగ్ చేస్తున్నారు. పూర్వం పశువులను మేపేవాళ్ళు, యాదవులు. కానీ ఇప్పుడు డైరీఫామ్ లాంటివి అన్ని కులాల వాళ్ళు పెడుతున్నారు. వృత్తిపరంగా వచ్చిన కులాల పేర్లు ఇప్పుడు అవసరమా?

ఆ రోజుల్లో ప్రధానంగా వైశ్యులకే పరిమితమైన వ్యాపారం, ఇప్పుడు అందరూ చేస్తున్నారు కదా? పాతరోజుల్లో, కులాల మధ్య సఖ్యత ఉండేది. అందుకే కాబోలు కొందరు బ్రాహ్మణుల ఇంటిపేర్లలో 'రాజు' అనే పదం కలిసింది. పెమ్మరాజు, ద్రోణంరాజు, అన్నంరాజు, అయ్యలరాజు కొన్ని ఉదాహరణలు. 'రాఘవాచారి' అన్నది కూడా బ్రాహ్మణుల ఇంటిపేర్లలో ఒకటి అని తెలిసినప్పుడు ఎంతో ఆశ్చర్యపడ్డాను. ఇక 'రెడ్డి' అనే పదం బొల్లంరెడ్డి అంటూ కమ్మవారిలోనూ ఆదిరెడ్డి, అబ్బిరెడ్డి అంటూ వెలమవారి లోనూ జనపరెడ్డి, అన్నపురెడ్డి, కసిరెడ్డి అని కాపు వారిలోనూ కనిపిస్తుంది. ఆ రోజుల్లో వ్యాపారం చేసే వైశ్యుని శ్రేష్ఠి లేదా శెట్టి అనిపించేవారు. నిజానికి వైశ్యుల ఇంటిపేర్లలో శెట్టి అనే పదం అరుదుగానే కనిపిస్తుంది. ఎక్కడో ఇమిడిశెట్టి, కడిమిశెట్టి వంటి ఇంటిపేర్లు కనిపిస్తాయి. శెట్టి అనే పదం ఇతరకులాల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. బహుశా వారుకూడా వ్యాపారం చేయడం వల్ల అయిఉండొచ్చు. కాపుల్లో కొప్పిశెట్టి, రామిశెట్టి అన్న ఇంటిపేర్లు కనిపిస్తాయి. వెలమలలో కూడా కొప్పిశెట్టి, నానిశెట్టి కనిపిస్తాయి. ఉమ్మడి విశాఖజిల్లాలో అధికంగా కనిపించే గవరకులంలో కూడా బీమరశెట్టి, బీశెట్టి, అతికం శెట్టి, పెతకం శెట్టి... ఇలా శెట్టితో అంతమయ్యే ఇంటిపేర్లు కనిపిస్తాయి. అలా మిళితమైన కులాలను వేరుచేసి విద్వేషాలు రేకెత్తించడం ఎంతవరకు సబబో మీరే ఆలోచించండి! నిన్న జరిగిన గొడవకు కారణం తెలుసుకున్నాను. మొన్న జరిగిన తిరణాలలో ఒక అమ్మాయిని ఒక సామాజిక వర్గం వారు ఎత్తుకుపోయి, అత్యాచారం చేయబోతే, ఆ అమ్మాయి ఎలాగోలా తప్పించుకొని తన తండ్రికి చెప్పింది. అత్యంత ఆవేశపరుడైన ఆమె తండ్రి తన కులపోళ్లను రెచ్చగొట్టి, మరొక సామాజిక వర్గం పైన దాడి చేయడంతో గొడవ మొదలైంది. ఆ గొడవకు ఇరువైపులా రాజకీయ నాయకుల అండదండలు తోడైనాయి. విచక్షణారహితంగా అల్లర్లు చేయడం, ఒకరినొకరు చంపుకోవడం మొదలైంది. రావణకాష్టంలా ఆ మంటలు ఇంకా ఆరడం లేదు. ఎందరో అమాయకులు బలైపోతున్నారు" అంటుండగా అవినాష్ అడ్డుతగిలాడు,

"అంటే మా అమ్మాయిని పాడుచేయడానికి ప్రయత్నించిన వాళ్ళను ఏమీ చేయకుండా వదిలేయమంటారా?" అన్నాడు.

అతని మాటలకు భార్గవ కోపంగా చూశాడు. ”నేనలా అనలేదే? ఆ సమస్యను మరోరకంగా పరిష్కరించలేమా? మీరు ఎన్నుకున్నదే సరైన మార్గమా?” ఘాటుగా అడిగాను.

అవినాష్ సమాధానం చెప్పలేదు. ఆవేశంలో మాటమీరాడు గానీ, అతనిలో వివేకం మేల్కొందని, అతని ముఖమే చెపుతుంది.

భార్గవ కూడా కోపం తగ్గించుకొని, శాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడని నాకు అర్థమయింది. అది మంచి పరిణామమే కనుక, నా మనసు కాస్త కుదుటబడింది.

“మీరిద్దరూ బాగా చదువుకున్నట్లే కనిపిస్తున్నారు. ఆవేశం కాస్త తగ్గించుకొని, నిదానంగా నా మాట కాస్త వినండి. ఈ కులవిద్వేషాలకు అంతం లేదా? ఉంది. మీలాంటి వాళ్ళ చేతుల్లోనే ఉంది. ఈ దుష్కార్యాలను ఆపే శక్తి, ఇటువంటివి పునరావృతం జరగకుండా చూడగలిగే సామర్థ్యం మీలోనే ఉంది. ఇప్పుడైనా మేల్కోండి. సులువుగా పరిష్కరించుకునే సమస్యలను ఇలా పెద్దవి చేసుకుంటే నష్టపోయేది ఎవరు? మీరే. ఈ పెద్దవాడు చెప్పే మాటల గురించి ఆలోచించి సరైన నిర్ణయానికి తీసుకుంటారో, లేదా మూర్ఖంగా అదే ధోరణిలో కొనసాగుతారో మీ ఇష్టం” అంటూ అక్కడినుంచి బయటకు వచ్చేసాను.

★★★

“మీ మాటలకు వాళ్లలో చైతన్యం వచ్చింది సార్. వాళ్ళు మారతారు కదూ?” డ్రైవ్ చేస్తూ అడిగాడు సూరి. అతని మాటల్లో ధ్వనిస్తున్న ఆశావాదం గుర్తించగానే కాస్త ఆనందం కలిగింది. అయినా ఏదో అనుమానం.

చిన్నగా నవ్వుతూ, “ఏమో!” అన్నాను. సరిగ్గా అదే సమయంలో సిగ్నల్ వచ్చినట్లుంది. ఎఫ్ ఎమ్ రేడియోలో అన్నమాచార్య కీర్తన వినిపిస్తుంది.

“మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒకటే

ఛండాలుడుండేటి సరిభూమి ఒకటే”

నేను, సూరి ఒక్కసారిగా నవ్వుకున్నాం.

# ఆ రచయితను నేనే

వెంపటి కామేశ్వర రావు
✆ 9848306738

*ఓ నవోదయానికి శ్రీకారం చుట్టిన ఒకే ఒక రచయిత అంటూ, వేదిక మీద వ్యాఖ్యాత ప్రేక్షకులను చూస్తూ అంటే... ఆ రచయిత ఎవరు? ఎవరు?? అంటూ కొద్ది సేపు ఆగారు ఆడియన్స్ లోని ఎవరినో ఉద్దేశించి అన్నట్టుగా. చాలా సేపు సభలో నెలకొన్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఒక ఉత్సాహభరితమైన కేక ప్రతిధ్వనించింది. 'ఆ రచయితను నేనే' అంటూ నేను లేచి నిలబడ్డాను... మళ్ళీ మళ్ళీ 'ఆ రచయితను నేనే నేనే' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచాను."*

"ఈ తరం మేటిరచయితగా నేను పలువురి ప్రశంసలు పొందాలి. ఇదే నా ఆశ... ఇదే నా శ్వాస... ఇదే నా లక్ష్యం... ఇది నా గమ్యం కూడా! సభల్లో, సమావేశాల్లో నా పేరు మారుమోగిపోవాలి. సన్మానాలు, సత్కారాలు అంటూ అందరూ నా వెంటపడాలి. నన్ను గౌరవించాలి... అంతే! అంత గట్టిగా ఎలా చెప్పగలనంటే... నా భావుకత, సృజనాచాతుర్యం, భాషాపాండిత్యం, రచనాశైలి అందరినీ ఆశ్చర్యచకితులను చేయగలవు. నన్ను ఒక ప్రత్యేకస్థానాన కూర్చోబెట్టగలవు. అంతటి విశేష విషయపరిజ్ఞానం గలవాడిని, సమర్థుడిని!

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు... నేను ఎలిమెంటరీ స్కూల్లో ఉన్నప్పుడే, ఆవుమీద రాసిన వ్యాసాన్ని నోటీసుబోర్డులో సైతం పెట్టారు. ఏ ఒక్క వాక్యానికి, మరో వాక్యంతో పొంతన లేకుండా, ఏ వాక్యము తన స్వతంత్రతను కోల్పోకుండా, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా రాసినది, రాయకుండా... రాసాను. ఆ వ్యాసాన్ని మా నాన్నగారిని ప్రత్యేకంగా పిలిపించి, చూపించి 'మీవాడు ఇది దేనిగురించి రాసాడో, మీరేమైనా గుర్తు పట్టగలరా?' అని మాస్టారు అడిగిన విషయం నాకు ఇప్పటికీ గుర్తే! బహుశా నా స్థాయి అప్పటికే ఐదోతరగతి పిల్లల స్థాయిని మించిపోయిందన్న వాస్తవం, మా మాస్టారు గుర్తించి ఉండకపోవచ్చు!

ఒక్క వ్యాసాలేనా! వ్యాఖ్యలు వ్రాయడం కూడా నాకు వెన్నతో పెట్టిన విద్య. ఆ రోజుల్లో చందమామలో జంటఫోటోలు పక్కపక్కనే వేసి వాటికి సరిపడే వ్యాఖ్య వ్రాయమని పోటీ ఉండేది. పది రూపాయలు బహుమానం కూడా ఇచ్చేవారు! చందమామ ఇంటికి వస్తూనే పోస్టాఫీసు వెళ్ళి, డజన్ కార్డులు కొనుక్కొచ్చేసి, జంట ఫొటోలకి వ్యాఖ్యలు రాసేవాడిని. ఉదాహరణకి ఒక ఫొటోలో పువ్వులు ఉండేవి. ఆ పక్క ఫొటోలో కాయలు ఉండేవి. దానికి నేను 'ఇక్కడ ఇవి ఉన్నవి, అక్కడ అవి ఉన్నవి' అని రాసాను. అదే వ్యాఖ్య నేను వరుసగా ఐదారు నెలలు పంపించాను. ఎందుకంటే... ఎటువంటి ఫొటోలకైనా ఆ వ్యాఖ్యలు అతికినట్లు సరిపోతాయి. అయితే నాకు ఇప్పటివరకూ అర్థంకాని విషయం ఏమిటంటే... ఎంతగా నేను పుంఖానుపుంఖాలుగా సంక్షిప్త వ్యాఖ్యలతో విజృంభించినా, ఒక్కసారి కూడా ఆ పదిరూపాయల బహుమానం రాలేదు అదేమిటో! నా వంటి మేధావి వ్రాసిన కార్డు, వాళ్ళకి అంది ఉండదు. అంతే అయి ఉంటుంది.

ఇది నాకు సరిపడే విషయం కాదని వ్యాసాలు రాయటం మొదలు పెట్టాను, ఎలాగైనా ప్రింట్ అయిపోతాయి అన్న ప్రగాఢనమ్మకంతో! అయితే ఈ దినపత్రికల కార్యాలయాలు నావంటి మేధావి వ్యాసాల ముద్రణకు నోచుకోలేదు. ఆ విధంగా తెలుగుపాఠకులు నా వ్యాసపరంపరను చదివి ఆస్వాదించే అద్భుతమైన అవకాశాన్నీ కోల్పోయారు.



చిన్ననాటినుంచి నాలో అంకురించిన అభ్యుదయభావాలకు నేనిచ్చే అక్షరరూపాన్ని అభినందించి ప్రోత్సహించాల్సింది పోయి, ఎందుకు ఈ పత్రికలవాళ్లు నాలోని రచనావేశాన్ని నిలువరిస్తున్నారు. ఇది తగునా? లేదు, ఏదో ఒకటి చేసేయాలి! ఏదో చేయాలి... ఏం చేయాలి? అరె, అద్భుతమైన ఐడియా వచ్చేసింది. ఏం చేయాలి, ఏం చేయాలి అని అనుకున్న వెంటనే... కవితలు రాయాలి... అవును... ఇంత కాలం ఈ విషయం నాకు స్ఫురించనందుకు, నాకు నేనే సిగ్గుపడ్డాను. కవితలు రాస్తే... కవిగా నేను సమాజంలోకి గుర్తింపు తెచ్చుకోవచ్చు. తలెత్తి పైకి చూశాను. ఆకాశంలో జెండా ఎగురుతోంది. నాలో కవితావేశం రెపరెపలాడింది.

జెండా...

అదిగో జెండా...

ఇదిగో జెండా...

అక్కడ జెండా...

ఇక్కడ జెండా...

జెండా పక్కన జెండా...

జెండా ముందు జెండా...

జెండా మనకు అండ..

జెండాకు వేద్దాం దండ...

ఎండలో జెండా...

ఎగిరే జెండా...

జెండా ఎగరాలి అందంగా...

ఎండలో... నీరెండలో...

వానలో... కోనలో...

ఎందుకు ఎగరాలి...

ఎగరాలి కనక ఎగరాలి...

ఎగిరి ఎగిరి ఎగురుతూనే ఉండాలి...

చిరిగేవరకు ఎగరాలి...

జెండా మన జెండా...

ఎందుకైనా మంచిదని ఈ కవితని ఒకసారి మా అమ్మకు చూపించాను. ఆవిడ చదివి ఒక్కసారిగా నాకేసి చూసింది. ఆ చూపుకి అర్థం తెలియలేదు. ఎటువంటి భావం కనబడలేదు. బహుశా నన్ను మెచ్చుకొని ఆనందబాష్పాలు కురియబోతున్నాయేమో అనుకునే తరుణంలో, "అందుకే రోజూ పొద్దున్నే ఉసిరికాయ పచ్చడితో అన్నం తినమన్నా. బాగా పైత్యం చేసిందిరా... ఎందుకైనా మంచిది నాన్నగారికి చెబుతాను... డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లమని" అని అన్నది.

విధి ఎంత బలీయమైనది! ఇటువంటి కవికి తల్లి అయినందుకు గర్వించకపోగా, అమ్మ ఇలా అంటుందా? అప్పుడే నేను నా మనసులో మరోనిర్ణయం తీసుకున్నాను. ఏ తల్లి నాలోని తపనని తాపత్రయాన్ని కాంక్షని, ఆకాంక్షనీ అర్థం చేసుకోలేదో... ఆ తల్లి తాను నా తల్లి అని చెప్పుకునేలా చేస్తాను. ఇదే నా శపథం! అప్పటికి గాయపడిన నా కవిహృదయం తాత్కాలికంగా ఉపశమనం పొందింది.

"ఎలా సాగుతోందిరా చదువు?" నాన్నగారు అడిగారు.

"బాగానే చదువుకుంటున్నాను నాన్నగారూ!" అన్నాను వినయంగా.

"ఆ... చూస్తూనే ఉన్నాను. ఈమధ్య నీ బుద్ధి పెడత్రోవలు పడుతోంది. కొంచెం ఒళ్ళు దగ్గర పెట్టుకో... మంచిమార్కులతో పాస్ కాకపోతే, అడుక్కుతినేందుకు కూడా పనికిరాకుండా పోతావు." అంటూ ఆశీర్వదించారు. ఏమిటి నాకు శిక్ష?

ఆఖరికి కన్నతల్లి, తండ్రి కూడా నాలోని కవిని గుర్తించలేరా? ఎలా... ఎలా... ఇంక ఎవ్వరికి పంపించను? ఎవరికి నా కవితలు చూపించను?

నా హృదయాన్ని ఆవిష్కరిస్తూ, నా భావాలను నా నోటుపుస్తకాలలోనే నిక్షిప్తం చేస్తూ, నాతోనే ఉంచుకుంటాను... నాతోనే పెంచుకుంటాను... అప్పటినుంచి నిశ్శబ్దాన్ని ప్రేమిస్తూ, నాలో నేనే తపిస్తూ, కవితలు మాత్రం రాస్తూ ఉండిపోయాను కొన్నాళ్ళవరకు!

ఓరోజు మళ్ళీ నాన్నగారి ముందు దోషిలా నిలబడాల్సి వచ్చింది. ఆయన చేతిలో నేను ఎంతో తపనతో రాసిన కవితలు ఉన్న నా నోటుపుస్తకం! నాన్నగారి పక్కనే నా ప్రథమశత్రువు... మా చెల్లెలు నాకేసి విజయగర్వంతో చూస్తూ! శత్రువులు ఎక్కడో శత్రుదేశాల్లో ఉండరు. మన ఇంట్లోనే ఉంటారు, చెల్లెలిరూపంలో! నేను చదువుకోకుండా నోట్ పుస్తకాలని ఖరాబు చేస్తున్నానని నాన్నగారికి ఫిర్యాదు చేసిందన్నమాట. దాంతో నాపై నిఘా పెరిగింది. నిత్యం నాన్నగారు, నా కదలికలని గమనిస్తూనే ఉన్నారు. విసిగి వేసారిపోయాను. నాకు ఇటువంటి గుర్తింపు తెచ్చిన కవిత్వాన్ని, నేను గుర్తించడం మానేసాను.

కాలేజీలో చేరాను. అంతా కొత్తగా ఉంది. కొత్తకొత్త పరిచయాలు. అప్పుడు చూసాను ఆమెను. ఆమెది అందమా? అందరిలాటి అందమా? అందానికి అందం ఆమె! నాలో ఏదో తెలియజెప్పలేని భావన... కళ్ళు మూసినా, తెరిచినా నా కళ్ళ ఎదుట ఆమె! ఏ క్షణంలో ఆమెతో చూపులు కలిపానో, నాలో కోరికలు గుర్రాలయ్యాయి. ఊహలకు రెక్కలు వచ్చాయి. ఇప్పుడు కదా నా రచనాపటిమకు సార్థకత! నా భావాలను అందంగా అక్షరీకరించి, ఆమెకు ఒక ప్రేమలేఖ రాస్తే! నా ఆశలన్నీ ఆ లేఖలో దాస్తే! అవును నాకే ప్రత్యేకమైన ఏ రచనాపాండిత్యం అయితే నన్ను నిరాదరణకు గురి చేసిందో, పరిహసింపజేసిందో, ఆ పాండిత్యం నా జీవితదారి దీపాలు కావాలి!

అంతే... విజృంభించేశాను. సవివరంగా రసరమ్యంగా నా మనసును అద్దంలో చూపేలా వ్రాసి, క్లాస్ రూమ్‌లో ఆమె పుస్తకంలో పెట్టేసి, హృదయాన్ని అర్పించేసాను. నిరీక్షణ... భరించలేని నిరీక్షణ! మా లెక్చరర్ తన రూమ్‌లోకి పిలిచాడు. నేను వెళ్ళేసరికి ఆమె కూడా అక్కడ ఉంది. లెక్చరర్ టేబుల్ మీద ఒక కాగితం ఉంది. ఆయన అడిగాడు 'ఈ కాగితం రాసింది నువ్వేనా?' అని.

కొంటెగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ, చొక్కా గుండీ సవరించుకుంటూ చిరునవ్వుతో, ఆయనకి 'అవును' అని చెప్పాను.

ఆయన అడిగారు 'ఇది ఏ భాష? ఈ అక్షరాలను ఎలా చదవాలి?' అని.

డామిట్! కథ అడ్డం తిరిగింది.

అబ్రహం లింకన్ ఎన్నిసార్లు ఎన్నికల్లో ఓటమి చవిచూసి విజయాన్ని చేజెక్కించుకున్నాడు? విక్రమార్కుడు ఎన్ని వందల భేతాళకథలు ఓపిగ్గా విని, అర్ధరాత్రి స్మశానంలో నడుస్తూనే ఉండేవాడు! చరిత్రలో నిలిచిపోవాలంటే, అపజయాలనే... విజయానికి మెట్లుగా చేసుకోవాలి. అంతే... 'న భూతో న భవిష్యతి' అనేలా ఒక అద్భుతమైన అసాధారణమైన ఎన్నడూ ఎవ్వరూ కనీవినీ ఎరుగని రీతిలో, కథ రాసేసి అచ్చులో చూసుకుని అందరి ప్రశంసలు పొంది, గర్వంగా నన్ను చూసి పరిహసించిన సమాజానికి నేనెవరో ఋజువు చేసుకోవాలి. అదే పట్టుదల. అదే కసి! కాగితాలు నిండిపోతున్నాయి... పెరిగిపోతున్నాయి, చిరిగిపోతున్నాయి.

కథ... కథ... నా ఆలోచనలన్నీ కథ చుట్టే!

సాధారణ పల్లెటూరిలో పుట్టిన ఒక కుర్రవాడు, అనేకానేక అనుభవాలతో రాటుదేలి, పెద్దవాడై సమాజాన్ని శాసించే దశకు చేరుకుంటాడు. అబ్బే ఇలాంటి కథలు ఇప్పటికీ వేలల్లో ఉన్నాయి.

అతడు వీధిబడికి వెళ్ళే రోజులనుంచి తను ప్రేమిస్తున్న చిన్ననాటి స్నేహితురాలితో పెళ్ళిచేసుకునేందుకు సిద్ధపడితే, పెద్దలు క్రూరంగా విడదీసి, ఆమెకు వేరేవ్యక్తితో వివాహం చేస్తారు. ఆ వేదన భరించలేక అతను తాగుబోతై, ఆమెనే ధ్యానిస్తూ, శ్వాసిస్తూ, ఆమె లేని జీవితాన్ని భరించలేక ఆఖరిశ్వాస విడిచేస్తాడు తాగి తాగి. ఇంత మంచికథ నాకు తడితే, ఇలాంటిదే గతంలో ఓ హిట్ సినిమా వచ్చి దశాబ్దాలుగా ప్రేక్షకుల మన్ననలు పొందుతూనే ఉంది కదా. ఇప్పుడు ఎలా?

క్రైమ్... సస్పెన్స్... థ్రిల్లర్... ఈ సబ్జెక్టు తీసుకుంటే?

కథ రాయాలని సిద్ధపడితే ఎన్ని ఆలోచనలు వస్తున్నాయి. ఎన్ని లైన్లు. ఎన్ని థీమ్‌లు! ఇక ఆలస్యం చేయకూడదు. ఆధునిక సాంకేతికతతో... అందుబాటులోకి వచ్చిన అంతర్జాల సౌకర్యంతో కథ ముగించి, కొత్త రచనలను ప్రోత్సహించే క్రొంగొత్త పత్రికకు ఓ శుభ ముహూర్తాన మెయిల్ చేశాను. నవ్విన నాపచేలు పండవా? నలుగురు మెచ్చు రోజు ఉండదా? ఉంటుందని ఋజువయింది. నా కథను ఆ పత్రిక ఆమోదించడమే, కాక తెలుగు రచనారంగంలో కొత్తకెరటం... నేటి యువతకు మార్గదర్శి...అంటూ ప్రశంసిస్తూ, ఓ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఇంతకాలానికి శుభోదయం... ఓ నవోదయానికి శ్రీకారం చుట్టిన ఒకే ఒక రచయిత అంటూ, వేదిక మీద వ్యాఖ్యాత ప్రేక్షకులను చూస్తూ అంటే... ఆ రచయిత ఎవరు? ఎవరు?? అంటూ కొద్దిసేపు ఆగారు ఆడియన్స్‌లోని ఎవరినో ఉద్దేశించి అన్నట్టుగా. చాలాసేపు సభలో నెలకొన్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఒక ఉత్సాహభరితమైన కేక ప్రతిధ్వనించింది. 'ఆ రచయితను నేనే' అంటూ నేను లేచి నిలబడ్డాను. మళ్ళీమళ్ళీ ఆ 'రచయితను నేనే నేనే' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచాను."

"అబ్బబ్బ! ఏవండి... లేవండి... ఏమిటి పలవరింతలు... అరుపులు... కేకలు... మీరు నిద్రపోరు, నన్ను నిద్రపోనివ్వరు. ఆ కథల జోలికి పోకండి. కథ... కథా... అంటూ కలవరిస్తారు, కలకంటారు. మళ్ళీ మీకు సాటిలేని నేటి మేటిరచయిత అని సన్మానం చేసినట్టుగా కలవచ్చిందా ఏమిటి?" అంటూ శ్రీమతి విసుక్కుంది. కలా! నేను మేల్కొన్నాను.

దీర్ఘంగా ఆలోచించాను. ఇంతకాలం రచయితగా సాహితీప్రియునిగా కలం పట్టుకుని రచనల ద్వారా  నవ సమాజానికి కొత్త బాటలు వేద్దాం అనుకున్నాను. చుట్టూ అలుముకున్న గాఢాంధకారాన్ని చెదరగొట్టే కాంతిరేఖలు నా రచనల్లో ప్రసరింప జేయాలనుకున్నాను.కానీ ఇలలో కలలో కూడా సాధ్యం కావడం లేదు. అయితేనేమి.. నిరుత్సాహ పడకూడదు. సంకల్పం సదాశయం ఎప్పుడు వెనుకంజ వేయకూడదు. అవకాశంకోసం వెతుకులాటలో నేను ఎన్నుకున్న దారి మూసి ఉంటే మరోదారి కోసం అన్వేషణ కొనసాగించాలి. నేను నేటి మేటి రచయిత గా కాకుండా ఉత్తమ పాఠకునిగా నా అభిరుచిని పదిమందికి తెలియజేస్తాను. అభ్యుదయ భావాల రచయితల రచనలన్నీ చదివి, ఆకళించుకుని, వారిని అభినందిస్తూ, నాస్పందనద్వారా ప్రోత్సహిస్తూ, సాహితీలోకంలో నాస్థానాన్ని ఒక మంచి పాఠకునిగా స్థిరపరచుకుంటాను. రచయితకు కావలసినది అభిరుచి గల పాఠకుడు కదా! కాదా!

# కనువిప్పు

ఎస్. ఆర్. ఎస్. ఎస్. చలపతి రావు
✆ 9440139149

*మనకు ఈ కాంక్రీట్ గోడల మధ్య ఊపిరి ఆడటం లేదు. మన పాత ఇల్లు, ఆ స్వేచ్ఛే మనకు వెయ్యి రెట్లు మిన్న. రేపు మంచంపడితే ఎవరు చూస్తారనే భయంతో, ఈరోజే చస్తూ బతకడం నాకు ఇష్టం లేదు. దిక్కులేని వారికి దేముడే దిక్కు! మనకి కృత్రిమంగా ఉండే బంధం అక్కరలేదు. రక్తసంబంధంతో వ్యాపారం నాకు నచ్చదు. నాకు మనశ్శాంతి ఉంటే చాలు!"*

సమయం ఉదయం ఎనిమిది గంటలు!

సోఫాలో కూర్చుని లాప్టాప్‌లో పని చేసుకుంటూ "అమ్మా ఇంకా ఎంతసేపు?" అని గట్టిగా పిలుస్తున్న రమేష్‌కు, "ఇదిగోరా వస్తున్నా" అంటూ, వేడికాఫీ తెచ్చి కొడుక్కి అందించింది అనసూయమ్మ. పక్కన సోఫాలో కూర్చుని, సెల్‌ఫోన్‌లో ఏదో చూస్తూ నవ్వుకుంటోంది కోడలు సునీత.

కొడుక్కి కాఫీ ఇచ్చి, తిరిగి వంటింట్లోకి వంట చెయ్యడానికి వెనక్కి తిరుగుతున్న ఆవిడతో, "నేను ఆఫీస్ క్యాంటీన్‌లో భోజనం చేస్తాను, నీ కోడలు ఇవాళ ఇంట్లో ఉండి పనిచేస్తుంది. ఏమి తింటుందో అడిగి వంటచేయి..." అని పురమాయించి, తన పనిలో మునిగిపోయాడు.


సునీత ఇవేమీ పట్టించుకోకుండా ఫోన్లోకి చూడటంలో మునిగిపోయి వుంది. అనసూయమ్మ కోడలివైపు చూస్తూ నిలబడింది. ఒక అయిదు నిమిషాలు గడిచాక, తన పనిలోనించి తలెత్తి చూసిన రమేష్, ఇంకా నిలబడి ఉన్న అనసూయమ్మ వైపు చూసి, "సునీతా! అమ్మకి ఏదో ఒకటి చెప్పచ్చు కదా, పని చేసుకుపోతోంది" అని రెండుసార్లు పిలిచాక, మొబైల్ లోంచి తలపైకి ఎత్తి చూసి "కూరలు ఏమున్నాయో చూసి ఏదో ఒకటి చేయమనండి, నాకు మాత్రం సాంబారు, అప్పడాలు కావాలి" అని చెప్పి, మళ్ళీ మొబైల్ లోకి చూడడం మొదలు పెట్టింది.

"విన్నావుగా అమ్మా!" అని, రమేష్ మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు.

అనసూయమ్మగారు నెమ్మదిగా వంటింటి వైపు అడుగులు వేసింది.

రాఘవరావుగారు ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. జీవితంలో ఎన్నో అనుభవాలతో తలపండిన మనిషి. తను ఉద్యోగంలో ఉండగా... సహోద్యోగులతో పాటు ఒక కాలనీలో చిన్న ఇల్లు కట్టుకుని విశ్రాంత జీవితం

గడుపుతున్నారు. అరవై ఐదు ఏళ్ళ వయసులోనూ ఆయన నడకలో ఆ ఠీవి, మాటలో ఆ గంభీర్యం తగ్గలేదు. ఆయన భార్య అనసూయమ్మ. ఆ ఇద్దరిదీ ఒక చిన్న ప్రపంచం. దగ్గర్లోని గుడికి వెళ్ళడం, మిత్రులతో కాసేపు ముచ్చటించడం! దూరంగా ఉన్న బంధువులతో, మిత్రులతో అప్పుడప్పుడు ఫోన్లో కుశలప్రశ్నలు... ఇలా వారి జీవితం ఎంతో హాయిగా, ప్రశాంతంగా సాగిపోయేది.




వారి కొడుకు రమేష్. సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కోడలు సునీత కూడా ఒక కంపెనీలో హెచ్.ఆర్ మేనేజర్. వారికి ఇద్దరు పిల్లలు. పండగలకు, పబ్బాలకు కొడుకు ఫోన్ చేయడం తప్పితే, రాఘవరావుగారికి సిటీ జీవితంతో సంబంధాలు పెద్దగా ఉండేవి కాదు.

ఒకరోజు రమేష్ నుండి ఫోన్ వచ్చింది. “నాన్నా! ఇక్కడ పిల్లలని చూసుకోవడం చాలా కష్టమైపోతుంది. డేకేర్ సెంటర్లలో వేస్తే వాళ్ళు సరిగ్గా పట్టించుకోవడం లేదు. నాకూ ఆఫీస్ పనుల మీద చాలా ఊళ్ళకి వెళ్లాల్సి ఉంది. సునీత ఒక్కతే ఉండాల్సి వస్తుంది. మీరు, అమ్మ ఇక్కడికి వస్తే మాకు తోడుగా ఉంటుంది!” అని ప్రాధేయపడ్డాడు.

అనసూయమ్మ... కొడుకు, మనవళ్ళ మీద బెంగతో, "వెళ్దామండీ... మన పిల్లలే కదా" అని భర్తను ఒప్పించింది. పల్లెటూరి వాతావరణం నుంచి వచ్చిన అనసూయమ్మకి కొంత మమకారాలు ఎక్కువ! అందులోనూ కొడుకంటే పిచ్చిప్రేమ! రాఘవరావుగారికి మనసులో ఏదోమూల సందేహం ఉన్నా, భార్యమాట కాదనలేక, ఉన్న ఇంటికి తాళం వేసి సిటీకి వెళ్ళడానికి సిద్ధమయ్యారు.

హైదరాబాద్‌లో కొడుకు నివసిస్తున్న ఆ పెద్ద అపార్ట్‌మెంట్‌లో అడుగుపెట్టిన వారికి, కొత్తలో అంతా బాగానే అనిపించింది. మనవళ్ళు 'తాతా, బామ్మా' అంటూ చుట్టూ తిరుగుతుంటే అనసూయమ్మ మురిసిపోయింది. మనవలకి వేళకి కంచంలో అన్నం కలిపి పెట్టడం, ఖాళీ సమయాల్లో... వాళ్ళకి చిన్నచిన్న కథలు చెప్పడం, పద్యాలు నేర్పడంలాంటివి చేస్తూ ఆనందించేది. రాఘవరావుగారు కుదిరినప్పుడల్లా వాళ్ళని బయటకు తీసుకువెళ్ళేవారు. కానీ ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు.

రమేష్, సునీత పొద్దున్నే ఆఫీసులకు వెళ్ళిపోతే, తిరిగి వచ్చేవరకు పిల్లల బాధ్యత, వంట పని, ఇంటిపని అంతా అనసూయమ్మ మీదే పడేది. పనిమనిషిని పెట్టుకుందాం అంటే సునీత, "అత్తయ్యగారు ఉన్నారు, నేనున్నాను, ఇంకెందుకు పనిమనిషి? అయినా బయటివాళ్ళు చేసేపని శుభ్రంగా ఉండదు" అని, తెలివిగా తప్పించేసింది. కానీ సునీత ఇంటిపనిలో కలగచేసుకునే సందర్భాలు చాలా అరుదుగా ఉండేవి. తనకి ఉద్యోగంతో తీరిక లేకుండా ఉందని, కొంచం సద్దుకోమని రమేష్ తల్లికి చెప్పాడు. అరవై ఏళ్ళు దాటిన వయసులో అనసూయమ్మకు ఆ చాకిరీ భారంగా మారినా, కొడుకు కోసం మౌనంగా భరించేది.

సునీత ప్రవర్తన రోజురోజుకీ మితిమీరిపోసాగింది. ఆమెకు తన ఉద్యోగం, తనహోదా వల్ల వచ్చిన అహంకారం ఎక్కువ. ఇంటికి రాగానే అత్తగారిని పలకరించడం మానేసి, "వంట ఇంకా కానట్లుందే? పిల్లలు స్నానాలు చేయలేదా?" అని లోపాయకారీగా ప్రశ్నిస్తూ ఉండేది. ఏ పనుల్లోనూ కలగచేసుకోకుండా, తన గదిలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకునేది. తన పుట్టింటి పెత్తనం కూడా ఆ ఇంట్లో ఎక్కువగా ఉండేది. సునీత గంటల తరబడి వాళ్ళ అమ్మతో ఫోన్లో మాట్లాడుతూ, "అవును మమ్మీ... వీళ్ళకి ఎంత చేసినా అంతే, నా ఖర్మ," అంటూ అత్తమామలకు వినిపించేలా గట్టిగా మాట్లాడేది.

రాఘవరావుగారి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఇప్పుడు కోడలు ఎప్పుడు కొడుకుతో ఏమంటుందో అని భయపడే పరిస్థితి వచ్చింది.

ఒకసారి రాఘవరావుగారు బ్యాంకుకు రెండ్రోజులు సెలవు రావడంతో, ఏటీయమ్‌లు కూడా పని చేయకపోవడంతో... తన మందుల కోసం రమేష్‌ను డబ్బులు అడిగారు. రమేష్ చిరాకుగా, "నాన్నా! మీకు వచ్చే పెన్షన్ డబ్బులు ఏం చేస్తున్నారు? దాచుకుని ఏం చేస్తారు? మీ మందులకైనా వాడుకోవచ్చు కదా..." అన్నాడు.

రాఘవరావు గారి గుండె కలుక్కుమంది. ఆయన పెన్షన్ డబ్బులు చాలా తక్కువ! అవి కొడుకు, కోడలు ఉద్యోగానికి వెళ్ళినపుడు ఇంట్లోకి అవసరాలకు, తనకు, భార్యకు కావలసిన నిత్యావసరాలు కొనడానికే సరిపోయేవి. "సరే లేరా" అని సర్దుకుపోయారు.

కానీ రమేష్ ప్రవర్తనలో మార్పు స్పష్టంగా కనిపించేది. భార్యముందు గొప్పలు పోవడానికి తల్లిని, తండ్రిని చులకన చేయడం అతనికి అలవాటైపోయింది.

అనసూయమ్మ ఆ రాత్రి భర్తతో, ''ఏమండీ, బాధపడకండి. వాళ్ళ ఈడు అలాంటిది. మనమే సర్దుకుపోవాలి. రేపు మనకు మంచం పడితే దిక్కు వాళ్ళే కదా'' అని సర్దిచెప్పింది.

"అనసూయా! మనం ఇక్కడ మనుషులుగా బతకట్లేదు. కేవలం అవసరానికి వాడుకునే యంత్రాలుగా మారాం. మనవళ్ళు పెద్దవాళ్ళయ్యారు. ఇప్పుడు మన అవసరం కూడా వాళ్ళకి తగ్గిపోయింది. అందుకే ఈ చిన్నచూపు'' అని ఆవేదన వ్యక్తం చేశారు రాఘవరావు.

ఆ రోజు ఉదయం... రాఘవరావు గారు పేపర్ చదువుతుంటే అక్షరాలు సరిగ్గా కనిపించలేదు. కళ్ళజోడు పాతబడిపోయింది, గీతలు పడ్డాయి. రమేష్ ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అవుతున్నాడు. సునీత సోఫాలో కూర్చుని ఫోన్ చూసుకుంటోంది. రాఘవరావుగారు నెమ్మదిగా కొడుకు దగ్గరకు వెళ్లారు. "రమేష్, కళ్ళజోడు బాగా పాతబడి పోయిందిరా! పేపర్ చదవడానికి ఇబ్బందిగా ఉంది. నాకు ఈ వూరు కొత్త, ఈరోజు సాయంత్రం డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తే కొత్తది తీసుకుంటాను'' అని అడిగారు.

రమేష్ తల దువ్వుకుంటూ, "అబ్బా నాన్నా! ఇప్పుడు టైము లేదు. అయినా ఇంట్లో ఖాళీగా కూర్చునే మీకు పేపర్ చదవకపోతే ఏమవుతుంది? ఉన్నదానితో అడ్జస్ట్ అవ్వండి!'' అని నిర్లక్ష్యంగా అన్నాడు.

అక్కడ ఉన్న సునీత కల్పించుకుని "అవునండి, ఏ ఊబర్ ఆటోలోనో వెళ్ళచ్చు కదా. మరీ అంత డబ్బుల కోసం చూసుకుంటే ఎలా? మీ పెన్షన్ డబ్బులు ఉన్నాయిగా, అవి తీసి వెళ్ళండి. ప్రతీదానికి రమేష్ మీద ఆధారపడడం ఎందుకు? మాకు నెలకు కార్ పెట్రోల్ ఖర్చు ఎంత అవుతుందో తెలుసా?'' అని ఈసడించుకుంది.

రాఘవరావుగారు ఒక్క క్షణం స్తంభించిపోయారు. ఆయన తన జీవితకాలం కొడుకు భవిష్యత్తు కోసం ఖర్చు చేశాడు. కొడుక్కి పెద్దగా ఆస్తి ఇవ్వక పోయినా, అప్పు ఇవ్వకూడదని.. తన తోటి ఉద్యోగులందరూ పిల్లల చదువుకోసం బ్యాంకులో అప్పు తీసుకుంటుంటే, తను కొడుక్కి భారం కాకూడదని అప్పు చేయకుండా, తన సొంతఖర్చులు చాలా మానుకుని, వాడిని చదివించాడు. అలాంటిది తనకి తెలియని ఊరిలో, అవసరమై డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళమని అడిగితే.. కార్ పెట్రోల్ ఖర్చులు లెక్కలేస్తున్నాడు! కొడుకు, కోడలు సంవత్సర ఆదాయంలో, కనీసం పదిశాతం కంటే తక్కువ ఉండే తన పెన్షన్ డబ్బులు ఖర్చు పెట్టడానికి వెనకాడుతున్నానని ఆమె అలా మాట్లాడటం ఆయన సహనాన్ని పరీక్షించింది. అంతలో రమేష్, "విన్నారుగా నాన్నా! సునీత చెప్పింది నిజమే కదా. అనవసరమైన ఖర్చులు తగ్గించుకోండి,'' అంటూ నవ్వుతూ జోక్ చేశాడు.

అంతే... రాఘవరావుగారిలో ఇన్నాళ్లుగా అణిచిపెట్టుకున్న ఆవేదన, ఆక్రోశం ఒక్కసారిగా కట్టలు తెంచుకున్నాయి. అది కోపం కాదు, ఆత్మాభిమానం రగిల్చిన మంట. ఆయన సింహంలాంటి గాంభీర్యంతో కొడుకు ముందుకు నడిచారు.

"ఫటక్!''

ఇల్లంతా దద్దరిల్లేలా రమేష్ చెంప మీద రాఘవరావుగారి చేయి పడింది. ఆ దెబ్బకి రమేష్ చేతిలోని బ్రీఫ్‌కేస్ కింద పడింది. సునీత నోటమాట రాక షాక్‌తో లేచి నిలబడింది. హాల్లో నిశ్శబ్దం రాజ్యమేలింది.

రాఘవరావుగారు కొడుకు కళ్ళలోకి సూటిగా చూస్తూ గర్జించారు. "ఒరేయ్! నేను ఇక్కడికి వచ్చింది అడుక్కోడానికి కాదురా. నా కొడుకు మీద ప్రేమతో, నా మనవళ్ళ మీద మమకారంతో వచ్చాను. నేను రిటైర్ అయ్యింది ఉద్యోగం నుండి మాత్రమే, నా బాధ్యతలనుండి కాదు, నా ఆత్మగౌరవం నుండి అంతకన్నా కాదు!"

ఆయనే సునీత వైపు తిరిగి, "అమ్మా సునీతా! నేను బ్యాంక్ సెలవుల సమయంలో తెచ్చుకోవడానికి కుదరక అవసరమై అడిగిన డబ్బు మీకు భారంగా అనిపించిందా? నువ్వు, నీ భర్త ఈ హోదాలు అనుభవించడానికి నేను కరిగించిన నా జీవితం, మీకు ఎప్పుడూ లెక్కలోకి రాలేదా? ముసలివాళ్ళం కదా అని మౌనంగా ఉంటే, మమ్మల్ని పనిమనుషుల కంటే హీనంగా చూస్తారా?"

రమేష్ చెంప పట్టుకుని, "నాన్నా... నేను..." అని నీళ్ళు నమలసాగాడు.

"మాట్లాడకు రమేష్!" రాఘవరావుగారు వారించారు. "నీ భార్య అహంకారం, నీ పిసినారితనం, మీ ఇద్దరి స్వార్థం... ఇవన్నీ చూస్తూ కూడా ఇన్నాళ్ళూ భరించాను. ఎందుకో తెలుసా? రేపు మేము మంచం పడితే మీరు చూస్తారని కాదు. నా కొడుకు ఎప్పటికైనా మారతాడని. కానీ ఈరోజు అర్థమైంది... మీరు మారరని! అంటూ ఆయన లోపలికి వెళ్ళి, వణుకుతున్న అనసూయమ్మ చేయి పట్టుకుని బయటకు తీసుకొచ్చారు.

"పద అనసూయా! మనకు ఈ కాంక్రీట్ గోడల మధ్య ఊపిరి ఆడటం లేదు. మన పాత ఇల్లు, ఆ స్వేచ్ఛే మనకు వెయ్యిరెట్లు మిన్న. రేపు మంచం పడితే ఎవరు చూస్తారనే భయంతో, ఈరోజే ఛస్తూ బతకడం నాకు ఇష్టం లేదు. దిక్కులేనివారికి దేముడే దిక్కు! మనకి కృత్రిమంగా ఉండే బంధం అక్కరలేదు. రక్తసంబంధంతో వ్యాపారం నాకు నచ్చదు. నాకు మనశ్శాంతి ఉంటే చాలు!" అని దృఢంగా చెప్పారు.

"అయ్యో నాన్నా... వెళ్ళకండి, తప్పయిపోయింది," అని రమేష్ అడ్డు రాబోయాడు.

కానీ రాఘవరావు గారు అతన్ని పక్కకు నెట్టి, తలెత్తుకుని గుమ్మం దాటారు. అనసూయమ్మ కళ్ళలో నీళ్ళు ఉన్నా, భర్త నిర్ణయంలోని ధర్మాన్ని గ్రహించి ఆయన వెంటే నడిచింది.

వాళ్ళు వెళ్ళిపోతుంటే... రమేష్, సునీత బాల్కనీలో నిలబడి చూస్తూ ఉండిపోయారు.

ఆ వృద్ధదంపతులు వెళ్ళిపోయాక, ఆ ఇల్లు ఎంత వెలితిగా మారిపోయిందో, తమ పిల్లలకు తాతాబామ్మల ప్రేమను దూరం చేసి ఎంత పెద్ద తప్పు చేసారో... వారికి అర్థం అవడానికి మరో ముప్పై ఏళ్ళు పట్టింది!

అప్పటికి వాళ్ళు తాతా బామ్మలు అయ్యారు!

★★★

విసిరిన రాయి, పోయిన పరువు, గాయపడిన మనసు తిరిగి రావు కదా!

# వరం - వంకాయల ప్రహసనం

సరస్వతి కరవది
✆ 9849530000

***ఎక్కడో, ఎవడో అవినీతికి పాల్పడ్డాడని మొత్తం ఉద్యోగులందరినీ బదిలీలు చేసి పడేసారు. ఆ బదిలీలలో బెంగళూరు శివార్లలోని ఒక శాఖకు వెళ్లాల్సి వచ్చింది వరానికి. ఇల్లు సర్దుకోవటం పూర్తిగా అవకుండానే, మళ్ళీ బదిలీ అయినందుకు విసుక్కుంటున్న భార్యను వెంటబెట్టుకుని, వేలాడే మొహంతో బెంగళూరు చేరాడు వరం. వేలాడే మొహం ఎందుకంటే బెంగళూరులో మంచి వంకాయలు దొరుకుతాయో, లేవో అని బెంగ!***

"సుందరం... మనం సరైన వంకాయకూర తిని ఎన్నాళ్ళయ్యిందో కదా!" మార్కెట్ నుంచి తెచ్చిన కూరగాయల సంచిని వంటింట్లో నేలమీద బోర్లిస్తూ అన్నాడు 'వరం' అని సుందరలక్ష్మి చేత ముద్దుగా పిలువబడే ఆవిడ భర్త వరప్రసాద్. ఔను మరీ, ఆయన భగవంతుడు సుందరలక్ష్మికిచ్చిన వరం... ఒక్క వంకాయల విషయంలో తప్ప!

"నిజమే సుమండీ!" అంటూ, ఆ కూరలవైపు చూసింది సుందరం. లేతబెండకాయలు, గట్టిదొండకాయలు, పచ్చిమావిడికాయలు, దోసకాయలు, సొరకాయ, ఆకుకూరలు, మునక్కాడలు అన్నీ నవనవలాడుతూ దర్శనమిచ్చాయి, ఒక్క వంకాయలు తప్ప! అవిమటుకు పోషణలేని ఆడపిల్లల్లా బక్కగా, పొడుగ్గా, ఎండిపోయి గోధుమరంగులోకి మారిపోయిన ముచ్చికలతో చూట్టానికే జాలిగొలిపేలా ఉన్నాయి.

"అయ్యో రామా... ఈ ముదనష్టపు వంకాయలెందుకు తెచ్చారు వరం?" ఆక్రోశించింది సుందరం.

"చచ్చినవాడి పెళ్ళికి వచ్చిందే కట్నమని... ఈ ఊళ్ళో వంకాయలు దొరకటమే అరుదు. వచ్చి ఆరునెలలైంది. ఇన్నాళ్ళకి దొరికితే వదలటమా! ఎండినవైనా, పండినవైనా వండటమే!" ఒక కాయను చేతిలో పట్టుకుని, ముద్దుగా నిమురుతూ అన్నాడు వంకాయల పిచ్చి వరం.

మూతి మూడువంకర్లు తిప్పింది సుందరం.

"పెళ్ళైన కొత్తల్లో కూడా నా బుగ్గలను అంత మృదువుగా నిమరలేదు ఏనాడూ..."

"ఏనాడూ నీ బుగ్గలింత మెత్తగా లేవు మరి..." ఆక్షేపించాడు వరం, సుందరం బుగ్గను పట్టుకొని పరీక్షించబోతూ.

"ఏదీ... ఈ ఎండిపోయిన వంకాయల్లాగానా? సిగ్గులేకపోతే సరి. ముందిక్కడినించి పొండి!" ఉక్రోషంతో గట్టిగా అరిచింది సుందరం.

“వెళ్తాగానీ, నువ్వుమటుకు కొత్తిమీర కారం పెట్టి మహత్తరంగా వండు ఈ వంకాయల్ని!” చెప్పి, చటుక్కున ముందుగదిలోకి పారిపోయాడు వరం. జరగబోయే యుద్ధాన్ని ముందే తెల్లజెండానెత్తి ఆపుచేస్తూ!

తనలో తనే నవ్వుకుంది సుందరం. ఆమెకు తెలుసు, వరానికి వంకాయలంటే ఎంత ప్రాణమో! ఆఖరికి ఆరేళ్ళనాడు జరిగిన పెళ్ళిలో కూడా ‘ఏం కూరలు చేయించమంటారు?’ అంటూ, అత్తగారు, మామగారు ఏవేవో కూరగాయల పేర్లు చెప్తుంటే, వరం మటుకు చాలా గట్టిగా, “గుత్తివంకాయ కూర మటుకు తప్పనిసరిగా చేయించండి! వేరే ఏమీ లేకపోయినా, ఆఖరికి స్వీటు లేకపోయినా ఫరవాలేదు!” అని ప్రకటించేసాడు.



“ఒరేయ్! మన చుట్టాల్లో సగంమంది వంకాయను కాశీలో వదిలేశార్రా!” అని మొత్తుకుంటున్న తండ్రి మాటలను ఏమాత్రం లెక్క చెయ్యలేదు వరం.

“వాళ్ళకి వేరేకూర చేయించు నాన్నా, వంకాయకూర లేకపోతే మటుకు నేను ముద్దెత్తను. తరువాత నీ ఇష్టం!” అని బెదిరించాడు.

ఆఖరికి అలకపాన్పు మీద, ‘ఏం కావాలి బాబూ?’ అని మావగారు భయపడుతూ అడిగితే “నవనవలాడే వంకాయలు అల్లం, పచ్చిమిర్చి దట్టించి కూర వండించి పెట్టండి” అనడిగిన పిచ్చిమానవుడు వరం.

ఆ దెబ్బతో అత్తారింట్లో ఏ పండక్కి వరం వెళ్ళినా… వంకాయకూర తప్పనిసరి! ‘కొత్తబట్టలు పెట్టకపోయినా ఏమీ అనుకోని మా అల్లుడు, వంకాయకూర వండకపోతే మటుకు మొహం మాడ్చుకుంటాడమ్మా!’ అని అత్తగారు ఇరుగుపొరుగుతో చెప్పుకునేది.

“మా అల్లుడు బంగారం! ఒక్క వంకాయలు తప్ప మరేమీ అడగడు. మావగారికి ఇంతకంటే మంచి అల్లుడెక్కడ దొరుకుతాడు?” అని బతికున్నన్నాళ్ళు పొగిడి, పొగిడి ఆపై పొగడపూలదండ వేయించుకున్నాడు మావగారు.

ఇక సుందరలక్ష్మి తమ్ముడైతే, “మాయాబజార్లో ఘటోత్కచుడు… అన్నిరకాల వంటలూ నిమిషంలో మాయం చేసినట్లు, బావగారు వంకాయకూర చేస్తే, ఎన్నికిలోల కూరనైనా ‘ఉఫ్’మని ఊది పారేస్తారే!” అంటూ సుందరలక్ష్మిని ఈనాటికీ ఏడిపిస్తుంటాడు.

అంతదాకా ఎందుకు? సుందరలక్ష్మిని ఆ అమ్మాయి సుగుణాలని, సౌందర్యాన్ని వినీ, కనీ, వెంటపడి పెళ్ళాడాడా వరం? ‘సుందరమా, వంకాయలా? రెండింట్లో ఏది ఎక్కువ ఇష్టం’ అంటే, సుందరం ఎదురుగా లేనప్పుడు ధైర్యంగా ‘వంకాయలే’ అని చెప్పేస్తాడు. అయితే సుందరం ఎదురుగా ఉంటే మటుకు ఆ జవాబు “సుందరం వండిన వంకాయలు”గా మార్చాల్సొస్తుందనుకోండి, అది వేరే విషయం!

అటువంటి వరానికి కొత్తగా బదిలీ అయి వచ్చిన ప్రదేశంలో వంకాయలు దొరక్కపోవటం, ఎంత మానసికవ్యథో మీరే చెప్పండి! ఒకవేళ దొరకటమంటూ జరిగితే ఇదిగో ఇలానే. ఎండినవో, పండినవో, పుచ్చువో, చచ్చువో! అవి ఎలాంటివి అయినా కొనకుండా మానటం అసలెలా కుదురుతుంది? అందునా వరానికి! అవి పుచ్చువంకాయలైనా సరే, వాటిలో బాగున్న భాగాలను వేరుచేసి, వండి పెట్టక తప్పట్లేదు సుందరానికి. అందుకే ఆ వాపోవటం! ఇష్టమైన విషయాల్లో దూషణాలను భూషణాలుగా, తిరస్కారాలను పురస్కారాలుగా భావించటం వరానికి వెన్నతో పెట్టిన విద్య! అందుకే పెళ్ళాం వెయ్యి తిట్టినా, లక్ష తిట్టినా వంకాయలను కొనకుండా మానడు!

ఏదో కాలం ఇలా సాగిపోతుండగా ‘వానొకచోటా, పిడుగొక చోటా’ అన్నట్లు వరం పనిచేసే సంస్థలో ఏ శాఖలోనో, ఎక్కడో, ఎవడో అవినీతికి పాల్పడ్డాడని మొత్తం ఉద్యోగులందరినీ బదిలీలు చేసి పడేసారు. ఆ బదిలీలలో బెంగళూరు శివార్లలోని ఒక శాఖకు వెళ్లాల్సి వచ్చింది వరానికి. ఇల్లు సర్దుకోవటం పూర్తిగా అవకుండానే, మళ్ళీ బదిలీ అయినందుకు విసుక్కుంటున్న భార్యను వెంటబెట్టుకుని, వేలాడే మొహంతో బెంగళూరు చేరాడు వరం. వేలాడే మొహం ఎందుకంటే బెంగళూరులో మంచి వంకాయలు దొరుకుతాయో, లేవో అని బెంగ!

రెండురోజులు హోటల్లో తిన్నా, వంట చేసుకోక తప్పదు కదా! వరానికి బయటతిండి పడదాయే! మరునాటినుంచి వంట మొదలుపెట్టటానికి ఆరోజు సాయంత్రం సుందరం ఇచ్చిన కూరలసంచీ తీసుకుని, వెధవ జీవితాన్ని విసుక్కుంటూ, మార్కెట్ వెతుక్కుంటూ బయల్దేరాడు వరం.

గంటైంది... రెండు గంటలైంది! వరం ఇంటికి రాడే! అసలే కొత్తప్రదేశం. సుందరానికి తారెత్తింది. ఫోన్ చేసింది.

"వచ్చేస్తున్నాను, మరో పదినిమిషాల్లో ఇంట్లో ఉంటాను. వివరాలు వచ్చాక!" అటునుంచి వరం గొంతు బాధతో కూడిన సంతోషంతో వినిపించింది. సుందరానికి పరిస్థితి అర్థం కాలేదు.

"బాగానే ఉన్నారు కదా?" అడిగింది అనుమానంగా.

"బ్రహ్మాండంగా ఉన్నాను." అన్నాడు వరం అదే బాధను అణచుకుంటున్న సంతోషపు గొంతుతో.

మరో పదినిమిషాల్లో అన్నట్లుగానే ఇంట్లోకి అడుగుపెట్టాడు వరం. మోచేతుల మీద దోక్కుపోయిన గాయాలు, పాదాలపైన చినిగిన పాంటు, చేతిలో తీసుకుపోయిన సంచితో పాటు మరో పెద్ద కూరల సంచీ! సుందరం మనసు ఏదో కీడు శంకించింది.

"ఏమైంది?" అంది అనుమానంగా చూస్తూ.

విజయగర్వంతో నవ్వుతూ రెండు కూరగాయల సంచీలనూ బోర్లించాడు వరం. సుందరానికి నిలువుగుడ్లు పడ్డాయి.

"మార్కెట్ త్వరగానే దొరికింది. కానీ అందులో వంకాయలు లేవు. నాకేమో వంకాయలు తినాలని ఒకటే ఇదిగా ఉంది. మార్కెట్లోనే ఒకతన్ని అడిగితే, ఆ పుణ్యాత్ముడు రెండువీధులు దాటాక ఎడమవైపు ఉన్న మూడోవీధిలో ఒకతను ఇంట్లో వంకాయలు కాయిస్తున్నాడనీ, అతని దగ్గర లేని వంకాయలు ఉండవని చెప్పాడు. ఎగిరి గంతేసి, 'ఎలా వదిలేస్తాం వంకాయలనని' వెతుక్కుంటూ వెళ్ళి, మొత్తానికి అతని ఇల్లు కనిపెట్టాను. అయితే చీకటి పడుతోంది కదా, ఇల్లు కనుక్కున్న సంబరంలో, లోపలకు వెళ్ళబోతూ చూసుకోకుండా అక్కడే పడుకుని ఉన్న కుక్కమీద కాలు వేసా. అదికాస్తా నా పిక్క పట్టుకుంది. చెప్పట్టుకు ఒకటిచ్చుకున్నాక వదిలిందనుకో... దాంతో పక్కనే ఉన్న డాక్టర్ దగ్గరకి పోయి ఇంజక్షన్ తీసుకున్నా. ఈ హడావిడిలో దోవలో బురదలో కాలుజారి పడ్డా! ఈ చిన్నచిన్న దెబ్బలదేముందిలే గానీ, మొత్తానికీ భలే వంకాయలు సాధించా!"

గుక్క తిప్పుకోకుండా అతను చెప్పింది వింటూ, గుడ్లు తిప్పుకుంటూ నేలమీద దొర్లుతున్న వాటిని చూస్తోంది సుందరం... ఆకుపచ్చ వంకాయలు గుండ్రటివి, పొడుగాటివి, పెద్ద కడపబాంబు రకం వంకాయలు, మామూలు వంకాయలు గుండ్రటివి, పొడుగువి, మసాలాకూరకి పనికొచ్చే పొట్టి వంకాయలు.... ఆరురకాల వంకాయలు ఒక్కోటి కిలో చొప్పున వంటిల్లంతా పడి దొర్లుతున్నాయి! నివ్వెరపోయి తనవంక చూసిన భార్యామణిని పళ్ళికిలించి నవ్వుతూ చూస్తూ అన్నాడు వరం, "వారానికి సరిపడా కూరలు తెచ్చా!"

# 'పట్టుచీరలు' పని చేస్తాయా?

డా. శాంతినారాయణ
✆ 8074974547

**విశిష్ట అతి కథ**

***"నీ చీర, ఎంతో సాహసంతో తన మాన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ఈ యువకుని ప్రాణాలను కాపాడడం చాలా గ్రేటమ్మా! ఈ దేశంలో ఏ పట్టుచీరయినా ఎప్పుడైనా ఎక్కడైనా ఇంతటి సాహసం చేయగలదా పెద్దాయనా?" అంటూ ఆ ఇద్దరూ పెద్దాయన వైపు చూసినారు. ఆ ప్రశ్నకు జవాబు కనిపించని ఆ పెద్దాయన పెదవి విరుస్తూ తల అడ్డం తిప్పినాడు.***

"ఏమే ద్రౌపతీ బాగుండావా? ఎట్లుంది నీ తుగడా గుడ్డల యాపారం? ఈ మద్దెలో లంగాలూ జాకెట్లు గుడకా కుడతావుండావంటనే!" వీధిలో చిల్లరంగడి దగ్గర కనిపించి అడిగింది వరలక్ష్మి.

"బాగుండానే రాములూ! నువ్వెట్లుండావు? చానా దినాలకు కనిపిస్తివి, యేమిటి కొత్త సంగతులు?" బదులు ప్రశ్న వేసి అడిగింది ద్రౌపది.

"మన మద్దె తరగతి బతుకుల్లో కొత్త సంగతులు ఏముంటాయి ద్రౌపతీ? మామూలే! నిన్న సంగతులే ఈ పొద్దు, ఈ పొద్దుటి సంగతులే రేపు! దినదినమూ కొత్త సంగతులుండే బతుకులా మనవి?" షరా మామూలే అన్నట్లు చెప్పింది రామలక్ష్మి.

"అది సరే గాని, నా పేరు ద్రౌపతి కాదు, ద్రౌపది అని ఎన్నిసార్లు చెప్పినానే తల్లి! ప్రతిసారీ మర్చిపోయి, 'ద్రౌపతీ' అనే అంటా వుండావు! నాకు పతి వుండగా నేను పతిని కావడం ఏమిటే?" అని నవ్వుతూ మందలించింది ద్రౌపది.

"నాకు నీ పేరు బొలే తికమకగా వుంటుందే! శానాసార్లు అడగల్లనుకుండాను, ఇంతకీ ద్రౌపది కీ, ద్రౌపతికి తేడా యేమిటే?" అంటూ తన సందేహాన్ని వెలిబుచ్చింది రామలక్ష్మి.

"ద్రౌపది అంటే దృపదమారాజు కూతురంట! ద్రౌపతి అనే పదానికి అర్థం ఏదీ లేదంట అని మా నాయన చెపుతావుంటాడు. భారత కథలోని ద్రౌపది అంటే మా నాయనకు చాలా ఇష్టమంట రాములూ! అందుకే ఆయమ్మ పేరు నాకు పెట్టినారంట! సదువుకుండేది ఐదో తరగతి వరకే అయినా.. మా నాయన బారత రామాయన బాగవతాలు బ్రహ్మాండంగా చదువుకుండాడే! అందులో ద్రౌపది గురించీ, ఆయమ్మ గునగనాల్నీ గురించి బోలే చెబుతాడు. కథలో ఆయమ్మ నామాదిరే చామనచాయతో

వుంటాదంట! గొప్ప అందగత్తెంట! ఎంతంగత్తంటే, కొడుకులు పెండ్లి వయసుకొచ్చినా కీశకుడు, ఆయమ్మ అందాన్ని చూసి మురిసిపోయి, ఆయమ్మ పొందు కోసరం, తానేమైపోయినా పరవాలేదనుకుండాడంట? అటువంటి పేరమ్మా నాది!' అంటూ తన పేరు వెనకున్న కథ చెప్పింది ద్రౌపది.

"మీ నాయన నీకు ఈ పేరు ఎందుకు పెట్టినాడు ఇప్పుడర్థమైందే తల్లీ! ఇంగ పొరపాట్న గుడకా నిన్ను ద్రౌపతీ అని పిల్చను లేవే ద్రౌపదీ! మొత్తానికి మీ నాయన నీకు ఈ పేరు పెట్టినందుకేనేమో.. ఆ ద్రౌపది మాదిరి, ఈ ద్రౌపది, ఇద్దరు పిల్లలు పుట్టి, ముప్పైయేండ్లు దాటినా ఇంత అందంగా వుండేది! ఈ అందాన్ని వదులుకోల్యాకనే కావొచ్చు, మా సీన అన్నయ్య నీ సుట్టూరా తిరిగిండేది! నేను మొగోన్నయ్యి పుట్టింటే, నీ పక్క ఇంగొగ మొగోన్ని సూడనిచ్చిందునేమే? మా అన్నయ్య నీకు ఏమి తినిపిస్తావుండాడో గానీ వయసొచ్చేకొద్ది ఎంతందంగా కనిపిస్తావుండావో! నిన్ను చూస్తావుంటే నాకే కన్ను కుట్టుతావుంది!' అంటూ పెదవులు కొరుక్కుంటూ, నడుము ఒంపులో గిచ్చింది రాములు.

"ఏయ్, బజార్లో ఏమిటీ అల్లరి సేస్తలు? సిగ్గుందా లేదా? పొగిడింది చాలు గానీ, ఊరకనే నోర్మూసుకొని రా!" కొంటెగా చూస్తూ ఇంటి వైపు నడిచింది ద్రౌపది.



"పొగడ్తలు గాదే, నిజం! ఈ సీర కట్టులో ఎంతందంగా వుండావో తెలుసునా? ఈ సొట్టబుగ్గలూ, కోటేరేసిన ముక్కూ, శారదేసి కండ్లు, బుల్లి గడ్డము, బొంగరం మాదిరుండే ఆ మెడా, పైట కొంగులో దాగనంటా, వుండే ఆ గుబ్బలూ, వుయ్యాల జంపాలాడే ఆ నడుమూ, చకచకలాడే ఈ పిర్రల మీద నాట్యమాడే జడా, అబ్బా, ఎంతందంగా వుండావంటే..!' అంటూ సమ్మోహం చెందసాగింది రామలక్ష్మి.

"ఇదేమిటే, నీకేమైనా కైపెక్కిందా?.. పొగిడేకి ఈ కర్రిదే కనిపిచ్చిందా నీకు?" అని బుంగమూతి పెట్టి చిరుకోపం నటిస్తూ ముందుకు నడిచింది ద్రౌపది.

"నిన్ను కర్రిదని యేవురన్నారే? అప్పుడెప్పుడో ఏడోక్లాసులో సదివేటప్పుడు, మా కంటే రోంత నల్లగా వుంటావని జతగాల్లందరము నిన్ను 'కర్రిదానా' అని ఊరకనే తమాషాగా అంటూ నిన్ను ఏడిపించినాము గాని చామనచాయ రంగంటే మన తెలుగోల్ల సొత్తే!" అంటూ చిన్ననాటి చిలిపి చేష్టలని గుర్తుచేసింది రాములు.

"సరే సరే, ఈ రంగులూ, నీ పొగడ్తలు ఇంగ పక్కన బెట్టి, ఇంట్లోకొచ్చి రోన్ని మజ్జిగ తాగి, నీ కైపు తగ్గించుకొని పోదువురావే తల్లీ! శానా దినాలయినంక కల్సుండాం, రొంత సేపు కుచ్చోని పోదువురా!" అంటూ వాకిలి తీసి లోపలికి పిలిచింది ద్రౌపది. ద్రౌపది వెంట లోనికెళ్లి మొదట హాల్లోనే ఒక మూల కుట్టు మిషను, దాని పక్కనే ర్యాక్ లో అడ్డంగా అమర్చుకున్న పైపులకు, యాంగర్స్ తో వేలాడుతున్న ముప్పై, నలభై కొత్త జాకెట్లూ, ఒక ర్యాక్ అరల నిండా కుట్టి మడతలు పెట్టిన లంగాలూ, రెండు ర్యాకుల్లో తుగడా గుడ్డలూ చూసి "పెద్ద కార్ఖానా పెట్టుకుంటావు గదే! యాపారం బాగనే ఉన్నట్లుందే!" అని సంతోషపడింది రామలక్ష్మి.

"పరవాలదే రాములూ! ఈ మద్దెనే గద్వాల కాటన్ సీరలు గుడకా తెచ్చుకోని అమ్ముతూంటాను. లోపలకి రా, సీరలు సూస్తువు" అంటూ పక్క గదిలోకి పిలిచి చూపించింది ద్రౌపది.

రకరకాల డిజైన్స్ లో ఉన్న సీరల్ని చూసి ఆశ్చర్యపోతూ, "శానా బాగుండాయే! మొత్తానికి లంగా గుడ్డలూ, తుగడాబట్టలూ, సీరల యాపారాన్ని పొందిగ్గా చేసుకుంటా, ఇంగొగ పక్క జాకెట్లు కుట్టుకుంటూ నాలుగురాల్లు కూడబెట్టుకుండే వొనారు చూసుకుండావులే ద్రౌపదీ! ఇంకేం పరవాలేదులే!" అంటూ ముందరి హాల్లోకి వచ్చి కూర్చుంది రామలక్ష్మి.

ద్రౌపది వంటగదిలోకి వెళ్లి, రెండు గ్లాసుల్లో మజ్జిగ తిరగ్గొట్టుకొట్టుకొని వచ్చి, ఒక గ్లాసు రామలక్ష్మికిచ్చి, ఆమె పక్కనే కూర్చుని మజ్జిగ తాగుతూ, "పరవాలేదు రాములూ! మిగులుపాటు ఎట్లున్నా, దిగుల్యాకుండా సంసారం గడిసిపోతావుంది. పిల్లాలిద్దర్నీ కానీవెంటు స్కూల్ లో సదివిచ్చుకుంటా వుండాం. ఈడే ఇందిరమ్మ కాలనీలో నాలుగు సెంట్లు జాగా గుడకా తీసుకుంటాం! దేవుని దయవల్ల ఇప్పటికేమో బాగనే వుంది! కాలం కలిసొస్తే నువ్వన్నేట్ల నాలుగు దుడ్లు మిగిలచుగుండే మార్గమైతే చూసుకుంటాం రాములూ!' అంటూ సంతృప్తిని వెలిబుచ్చింది ద్రౌపది.

"శానా సంతోసమే, గార్లదిన్నె వదిలి ఈ కల్లూరు సేరుకొని మంచి పని చేసినావులే! ఈటికొచ్చిన మెదట్లో ఆ తరిమెల రోడ్డు పక్కనుండే ఇంట్లో కాపురం ఉన్నెప్పుడు, ఇల్లు ఇంత కలకలగా లేదే! ఈ కాలనీకి వచ్చినంక అన్నెందాల బాగున్నట్లు వుంది కదా! సీన అన్నయ్య నువ్వు శానా దూరం ఆలోచెన జేసి, ఆ గార్లదిన్నె వొదిలి ఈడ జేరుకోవడం, మంచి పన్జేసినారు. లేకుంటే ఆడ స్కూలు పిల్లోల్లకు నువ్వుక్కదానివే మధ్యాహ్నం భోజనం వండి పెడతా ఎంత కస్టపడతా వుంటివి!' అంటూ గతాన్ని గుర్తు చేసింది రామలక్ష్మి.

ఆ మాటలతో వెనకటి బాధల్నీ, అనుభవాల్నీ జ్ఞాపకం చేసుకుంటూ బరువుగా నిట్టూర్చింది ద్రౌపది.

“కష్టపడకుంటే మన సంసారాలు నడుస్తాయా రాములూ? కష్టం ఎక్కువయినందుకు కాదు గానీ, మానం పోగొట్టుకోడానికి మనసు రాక, ఆ బాడకావు పని వదులుకుంటినే! ఆ పని నాకిచ్చినందుకు ప్రతినాబట్టా సొంగ కార్సుకుంటా కుక్క మాదిరి దగ్గరకు వచ్చేదే! 'నా రెకమెండేసన్ తోనే నీకు ఉద్యోగ మొచ్చుండేది, ఈ పనికి ఎంతమంది పోటీ పడినారనుకుంటివి? రోంత నన్ను చూసుకుంటే నీకు పర్మినెంటుజేయిస్తా!' అంటా మండల ప్రెసిడెంటుగాడు, వారానికొగసారి యాదో వొగ ఒక సాకుతొ స్కూలు దగ్గరికొచ్చి, రూములేకి పిలిపిచ్చుకొని సిగ్గిడిసి అడిగేదే! యండీవో గాడొచ్చి అదని ఇదని బెదిరిచ్చి, ఆఫీసుకు పిలిపిచ్చుకోని దయతలసినట్ట మాట్లాడి, వగలు సెస్టలు చేస్తా గాలమేసేదే! ఇంగ యెడ్మాస్టరు గాడయితే దినామూ కన్ను గీటతా, యాదో ఒక సొట్టబెట్టి దగ్గరకొచ్చి, మొగంలో మొగం బెట్టి సన్నగ బతిమాలేదే. అడ్డమైనోడల్లా వొచ్చి నాలిక సప్పరించేదే! యేమి గొడవజేస్తే యేమయితాదో, తినేకూడు, యాడ అందకుండా పోతాదో, యాడ బతుకు గబ్బయిపోతాదో అని మాటల్తోనే అందరికీ ఆశ జూపిస్తా, అయిదారు నెలలు! అట్లే పనిజేస్తిని రామలక్ష్మి. ఎప్పుడైనా పొరపాట్న యెదల మిందుండే సీర కొంగు పక్కకు బోతే, సిగ్గుతో ఆ పక్కా ఈ పక్కా జూస్తా కొంపలు మునిగిపోయినట్ల యదారు పడతా బిరబిరా కొంగు సర్దుకుండే దాన్ని, ఆ స్కూలు కాడ మధ్యానం భోజనం తయార్జేసే సాట, సీర కుచ్చేండ్లు పైకి ఎగజెక్కి ముట్లుడిగిన దాని మాదిరి వంటొండుతా వుంటే, మనసు నలిగిపోయ్యేది రాములూ! అందికే ఆ పన్జేసేకి కడాకు నావల్ల కాల్యా! ఇంట్లో మీ అన్నయ్యేమో, నేను ఆ పని మానేస్తే ఇంటందరూ లక్షనంగా దినామూ రెండు పుట్లా తినే కూట్లో మన్ను పోసుకున్నట్లయితాదని, నెలనెలా చేతికొచ్చే జీతాన్ని చేజేతులారా పోగొట్టుకుంటే యెట్లని ఇట్లా నాతో చెప్పనూల్యాక, అట్ల నేను ముడుసుకోని పోతావుంటే సూడనూల్యాక మద్దెలో నలిగిపోయినాడు రాములూ! ఇంగొక పక్క, పదో తరగతి వరకూ సదువుకోనుండే తనకు యాడా నాలుగైదు వేలొచ్చే ఒక సన్న వుద్యోగం రాకపాయెనే అని దిగుబుర్లయినాడు. మనిసేమో అప్రుతమాట్లాడవాడు, అట్లా వాన్ని ఇంకా యాల ఇబ్బంది పెట్టాలని గెట్టిగా ఆలోశెన జేస్తి రామలక్ష్మీ! ఈ దేశెంలో ఆడదానికి మానం కంటే ముక్కెమైంది ఇంకేముందే? ఆ వొచ్చే నాలుగు గుడ్డ కోసరం మానాన్ని అమ్ముకొని యాలా బతకల్ల? కండలుండాయ్, కూలిపని చేసి ఆ మాత్తరం సంపాదించ్చుకోలేనా అని గెట్టిగా నిర్నయించుకోని ఆ కొంపనొదిలిపెట్టి ఈ కల్లూరికొచ్చి సేరుకుంటిమి రాములూ! వొచ్చిన యాలావిసేశమేమో గానీ అన్నీ లచ్చనంగా కుదురుకుండాయి. మీ అన్నయ్య గుడకా, ఆ యెలకంటోల్ల రైసు మిల్లులో గుమస్తాగా సేరుకుంటాడు. ఇప్పుడు మనసుకు నిమ్మలంగా వుంది” అని బతుకు వివరాలన్నీ చెప్పి రామలక్ష్మి సంసారం గురించి అడిగింది ద్రౌపది.

తమ ఇద్దరి స్వగ్రామమైన 'ముంటిమడుగు' సంగతుల్ని గుచ్చి గుచ్చి అడిగింది. అన్నీ వివరంగా చెప్పింది రామలక్ష్మి. తన మొగుడు ముంటిమడుగులో ఈ మధ్యనే ఇటిక పెల్లల బట్టీ పెట్టుకున్నాడనీ సంసారానికి ఇబ్బందేమీ లేదని తెలిపింది.

వాళ్లు మాట్లాడుతూ వుండగానే అదే కాలనీలోని సీటీ గుడ్డలు అమ్ముకునే వసంత ఆ వీధి గుండా ముందుకు పోతూ ఆ ఇంటి వాకిలి దగ్గరకొచ్చి, “రేప్పద్దన్న సీటీ గుడ్డలు తెచ్చుకుండేకి నేను పామెడికి పోతాఉండాను, నువ్వూ వస్తావా ద్రౌపదీ?” అని అడిగింది.

“నేనే సందకాడ మీ ఇంటికాటికొచ్చి పామిడి కి పొయ్యే సంగతి అడగల్లని అనుకోనుంటిని వసంతా! నువ్వే వొచ్చినావు, ఆ రంగరాజోల్ల వోల్ సేల్ సాపులో పోయిన వారం తెచ్చిండే వాయిలు సీరల్లో రెండు సీరలు నట్టనడిమద్యలో నేతలోనే

నాలుగు పోగులు ల్యాకుండా వొచ్చినాయి. అవి యెనిక్కిచ్చి వేరేటివి తీసుకుని రావల్ల. పదాంలే వసంతా! పద్దన్నే టిఫిను ముగిచ్చుకొని పదాంలే!" అని ద్రౌపది తన అంగీకారం తెలపడంతో ఆమె వెళ్ళిపోయింది.

చాలా రోజుల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితురాలు రామలక్ష్మిని మధ్యాహ్నం భోజనానికి బలవంతంగా నిలుపుకుని, వంటపని మొదలు పెట్టింది ద్రౌపది. స్నేహితురాలికి సహాయపడసాగింది రామలక్ష్మి. వంటపని చేస్తూ ఇద్దరు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. మాటల సందర్భంలో తన మొగుడు శ్రీనివాసులు టైలరింగ్ కూడా నేర్చుకున్నాడని, చిన్నపిల్లల అంగీలకు, నిక్కర్లకూ ఆల్తి ప్రకారం తానే కటింగ్ చేసి పెట్టి, మిల్లుకు పోతాడని, పిల్లలు కూడా చిన్నచిన్న పనులన్నీ చేసుకుంటూ తనకు సహాయపడతారని మురిసిపోతూ ద్రౌపది చెప్పింది.

మధ్యాహ్నం భోజనానికి శ్రీనివాసులు ఇంటికొచ్చినాడు. 'అన్నయ్యా' అని నూరారా పిలిచే తన భార్య స్నేహితురాలిని ఆత్మీయంగా పలకరించినాడు. ముగ్గురూ కూర్చొని భోజనాలు ముగించినారు. ఎండ తీవ్రంగా వుండడంతో, సాయంకాలం వరకు అక్కడే గడిపింది రామలక్ష్మి. అర్జంటుగా నాలుగైదు జాకెట్లు కుట్టాల్సినవి ఉన్నాయని మనసు హెచ్చరిస్తున్నా, రాకరాక వచ్చిన స్నేహితురాలితో గడపడం కోసం మూడు నాలుగు గంటల సేపు, ఆ పనిని పక్కన పెట్టింది ద్రౌపది. నిండు మనసుతో నిర్మలంగా పలకరిస్తూ సొట్టబుగ్గలతో నవ్వులు కుమ్మరిస్తూ, వయ్యారంగా అటు ఇటు పారాడుతూ అందాలన్నీ వొలకబోస్తూ ముచ్చటగా కనిపించే ద్రౌపదితో, సాయంకాలం వరకూ మురిపాలాడి, బ్రహ్మాండంగా వానమోడం పట్టిందని, పల్లెలో పచ్చి ఇటుకల మీద ప్లాస్టిక్ పేపర్లు కప్పే పని వుంటుందని బయలుదేరి వెళ్ళిపోయింది రామలక్ష్మి.

★★★

రాత్రి బాగా పొద్దుబోయినాకా పెద్ద వర్షం పడడంతో, ఉదయం ఇంటి ముందున్న రోడ్డంతా బురద బురదగా మారింది. ఒక్కపూట స్కూలుకు పోకపోయినా పిల్లలు వెనకబడిపోతారన్న తాపత్రయంతో, అయిష్టంగానే వాళ్ళను స్కూలుకు ప్రిపేర్ చేసింది ద్రౌపది. శ్రీనివాసులు పిల్లల్ని స్కూల్లో వదిలి, అట్లే డ్యూటీకి పోవల్లని బయలుదేరుతూ, "ఎగవన భారీ వర్షం పడి, పెన్నేరు పారతావుందంట ద్రౌపదీ, పామిడికి సాయంకాలం పోతే బాగుంటాది గదా! ఈ పొద్దు మన కాలనీ గుండా పామిడికి పోయే బస్సులు కూడా తిరగవంట! బైపాస్ మీద కర్నూలుకు పోయ్యే ఎక్స్ప్రెస్ బస్సులు మాత్రమే పోతావుండాయంట! మిగతావన్నీ అనంతపురంలో ముఖ్యమంత్రి మీటింగ్ కు జనాన్ని తోలేకి మళ్లించినారంట! కాబట్టి సాయంకాలమో, రేపో పోయ్యేది మేలు ద్రౌపదీ! కాదు గూడదనుకుంటే ఆయమ్మ వసంత వచ్చినంక ఇద్దరూ కలిసి ఆ తరిమెల రోడ్డు క్రాసింగ్ దగ్గరికి పోతే ఆటోలు వుంటాయి, బై పాస్ మీద పోవచ్చు!" అంటూ సలహా ఇచ్చినాడు శ్రీనివాస్.

"అయ్యో, ఆ క్రాసింగ్ కాటికి పోయ్యేలోపల, ఈ పాత బ్రిడ్జి మింద పోతే, పామిడిలో సాపు దగ్గరికే సేరుకోవచ్చు గదా బావా? ఈడ్నుంచి ఎంతుంది, రెండు ఫర్లాంగుల దూరంలో యేరు, యేటి మింద నాలుగు ఫర్లాంగుల చప్పిడి, అది దాటుతూనే పామిడి, అంతా గలిపితే వొగ కిలోమీటరు గుడకా వుండదు గదా! దీనికల్లా ఆ క్రాసింగ్ కాటికి పోయి ఆడ ఆటో పట్టుకోని పోవల్లనా బావా? ఈడుండే పామిడికి పొయ్యేకి ఆటోవాళ్ళు వొగొగ మనిసికి యాభై రూపాయలు డిమాండ్ జేస్తే యెట్లిచ్చేది? యా ఆటో వద్దులే! యేం పర్వాలేదు. నీళ్లు గుడకా చప్పిడి బ్రిడ్జి మింది సలపాగ దొర్లుతూవుండాయంటలే! ఈ పెన్నేట్లో ఆ మాత్తరం నీళ్లు దొర్లడమే అబ్బురం! మనుసుల్ని దాట్నీకుండా పెన్నేరు పారడం యెవురైనా చూసినారా బావా?.. యేం పర్వాలేదు గానీ, నువ్వు జాగర్తగా, పిల్లోల్లను పిల్సికోనిపో, రోడ్డంతా బురద బురదగా వుంది, పిల్లోల్లు కింద

పదేరు!" అని జాగ్రత్తలు చెప్పి, మొగుని వెంట పిల్లల్ని పంపింది. తాను టిఫిన్ తిని తయారుపడి, వాపసు ఇయ్యవలసిన చీరలు రెండూ బ్యాగ్లో పెట్టుకొని, ఇంట్లో నుంచి బయటకు వచ్చింది ద్రౌపది. అంతలోనే వసంత వచ్చి కలుసుకుంది. ఇద్దరూ నడుస్తూ పెన్నేటి పాతబ్రిడ్జి దగ్గరికి చేరుకున్నారు.

జనమంతా తండోపతండాలుగా వచ్చి పారుతున్న ఏటివైపు ఆనందోత్సాహాలతో చూస్తున్నారు. ఎగువ భాగంలో కొంపలు కూలిపోయే విధంగా వానొచ్చిందేమో.. నీళ్లు నురగలు కక్కుతూ చప్పిడి మీద జేనెడు లోతున పారుతున్నాయి. దశాబ్దాల తరబడి ఎండిపోయిన పెన్నేరు.. పల్చగా పారుతూ జనానికి కన్నుల పండువగా వుంది. ఉత్సాహంతో పిల్లలూ యువకులూ కేరింతలు కొడుతూ చప్పిడి బ్రిడ్జి మీద పారుతున్న నీళ్లల్లో కొంతదూరం వెళ్లి, పెద్దలు గట్టిగా మందలిస్తూ కేకలు వేయడంతో వెనుతిరిగి వస్తున్నారు. కొంతమంది, 'ఇవేమి నీళ్లు' అని అనుకుంటూ ధైర్యంగా ముందుకు చూస్తూ పామిడి వైపు మెల్లగా అడుగులేస్తున్నారు. గట్టుమీద నిల్చుకొని ప్రవాహం వైపు చూస్తున్న కొంతమంది ముసలీముతకోళ్ళు, పెన్నేటి గురించి ఎప్పుడు విన్నారో ఎప్పుడు చూసినారో ఏమో గాని 'దీని పేరే పీనిగల పెన్నార్రా, నీల్లలోకి యేల దిగుతారు?' అని గొనుగుతున్నారు. వాళ్ళ గొనుగుళ్లు ఎవరికి వినిపించడం లేదు.

బ్రిడ్జి మీద పారుతున్న నీళ్ళు ప్రమాదకరంగానయితే కనిపించలేదు. అందుకే ముందుకు వెళుతున్నవాళ్ళు పెద్దగా ఇబ్బంది పడకుండా పోతున్నారు. కొంతమంది, ఏమి అవసరం ఉందో ఏమో కలియబలుక్కొని వరుసగా వొకరిచేతినొకరు పట్టుకొని సాగిపోతున్నారు. ముందుకెళుతున్న గుంపుని చూసి, పర్వాలేదులే అనుకుని ద్రౌపది చీర కొంగును భుజం మీద నుంచి కొంచెం కిందకి లాగి నడుముకు చుట్టి, కొంగు కొన భాగాన్ని బొగ్గిట్లోకి చెక్కుకుని నీళ్లలోకి దిగింది. తన ముందున్న ఒక యువకుని కుడి చేతిని ఆసరాగా ఎడమ చేతితో పట్టుకొని, తన కుడిచేతిని వసంతకు ఆసరాగా అందించి ధైర్యం చెప్పింది. వసంత అర్ధమనస్కంగా ద్రౌపది చేతినందుకుని మెల్లగా అడుగులు వేయసాగింది.

పదడుగులు ముందుకు పోయినాక వసంతకు ధైర్యం చాలలేదు. తటాలున ద్రౌపది చేతి నుండి తన చేతిని లాక్కుని వెనక్కిపారి వచ్చి గట్టెక్కింది. ద్రౌపది భయపడకుండా బ్యాగు సంకకు తగిలేసుకుని ఆ యువకుని చేయి పట్టుకుని ముందుకు వెళ్ళుతూ, పారే నీళ్లలో పాదం పైకెత్తకుండా నేల మీద మెల్లగా ముందుకు జరుపుకుంటూపోవాలని ఆ పిల్లవానికి సూచనలిస్తూ వుంది. ఏటి మధ్యలో చేరేసరికి ప్రవాహం కొంచెం పెరుగుతున్నట్లు కనిపించడంతో ఆ యువకుడు భయపడసాగినాడు. 'బ్రిడ్జి అంచుల్లో ఇనుప చువ్వలున్నాయని, అవసరమైతే చువ్వను పట్టుకోవచ్చునని, నీళ్ళు మోకాళ్ళ కింద వరకేవున్నాయని భయపడాల్సిన పనిలేదని' ఆమె ధైర్యం చెప్పసాగింది. అయినా ఆ పిల్లవాడు ధైర్యం కోల్పోసాగినాడు.

ఉన్నట్టుండి ప్రవాహంలో ఒక కల్ల తొడుగు కొట్టుకుని వచ్చింది. దాన్ని చూసి, పూర్తిగా భయపడి ఆ పిల్లవాడు ధైర్యం కోల్పోయి పట్టుదప్పి నీళ్ళల్లో పడి, బ్రిడ్జి పక్కనున్న గుంతలోకి జారిపోతూ 'అక్కా అక్కా' అని గట్టిగా అరవసాగినాడు. ఆ పిల్లవాని అరుపులు విని, ఈత రాదని అర్థం చేసుకుని గాబరాపడుతూ ఏమి చేయాలో దిక్కుతోచక, దగ్గరున్న ఇనుపచువ్వను గట్టిగా పట్టుకొని ధైర్యం తెచ్చుకుంది ద్రౌపది. ఆ ధైర్యంతోనే క్షణకాలం ఆలోచన చేసింది. మెరుపు మాదిరి యేదో స్ఫురించింది. వెంటనే తాను కట్టుకున్న చీరను లోపల లంగా వుంది కదా, యేం పరవాలేదులే అనుకుని సిగ్గును పక్కన పెట్టి విప్పదీసింది. చీర వొకవైపు కొనను చువ్వకు గట్టిగా ముడివేసి ఆ పిల్లవాని వైపు చూసింది. వాడు నిలదొక్కుకుని, నిల్చోడానికి సాధ్యంకాక దిగువ వైపున్న మరొక గుంతలోకి కొట్టుకొనిపోతూ ప్రాణభయంతో 'అక్క అక్క' అని

అరుస్తున్నాడు. తన ఆరు గజాల చీర తనకూ వానికి మధ్యవున్న దూరానికి సరిపోదనుకుని వెంటనే గబగబా బ్యాగులో ఉన్న రెండు చీరలనీ తీసి తడిపి, ఒకదాని కొసకు మరొక దాని కోసకు గట్టిగా ముడివేసి మొత్తం చీరతాడును చుట్టజుట్టి బలంగా వానివైపు విసిరింది.

ఆమె ఆలోచనా ప్రయత్నము ఫలించినాయి. ఆమె విసిరిన చీరలతాడు కొనభాగం, ఆ యువకునికి చేతులకు అందింది. అతడు దాన్ని లాగి పట్టుకోవడంతో, ఆ ప్రవాహం అతన్ని ముందుకు నెట్టలేకపోయింది. అతడు చీర తాడును గట్టిగా బిర్రుగా పట్టుకొని నీటిమట్టం లోతుగా లేని వైపు నుంచీ చప్పిడి (కాజ్ వే) దగ్గరికి రాసాగినాడు. ప్రాణాపాయం నుండి బయటపడి మెల్లగా అతడు కాజ్వే దగ్గరికి వొస్తూ వుండడం చూసి ద్రౌపది గర్వంగా తృప్తి చెందసాగింది.

నిజానికి కాజ్వే మీద దొర్లుతున్న నీటి ప్రవాహం నదీ ప్రవాహం మాదిరి ఉధృతంగా అయితే ఏమీ లేదు. కాజ్వే పక్కన ఇసుక కోసం తవ్విన గుంతలున్నచోట నీటి ప్రవాహం వేగంగా దుముకుతూ వుంది. అటువంటి ప్రవాహం కారణంగానే ఆ యువకుడు నిలదొక్కుకోలేక గుంతలోకి పడిపోయి కొంచెం దూరం కొట్టుకొని పోయినాడు. కాజ్వే పక్కన గుంతలు లేని చోట నీటి ప్రవాహం నెమ్మదిగా పోతూవుంది. చీరతాడును గట్టిగా పట్టుకొని ఆ యువకుడు ప్రవాహం తక్కువగా ఉన్న గుంతలులేని దిన్నెవైపు రాసాగినాడు. అతనికి జాగ్రత్తలు చెప్తూ సూచనలిస్తూ ద్రౌపది చీరతాడును తాను కూడా లాగుతూ ఆ యువకుడు కాజ్వే చేరుకోవడానికి సహాయపడుతూ వుంది. అంతలో ఒక పదిమందిని ఎక్కించుకున్న జీపు పామిడి వైపు వేగంగా వెళ్ళింది. అందులో ఉన్న మనుసులు ద్రౌపది వేపు చూస్తూ "యేట్లో నీల్లు ఇంగా యెక్కువయ్యేతట్ల వుండాయమ్మా, బిగ్గరగా ఆ పిల్లోన్ని బయటికి లాక్కుని యెల్లిపోమ్మా! యెవురేగాని నిల్లల్లేకి దిగి ఈ సప్పిడి మింద ఆ పక్కా ఈ పక్కా పోయ్యేకి భయపడతండారు. ఇద్దరు ముగ్గరం జీపు దిగి నీకు సాయంగా వచ్చేకి సాధ్యమయ్యేతట్ల లేద్దల్లీ" అంటూ, ఆగని జీపులో ముందుకెళ్ళిపోయినారు. జీపును నిలిపితే నీటి ప్రవాహం ఎక్కువయ్యి జీపును పక్కకు నూపుతుందేమోనన్న ఆందోళనతో డ్రైవర్, జీపును వేగంగానూ, జాగ్రత్తగానూ ముందుకు నడిపినాడు.

జీపు వేగంగా ముందుకెళ్లడంతో, ఆమె లంగా జాకెట్టూ తడిసిపోయినాయి. అదేమీ పట్టించుకోలేదామె. సాహసమయిన సహాయ రక్షణ మీద తప్ప, ఇక దేని మీదా ఆమె దృష్టి లేదు.

ఆరోజు మహా వీరాధివీరులతో నిండివున్న కౌరవ మహాసభలో దుశ్శాసనుడు తనను మానభంగం చేయడానికి తన చీరను బలవంతంగా లాగిపడేస్తుంటే, నిస్సహాయురాలై తన వక్షస్థలాన్ని రెండు చేతులతో కప్పుకుని, తన మానాన్ని కాపాడుకోవడానికి ఆరాటపడుతూ భగవంతున్ని ప్రార్థించింది భారత కథానాయిక ద్రౌపది. ఈరోజు అనుకోని ప్రమాదానికి గురై, యేట్లో పడి కొట్టుకొని పోతూ ప్రాణాపాయ స్థితిలో వొక అపరిచయ యువకుడు 'అక్కా కాపాడు, అక్కా రక్షించు' అంటూ ఆర్తనాదాలు చేస్తుంటే చూసి చలించిపోయి, తన మానాన్ని, చూడగానే పరస్త్రీ వ్యామోహమున్న మగవాణ్ణి వ్యామోహానికి గురి చేసే తన మానాన్ని, ఎవరెవరి చూపుల కోరల నుంచో అంతులేని అభిమానంతో రక్షించుకుంటూ వచ్చిన తన మానాన్ని లెక్క చేయకుండా, దాని మీద స్పృహే లేకుండా, పరాయి వ్యక్తి రక్షణలో సాహసోపేతంగా నిమగ్నమైంది ఈ ద్రౌపది. నిమగ్నమై అతనిని కాపాడే ప్రయత్నంలో తనను తాను మరిచిపోయింది.

అంతలోనే పామిడి వైపు నుంచి ఇరవైమంది మనుషులను ఎక్కించుకుని ఒక ట్రాక్టర్ వచ్చింది. ద్రౌపది చేస్తున్న సాహసాన్ని గమనించిన ట్రాక్టర్ లోని కొంతమంది మనుషులు, బలవంతంగా ట్రాక్టర్ని ఆపినారు. అందులో ఉన్న ఆడవాళ్ళతో పాటు

మగవాళ్లందరూ తన వైపు చూడడంతో అప్పుడు తన ఒంటి మీదున్న తడిసిన బట్టలను గురించీ, తన శరీర భాగాలను గురించీ, స్పృహ రావడంతోనే సిగ్గుపడుతూనే, కాజ్వే దగ్గరకొచ్చిన యువకునికి చేతులందించి పైకి లాగసాగింది ద్రౌపది. ట్రాక్టర్ లో నుంచి ఇద్దరు మగవాళ్ళు కిందకు దిగి జాగ్రత్తగా గైడ్ పోల్ (కాజ్వే అంచులో పాతేసిన ఇనుప పోల్) దగ్గరకు వచ్చి ఆ యువకునికి చేతులందించినారు. అతడు గట్టెక్కి, బ్రతుకు జీవుడా అని అనుకుంటూ కృతజ్ఞతాభావంతో ద్రౌపది వైపు చూసి కంటతడి పెట్టినాడు.

ద్రౌపది విజయానందంతో తృప్తి పడుతూనే ఎడమ చేతిని తన ఎద భాగానికి అడ్డం పెట్టుకొని, కుడి చేతితో ఐరన్ గైడ్ పోలుకు గట్టిగా కట్టిన తన చీరను బయటకు లాగడానికి ప్రయత్నించింది. అది, ప్రవాహంలో కొట్టుకుని తటాలున వచ్చిన ఈత కొమ్మలకు తగిలి పేలికలు పేలికలు కావడంతో చూసి దిక్కుతోచక సిగ్గు స్పురించడంతో, తన ఎత్తైన రొమ్ములకు రెండు చేతులూ అడ్డం పెట్టుకుని, అప్పుడు ఆలోచన చేయిసాగింది తన మాన సంరక్షణ గురించి! అంతలోనే ట్రాక్టర్ లో ఉన్న నడివయస్కుడు, 'తనకు లోపల నిక్కరుంది చాల్లే' అనుకుని నడుముకు చుట్టుకున్న అడ్డ పంచెను విప్పదీసి ఆమె మీదకు విసిరేసినాడు. ఆమె వెంటనే దాన్ని కప్పుకుని ఊపిరి పీల్చుకుంటూ ఆ మాననీయుని వైపు చూడసాగింది. ఎక్కువ సేపు ట్రాక్టర్ గానీ, మరెవరూ గానీ కాజ్వే మీద ఉండడం మంచిది కాదని, పెన్నేటికి ఎగువ భాగంలో కురిసిన భారీ వర్షం కారణంగా రెండు చెరువులు తెగిపోయి ఆ నీళ్ళన్నీ పెన్నానదిలోకి చేరుతున్నాయని, కాజ్వే మీద ఇంకా నీటి ప్రవాహం పెరగవచ్చుననీ, ద్రౌపదినీ, ప్రమాదం నుండి బయటపడిన వ్యక్తినీ, ట్రాక్టర్లో నుంచి దిగినవాళ్ళనూ.. అందర్నీ తొందరగా ట్రాక్టర్ పైకి ఎక్కమని డ్రైవర్ గట్టిగా చెప్పినాడు. అందరూ గబగబా ఎక్కడంతో ట్రాక్టర్ కల్లూరు వైపు కదిలింది.

ట్రాక్టర్ లో కూర్చున్న ఇద్దరు పెద్దవాళ్ళు ద్రౌపదినీ, ఆ యువకుణ్ణీ పరామర్శిస్తూ "చూచ్చూసి.. పారే పారే పెన్నేట్లోకి ఆడమనిషివి, ఒకదానివే యెలా దిగితివమ్మా? ఇంగ రోంతసేపుంటే ఏమయిండే దానివి? అంత అర్జెంటు పని ఏముండె తల్లీ? ఇంతకూ నువ్వెవరు సన్నోడా? యెట్ల జారి యెట్లోకి పడితివి? ఈ యమ్మెవరో నిన్ను కాపాడాల్లని దైర్రెం జెయిడం బాగానే వుంది గాని, యేట్లో నీళ్ళు ఇంగరోని వూబికింటే ఇద్దరూ యేమయిండేవాల్లు? గంగమ్మ తల్లి దగ్గిర మనుసులు యెంతటోల్లర్రా?" అంటూ వాళ్ళను మందలించినారు. మందలిస్తూనే ద్రౌపదిని అభినందించినారు. గుంపులోని ఇద్దరు ఆడవాళ్లు కొంచెం చదువుకున్నారేమో, ద్రౌపది సాహసానికి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినారు.

"నీ చీర, ఎంతో సాహసంతో తన మాన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ఈ యువకుని ప్రాణాలను కాపాడడం చాలా గ్రేటమ్మా! ఈ దేశంలో ఏ పట్టుచీరయినా ఎప్పుడైనా ఎక్కడైనా ఇంతటి సాహసం చేయగలదా పెద్దాయనా?" అంటూ ఆ ఇద్దరూ పెద్దాయన వైపు చూసినారు. ఆ ప్రశ్నకు జవాబు కనిపించని ఆ పెద్దాయన పెదవి విరుస్తూ తల అడ్డం తిప్పినాడు.

మధ్య తరగతి సాహస గమనంతో ట్రాక్టర్ కల్లూరు చేరుకుంది.




కథామంజరి

చదవండి .. చదివించండి

వార్షిక చందా రూ.200/-

ఉచిత సంచిక కోసం